www.trinetnews.com
# తెలంగాణ ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

**రామగుండం సహా**
**దేశవ్యాప్తంగా ఎన్ఐఏ సోదాలు**




2లో

**శంకర నారాయణ**
**అరణ్య శతకం ఆవిష్కరణ**



12

సంపుటి 01 సంచిక 15 ఎడిటర్ :వెంకటేశ్వర్లు రాపోలు మంగళవారం ఆగస్ట్ 25, 2026 పేజీలు:12 వెల.10/-

# తెలంగాణపై ఏంటీ వివక్ష?

## గుజరాత్ సీఎంకు అనుమతి.. నన్ను అడ్డుకుంటారా?

- ◆ అమెరికా పర్యటనను ఎందుకు అడ్డుకున్నారు?
- ◆ రాజకీయ కారణం ఏంటో కేంద్రం చెప్పాలి
- ◆ తెలంగాణకు వచ్చే పెట్టుబడులను అడ్డుకుంటున్నారు
- ◆ నన్ను అడ్డుకున్నా.. లక్ష్యాన్ని అడ్డుకోలేరు




**హైదరాబాద్:**
వికసిత్ భారత్ లక్ష్యంగా తెలంగాణ రైజింగ్ 2047 పేరిట పెట్టుబడుల ఆకర్షణకు తలపెట్టిన తన అమెరికా పర్యటనను కేంద్రం అడ్డుకోవడంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తెలంగాణ సీఎం పర్యటనకు నిరాకరించడం 4కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం అన్నారు. ఇది స్పష్టమైన రాజకీయ వివక్ష, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. వైబ్రెంట్ గుజరాత్ పేరుతో ఆ రాష్ట్ర సీఎం అమెరికాలో ర్యాలీలు చేశారని, పెట్టుబడుల కోసం ఎనిమిది రోజులు అక్కడ పర్యటించిన విషయాన్ని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తమ పర్యటనను ఎందుకు అడ్డుకున్నారో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రం పదే పదే తెలంగాణ వ్యతిరేక భావజాలాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించుకొనేందుకు కుట్రలు చేశారంటూ మండిపడ్డారు.

**◆ భాజపా నేతలు నా పర్యటనపై తప్పుదోవ పట్టించారు!**

లండన్ పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి మంత్రులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, భాజపా నేతల తీరును ప్రశ్నించారు. "రాష్ట్రాలకు కేంద్రం సహకరించకపోవడం మన సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. విద్యలో సహకారం, పెట్టుబడులను ఆకర్షించేందుకు అమెరికా పర్యటన తలపెట్టాను. బ్రిటన్‌కు అనుమతించి.. అమెరికా పర్యటనను కేంద్రం నిరాకరించింది. పెట్టుబడులు సాధన కోసం గతంలోనూ విదేశాలకు వెళ్లాం. కానీ ఈసారి లండన్‌కు అనుమతించి అమెరికా వెళ్లకుండా చేశారు. కేంద్రం వైఖరిని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ శ్రేణులతో పాటు విద్య, క్రీడల విధానాలు, పెట్టుబడుల విధానాన్ని ప్రోత్సహించడం ద్వారా యువతకు మేలు జరుగుతుందని నమ్మే వారంతా తప్పుబట్టారు. విదేశాంగ శాఖ నా పర్యటనను తిరస్కరించడంతో పాటు భాజపా నేతలు కొందరు నా పర్యటన వివరాలపై తప్పుదారి పట్టించేలా, వ్యక్తిగత ఆరోపణలు చేశారు. నా అధికారిక పర్యటనపై కేంద్రానికి అవాస్తవాలు చెప్పి తప్పుదోవ పట్టించారు.

**◆ 'రాజకీయ కారణం' అంటే ఏమిటి?**

నా విదేశీ పర్యటనలో ఎలాంటి గోప్యత లేదు. ఈ పర్యటనకు దరఖాస్తు చేసినప్పుడు అన్ని విషయాలూ స్పష్టంగా పేర్కొన్నాం. విద్య, క్రీడలు, రాష్ట్రంలో పెట్టుబడులకు అమెరికాలో ప్రఖ్యాత వర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని చెప్పాం. యూకే, యూఎస్ పర్యటనకు ఒకే తరహా వివరాలు ఇచ్చాం. నా పర్యటన మొత్తం షెడ్యూల్‌ను విదేశాంగ శాఖ ముందు ఉంచాం. కానీ, రాజకీయ కారణాల వల్ల అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరిస్తున్నట్లు విదేశాంగ శాఖ బదులిచ్చింది. రాజకీయ కారణంతో అనుమతి ఇవ్వడంలేదని విదేశాంగ శాఖ బదులిచ్చింది.

మిగతాది 2 లో

# కొండా సురేఖ వ్యవహారం..
## సీఎం రేవంత్ ఏమన్నారంటే..




**హైదరాబాద్:**
కాంగ్రెస్ పార్టీ నియమాలకు నేతలంతా కట్టుబడి ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రి కొండా సురేఖ కు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసుల అంశంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా సీఎం స్పందించారు. "పార్టీలోని నేతల క్రమశిక్షణ వ్యవహారాల గురించి నేను చర్చించను. ఆ విషయాన్ని క్రమశిక్షణ కమిటీ చూసుకుంటుంది. అన్నీ పరిశీలించి కమిటీ చర్యలు తీసుకుంటుంది" అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో కొండా సురేఖ జన్మదినం సందర్భంగా ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. సీఎం రేవంత్, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై సుస్మిత తీవ్ర విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో మంత్రికి టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆ వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కొండా సురేఖను కోరింది. దీనిపై మంత్రి వివరణ ఇస్తూ సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని.. ఈ విషయంలో తనను బాధ్యురాలిని చేయొద్దని



## విదేశాల్లో తలదాచుకున్న గ్యాంగ్‌స్టర్లపై ఉక్కుపాదం - అమిత్ షా

దేశంలో కుట్రలకు పాల్పడి విదేశాల్లో తలదాచుకున్న నిందితులపై భారత్ ఉక్కుపాదం మోపుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. దేశం విడిచి పారిపోయిన ముగ్గురు గ్యాంగ్‌స్టర్లను మలేషియాలో పట్టుకున్న దర్యాప్తు ఏజన్సీలు భారత్‌కు తీసుకొచ్చిన నేపథ్యంలో ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు.

2లో



## సెప్టెంబరు 7 నుంచి తెలంగాణ
# అసెంబ్లీ సమావేశాలు

**హైదరాబాద్:**
తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు సెప్టెంబరు 7 నుంచి ప్రారంభం కానున్నాయి. శాసనసభ, శాసనమండలిని ఎన్ని రోజులు నిర్వహించాలనే విషయంపై తొలి రోజు సమావేశం తర్వాత జరిగే శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ (బీఏసీ) భేటీలో నిర్ణయిస్తారు. ఈ వర్షాకాల సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టనుంది.



## తెలంగాణ మందు బాబులకు గుడ్‌న్యూస్..

**హైదరాబాద్:**
తెలంగాణలో మద్యం ప్రియులకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ గుడ్‌న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో త్వరలో కొత్తగా 121 రకాల లిక్కర్ బ్రాండ్లు అందుబాటులోకి రానున్నాయి. ఇందులో అంతర్జాతీయంగా పేరున్న బ్రాండ్లను కూడా ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

## ప్రభుత్వ పథకాలపై
# హైకోర్టు కీలక వ్యాఖ్యలు

- » కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యేలు ఇవ్వడమేంటి?
- » చెక్కుల పంపిణీ అధికారులు చేయాలి.. రాజకీయ జోక్యం వద్దు
- » పథకాల అమలులో అధికారుల పాత్రపై హైకోర్టు ప్రశ్నలు
- » ఎమ్మెల్యేల ద్వారా చెక్కుల పంపిణీ రాజకీయ జోక్యమే అని వ్యాఖ్య
- » దివ్యాంగుల ఆర్థికసాయం కొనసాగింపునకు హైకోర్టు అనుమతి
- » జీవో నం.4పై స్టే ఎత్తివేసిన హైకోర్టు
- » ఉచిత పథకాలపై గతంలోనూ హైకోర్టు కీలక వ్యాఖ్యలు
- » అవసరం ఉన్నవారికే ప్రభుత్వ సాయం అందాలన్న కోర్టు




2లో..

**హైదరాబాద్:**
ప్రభుత్వ పథకాలపై తెలంగాణ హైకోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబాకర్ పథకాలపై విచారణ చేపట్టిన తెలంగాణ హైకోర్టు.. వాటికి సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యేలు ఇవ్వడమేంటని ప్రశ్నించింది. దీనికి సంబంధించిన చెక్కులను అధికారులు ఇవ్వకుండా ఎమ్మెల్యేలు ఇవ్వడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు ఈ చెక్కుల పంపిణీ అంశంలో సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని హైకోర్టు ప్రశ్నించింది.

## త్వరలోనే తెలంగాణ ప్రభుత్వ సొంత 'రైడ్-హెయిలింగ్' యాప్!

తెలంగాణలో ఆటో, క్యాబ్ డ్రైవర్ల సంఘాలు నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వేగంగా స్పందించింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జరిపిన చర్చలు సఫలం కావడంతో డ్రైవర్లు సమ్మెను విరమించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల సంక్షేమం, ఆదాయ మార్గాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం కొన్ని సంచలనాత్మక నిర్ణయాలను వెల్లడించింది.

**◆ సొంత యాప్ రూపకల్పన**

ఓలా, ఊబర్ వంటి ప్రైవేట్ అగ్రిగేటర్ సంస్థలకు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ఐటీ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వమే ప్రత్యేకంగా ఒక 'రైడ్-హెయిలింగ్ యాప్'ను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి తెలిపారు.




2లో..




## 22ఏ బాధితులకు న్యాయం చేస్తాం: పొంగులేటి

- బాధితులు ఎవరూ భయపడొద్దు
- ప్లాట్ల బుకింగ్ డబ్బులు వాపస్
- స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి రిజిస్ట్రేషన్లు
- ఫాస్ట్‌ట్రాక్‌లో రిజిస్ట్రేషన్లు
- 22ఏ సమస్యపై ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు

2లో



మిగతాది 2లో

## రామచందర్‌రావుకు పొన్నం ప్రభాకర్ కౌంటర్

- చేతనైతే కేంద్రం నుంచి నిధులు సాధించండి
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై మొసలి కన్నీరు వద్దు
- పాత బకాయిలను విడతల వారీగా చెల్లిస్తున్నాం
- ఈ ఏడాది నుంచి అడ్వాన్స్ పేమెంట్‌కు చర్యలు
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉందా?



## ఖర్గేతో కొండా
# సురేఖ భేటీ

- కుమార్తె సుస్మిత వ్యాఖ్యలపై వివరణ
- గంటకుపైగా కొనసాగిన భేటీ
- పార్టీకి నష్టం కలిగేలా మాట్లాడొద్దు: ఖర్గే
- పార్టీ విషయాలు పార్టీ వేదికపైనే చెప్పాలి
- వ్యాఖ్యలపై ఇప్పటికే రెండుసార్లు



2లో

## రేవంత్ సర్కార్‌పై రాంచందర్‌రావు ఫైర్

» ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి » విద్యార్థులను ప్రభుత్వం అణచివేస్తోంది » ఓయూకు రూ.1,000 కోట్ల హామీ ఏమైంది? » రాహుల్ గాంధీకి రాంచందర్‌రావు సవాల్ » కాంగ్రెస్ సర్కార్‌ను గద్దె దించాలి

**హైదరాబాద్:**
తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశం మరోసారి రాజకీయ వేడిని రాజేసింది. విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వ బాటలోనే నడుస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తీవ్రంగా ఆరోపించారు. విద్యార్థులు, కాలేజీల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం అణచివేత ధోరణి అవలంబిస్తోందని మండిపడ్డారు.

# విద్యాశాఖ మంత్రులకు అభిజీత్ దీప్కే లేఖ

- ప్రాథమిక విద్య రాజకీయ సమస్య కాదు
- ప్రతి బిడ్డకు ప్రాథమిక విద్య హక్కు
- ప్రభుత్వ పాఠశాలలను అత్యవసరంగా పునరుద్ధరించాలి
- మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయ ఖాళీలపై వివరాలు ఇవ్వాలి



2లో

దేశంలోని అన్ని రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులకు కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే బహిరంగ లేఖ రాశారు. అందులో ప్రాథమిక విద్య అనేది రాజకీయ సమస్య కాదని.. ప్రతి బిడ్డ ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల లేమిని ఎత్తిచూపారు. వాటిని మెరుగుపరచడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

# 22ఏ బాధితులకు న్యాయం చేస్తాం: పొంగులేటి

మొదటిపేజీ తరువాయి
ప్రస్తుతం హైదరాబాద్ కోర్‌లో 22ఏ అంశం ఎంతో జటిలంగా మారిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ అన్నారు. 22ఏ బాధితులకు ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లో న్యాయం చేసి తీరుతుందన్నారు. హైదరాబాద్‌లో ఈ రోజు (సోమవారం) ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. అబద్ధాలతో ప్రతిపక్షం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని.. ఈ అంశంలో ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని మంత్రి తేల్చిచెప్పారు.
మంత్రి మాట్లాడుతూ.. ప్లాట్ల బుకింగ్ కోసం డబ్బులు చెల్లించిన వారికి నగదు వెనక్కి ఇస్తాం. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబరు పనిచేయడం లేదని బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలు చేస్తోంది. ఇప్పటివరకూ ఆ నంబర్‌కు వేలాదిగా కాల్స్ వచ్చాయి. క్యూర్ ప్రాంతంలోని రైతుల సమస్యలను చర్చించాం. స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి రిజిస్ట్రేషన్లు చేస్తాం. ఫాస్ట్ ట్రాక్‌లో రిజిస్ట్రేషన్లు చేస్తాం. అని మంత్రి అన్నారు.

### ♦ సెక్షన్ 22ఏ సమస్య ఏంటి?

రిజిస్ట్రేషన్ చట్టం, 1908లోని సెక్షన్ 22ఏ ప్రకారం ప్రభుత్వ భూములు, దేవాదాయ, వక్ఫ్ ఆస్తులు, అసైన్డ్ భూములు, భూదాన భూములు, కోర్టు వివాదాల్లో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్లను నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. అయితే ఇటీవల ప్రభుత్వం తీసుకవచ్చిన 'భూ భారతి'లో 2026 ఏప్రిల్‌లో రెవెన్యూ శాఖ నిషేధిత ఆస్తుల జాబితాను నవీకరించింది. ఈ ప్రక్రియలో అధికారులు సరైన పరిశీలన లేకుండానే జాబితాలను సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపారు. ఒకే సర్వే నంబర్‌లో కొంత భాగం ప్రభుత్వ భూమి ఉంటే, ఆ సర్వే నంబర్‌లోని మొత్తం ప్రైవేట్ పట్టా భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చడంతో ఈ గందరగోళం తలెత్తింది.
హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లో ఈ సమస్య తీవ్రత అధికంగా ఉంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి ఖరీదైన ప్రాంతాలతో పాటు, దశాబ్దాల క్రితం హుడా, హెచ్ఎండీఏ అనుమతులతో ఏర్పడిన కాలనీలు, అపార్ట్‌మెంట్లు కూడా ఈ జాబితాలో చేరాయి. రిజిస్ట్రేషన్ కోసం వెళ్లినప్పుడే తమ ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నాయని యజమానులకు తెలియడంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దీంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది.

# రేవంత్ సర్కార్‌పై రాంచందర్‌రావు ఫైర్

మొదటిపేజీ తరువాయి
ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1,000 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా కాలేజీ యాజమాన్యాలను ప్రభుత్వం ఒత్తిడికి గురిచేస్తోందని ఆరోపించారు. ఫీజు బకాయిలపై హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించిన తర్వాత కొంత మొత్తాన్ని విడుదల చేస్తామని చెప్పినా.. ఆ హామీ కూడా అమలు కాలేదని ఆయన అన్నారు. బకాయిల కోసం విద్యార్థులు, కాలేజీ యాజమాన్యాలు ఆందోళన చేస్తుంటే వాటిని అణచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

### రాహుల్ గాంధీకి సవాల్

ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కూడా రాంచందర్‌రావు టార్గెట్ చేశారు. "రాహుల్ గాంధీకి దమ్ముంటే తెలంగాణకు వచ్చి ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై మాట్లాడాలి" అంటూ సవాల్ విసిరారు. దేశంలో యువతను రెచ్చగొట్టి ప్రధాని మోదీని బద్నాం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తెలంగాణ నుంచి రాహుల్ గాంధీకి ప్రయోజనాలు అందుతున్నాయంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసిన ఆయన.. విద్యార్థులకు మాత్రం ఫీజు బకాయిలు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు.

### కాంగ్రెస్‌ను గద్దె దించాలి

దేశ వ్యతిరేక శక్తులతో సీఎం రేవంత్‌రెడ్డి చేతులు కలుపుతున్నారని రాంచందర్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ మంత్రులు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా తమ ప్రయోజనాల కోసం పరస్పరం పోటీ పడుతున్నారని విమర్శించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థుల శక్తి ఏంటో కాంగ్రెస్ ప్రభుత్వానికి చూపించాల్సిన సమయం వచ్చిందని వ్యాఖ్యానించారు.

# విద్యాశాఖ మంత్రులకు అభిజీత్ దీప్కే లేఖ

మొదటిపేజీ తరువాయి
ప్రభుత్వ పాఠశాలల పునరుద్ధరణను అత్యవసర ప్రాధాన్యతగా పరిగణించాలని మంత్రులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సీజేపీ 'స్కూల్ ఠీక్ కరో' కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన పలు డిమాండ్లు లేవనెత్తారు. అవేంటంటే..?

» మౌలిక సదుపాయాలు: గత ఐదేళ్లలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలు పునరుద్ధరించారనే డేటా.. ప్రస్తుతం తక్షణ మరమ్మతులు లేదా పూర్తిస్థాయి పునరుద్ధరణలు అవసరమైన పాఠశాలల మొత్తం సంఖ్యను విద్యాశాఖ మంత్రులు వెల్లడించాలి.

» ప్రాథమిక సౌకర్యాలు: మరుగుదొడ్లు, శుభ్రమైన తాగునీరు, డిజిటల్/కంప్యూటర్ లెర్నింగ్ సౌకర్యాలు, ప్లే గ్రౌండ్, సరైన క్రీడా పరికరాలు కలిగిన ప్రభుత్వ పాఠశాలల సంఖ్య

» ఉపాధ్యాయ ఖాళీలు: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లోని మొత్తం బోధనా పోస్టుల సంఖ్య, ప్రస్తుతం భర్తీ చేసిన పోస్టులు, ఖాళీల వివరాలు.

» ఆర్థిక జవాబుదారీతనం: గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలలకు కేటాయించిన నిధులు, క్షేత్రస్థాయిలో వాస్తవంగా ఖర్చు చేసిన వ్యయంతో వాటిని పోల్చి చూపే వివరాలు.

» నాణ్యమైన విద్య: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి వీలుగా ఏర్పాటు చేయాల్సిన అదనపు పాఠశాలల సంఖ్య వివరాలు.

» బోధనేతర విధులు: పాఠశాలల్లో బోధన కాకుండా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు కేటాయించే ఇతర విధులకు సంబంధించిన వివరాలు

» స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలైనా దేశంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ఇప్పటికీ సరైన మరుగుదొడ్లు, సురక్షితమైన తాగునీరు, సరైన తరగతి గదులు, బెంచీలు వంటి సౌకర్యాలు లేవని దీప్కే పేర్కొన్నారు. వారిని జంతువుల కంటే హీనంగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# తెలంగాణపై ఏంటీ వివక్ష?

మొదటిపేజీ తరువాయి
రాజకీయ కారణం అంటే ఏమిటీ? బ్రిటన్ పర్యటనకు ఓకే చెప్పి.. అమెరికా పర్యటనను మాత్రం ఎందుకు అడ్డుకున్నారు. నేను తెలంగాణ సీఎంను.. కాంగ్రెస్ సీఎంను కావడమే కారణమా? ఒక సీఎం విదేశాలకు వెళ్తే విదేశీ రాయబారులు వెంటే ఉంటారు. ప్రతి కార్యక్రమాన్నీ వారు పర్యవేక్షిస్తారు.

### ♦ నన్ను అడ్డుకున్నా.. లక్ష్యాన్ని అడ్డుకోలేరు

కేంద్రం నన్ను అడ్డుకున్నా. నా లక్ష్యాన్ని అడ్డుకోలేదు. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తాం. హైదరాబాద్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తాం. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్ర చేస్తోంది. మన రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడమే వారి లక్ష్యం. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి. ప్రధాని మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్ మాదిరిగా వ్యవహరిస్తున్నారు. భారత్‌కు వచ్చే పెట్టుబడులన్నీ గుజరాత్‌కు రావాలని మోదీ చూస్తున్నారు. తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం గురించి పార్లమెంటులో లేవనెత్తుతాం. దీన్ని వదిలిపెట్టేది లేదు. మమ్దానీ న్యూయార్క్ ప్రజలు ఎన్నుకున్న మేయర్. ఆయనేమీ అసాంఘిక శక్తికాదు కదా.

### ♦ మోదీ పాక్ వెళ్లొచ్చు.. మేం అమెరికా వెళ్లకూడదా?

నరేంద్ర మోదీ ప్రధానిగా పాక్ వెళ్లి ఆయన మిత్రుడితో కలిసి బిర్యానీ తిని రాలేదా? మేం మాత్రం పెట్టుబడుల కోసం అమెరికా వెళ్లకూడదా? మోదీ ప్రధాని అయ్యాక ప్రజాస్వామ్యం సన్నగిల్లింది. నిరంకుశత్వం పెరిగింది. మోదీ వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం.. ఆయన వైఖరితో కేంద్ర, రాష్ట్ర సంబంధాలు దెబ్బతింటున్నాయి. బీఆర్ఎస్ నేతలు హరీశ్, కేటీఆర్, కవిత పిల్లలు విదేశాల్లో చదువుకుంటున్నారు. వారికి అమెరికా పర్యటనలకు అనుమతులు వస్తున్నాయి. సీఎంగా నా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వడంలేదు. నేనూ హార్వర్డ్ యూనివర్సిటీలో చదివాను. ఒప్పందాల విషయంలో అమెరికా నుంచి నాకు ఆహ్వానం ఉంది.

### ♦ తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని ఖండించాలి

తెలంగాణ సీఎంకు అనుమతి నిరాకరించడం అంటే ఒక వ్యక్తిగా రేవంత్ రెడ్డికి ఎదురైన నిరాకరణ కాదు.. 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం.. తిరస్కరణ. ఈ తిరస్కరణకు కారణం గుజరాత్ ఆధిపత్యం. రాజకీయ కారణాలు చూపించి అనుమతి నిరాకరించడాన్ని తెలంగాణ సమాజం ముక్త కంఠంతో ఖండించాల్సిన అవసరముంది. తెలంగాణ సీఎంను అమెరికా వెళ్లకుండా అడ్డుకోవడమంటే తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. రాష్ట్రం పట్ల కేంద్రం స్పష్టమైన వివక్షను చూపిస్తోంది. ఇది ఏమాత్రం సహించరానిది. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి" అని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఈ ప్రెస్‌మీట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# నాపై నిఘా పెట్టారు.. ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి
నిజామాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడి ఆదేశాల మేరకు తన కదలికలపై నిఘా ఉంచేందుకు.. తెలంగాణ పోలీస్ శాఖకు చెందిన ఓ ఏసీపీ స్థాయి అధికారికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను ట్యాగ్ చేస్తూ 'ఎక్స్' వేదికగా సోమవారం ఆరోపణలు చేశారు. డీజీపీ సీవీ ఆనంద్ సమర్థమైన అధికారి అని పేర్కొంటూనే.. పోలీసు వ్యవస్థ పనితీరుపై ఎంపీ పలు ప్రశ్నలు సంధించారు. 'తెలంగాణ పోలీస్ శాఖ రాజ్యాంగం, చట్టబద్ధమైన ఆదేశాల ప్రకారం పనిచేస్తోందా? లేక ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల ఆదేశాల మేరకు నడుచుకుంటోందా?' అని ప్రశ్నించారు. పోలీసు వ్యవస్థ రాజకీయ కుటుంబాలకు కాకుండా చట్టానికి జవాబుదారీగా ఉండాలని అర్వింద్ పేర్కొన్నారు.

# రామగుండం సహా దేశవ్యాప్తంగా ఎన్ఐఏ సోదాలు

మొదటిపేజీ తరువాయి



పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా రామగుండంలో ఎన్ఐఏ అధికారులు సోదాలు చేశారు. సైబర్ టెర్రరిజం కేసు దర్యాప్తులో భాగంగా తెలంగాణలోని రామగుండంతో పాటు మరో 4 రాష్ట్రాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్రలోని జున్నార్ , గుజరాత్‌లోని నడియాడ్ , బిహార్‌లోని గోపాల్‌గంజ్, ఢిల్లీలో ఈ సోదాలు జరిగాయి.
ఆపరేషన్ సిందూర్ సమయంలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన 54 వెబ్‌సైట్లపై సైబర్ దాడులకు నిందితులు యత్నించారు. కీలక సమాచార వ్యవస్థలను టార్గెట్ చేశారు. నిందితులు దేశ సార్వభౌమత్వం, భద్రత, ఐక్యతను దెబ్బతీయడం.. భయాందోళనలు సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎన్ఐఏ గుర్తించింది. ఈక్రమంలో సైబర్ దాడులకు సాంకేతిక సహకారం అందించిన అనుమానితుల ఇళ్లలో తాజాగా సోదాలు చేశారు. 3 ల్యాప్‌టాప్‌లు, 5 మొబైల్ ఫోన్లు, పెన్‌డ్రైవ్‌లు, డిజిటల్ పరికరాలు, కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. హ్యాకింగ్ కార్యకలాపాలకు సంబంధించిన కీలక ఆధారాలు లభించినట్లు వెల్లడించారు. ఈ కేసులో ఇప్పటికే ఎన్ఐఏ అధికారులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు.

# తెలంగాణ మందు బాబులకు గుడ్‌న్యూస్..

మొదటిపేజీ తరువాయి
తెలంగాణ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (TSBCL).. 18 ప్రముఖ సరఫరా సంస్థలకు చెందిన 121 కొత్త లిక్కర్ బ్రాండ్లను రాష్ట్రంలో ప్రవేశపెట్టే ప్రక్రియను చేపట్టింది. ఆయా బ్రాండ్లకు అనుమతులు ఇచ్చే ముందు ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించేందుకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది.

### సెప్టెంబర్ 1లోగా అభ్యంతరాలు..

కొత్త లిక్కర్ బ్రాండ్ల ప్రవేశంపై ఎవరైనా అభ్యంతరాలు వ్యక్తం చేయాలనుకుంటే సెప్టెంబర్ 1వ తేదీలోపు తెలియజేయాలని ప్రభుత్వం నోటిఫికేషన్‌లో పేర్కొంది. అందిన అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం తదుపరి అనుమతుల ప్రక్రియ కొనసాగనుంది. కొత్త బ్రాండ్లకు అనుమతులు లభిస్తే.. రాష్ట్రంలోని మద్యం దుకాణాలు, బార్లలో వినియోగదారులకు మరిన్ని బ్రాండ్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అంతర్జాతీయ బ్రాండ్లతో పాటు 121 కొత్త రకాల లిక్కర్ రాష్ట్రంలోకి రానుండటంతో మద్యం ప్రియుల్లో ఆసక్తి నెలకొంది.

# ప్రభుత్వ పథకాలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి
అదే సమయంలో దివ్యాంగులకు ఇచ్చే ఆర్థికసాయం కొనసాగించేందుకు అనుమతించిన తెలంగాణ హైకోర్టు.. జీవో నంబర్ 4పై ఉన్న స్టేను ఎత్తివేసింది.
కాగా, ఈ నెల ఆరంభంలో ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు పలు ప్రశ్నలు లేవనెత్తిన సంగతి తెలిసిందే. ఆగస్టు 7వ తేదీన ఒక కేసు విచారణ సందర్భంగా.. కోటీశ్వరులు కూడా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందుతున్నారని వ్యాఖ్యానించింది. రైతుల కోసం అమలు చేసిన రైతుబంధు వంటి పథకాలలోనూ సంపన్నులు లబ్ధి పొందిన విషయాన్ని కోర్టు ప్రస్తావించింది. నిజంగా అవసరం ఉన్నవారికి ప్రభుత్వ సాయం అందాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.
ఇక ఆగస్టు 20వ తేదీన కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబాకర్ పథకాలపై హైకోర్టు విచారణ సందర్భంగా నిధుల విడుదల అంశానికి సంబంధించి స్టేను ఎత్తివేయడానికి నిరాకరించింది. నిధుల విడుదలపై ఉన్న స్టేను తొలగించాలంటూ ప్రభుత్వం చేసిన అభ్యర్థనను తోసిపుచ్చిన న్యాయస్థానం, రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజాగా ఈ పథకాలకు సంబంధించి చెక్కులను ఎమ్మెల్యేలు ఇవ్వడాన్ని ప్రధానంగా తప్పుబట్టిన న్యాయస్థానం.. అది రాజకీయ జోక్యమే అవుతుందని హెచ్చరించింది.

# ఖర్గేతో మంత్రి కొండా సురేఖ భేటీ.. కుమార్తె సుస్మిత వ్యాఖ్యలపై వివరణ

మొదటిపేజీ తరువాయి
మంత్రి కొండా సురేఖ ఆదివారం బెంగళూరులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. ఇటీవల తన కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు, ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలపై ఖర్గేకు ఆమె వివరణ ఇచ్చినట్లు సమాచారం. సుమారు గంటకుపైగా ఈ భేటీ జరిగినట్లు తెలుస్తోంది. ఇటీవల సుస్మితా పటేల్ చేసిన కొన్ని వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో దుమారం రేపాయి. ఈ వ్యవహారంపై సురేఖను ఖర్గే ఆరా తీసినట్లు సమాచారం.
పార్టీకి నష్టం కలిగేలా మాట్లాడటం సరికాదని, నాయకులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించినట్లు తెలుస్తోంది. పార్టీకి సంబంధించిన విషయాలను పార్టీ వేదికపైనే చెప్పుకోవాలని ఖర్గే స్పష్టం చేసినట్లు సమాచారం. తన కుమార్తె వ్యాఖ్యలపై ఇప్పటికే రెండుసార్లు వివరణ ఇచ్చానని సురేఖ ఖర్గేకు చెప్పినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీని, గాంధీ కుటుంబాన్ని తాను విమర్శించలేదని వివరించినట్లు సమాచారం.

### విదేశాల్లో తలదాచుకున్న గ్యాంగ్‌స్టర్లపై ఉక్కుపాదం - అమిత్ షా

మొదటిపేజీ తరువాయి
నిందితులు బంబీహా ముఠాతో సంబంధాలు కలిగిన జస్‌ప్రీత్ సింగ్, అజయ్ సింగ్, పవన్‌దీప్ సింగ్‌లుగా తెలిపారు. వీరిపై పలు తీవ్రమైన నేరాల ఆరోపణలు ఉన్నాయని షా పేర్కొన్నారు. బెదిరించి డబ్బులు వసూలు చేయడం, ఆయుధాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి కేసుల్లో నిందితులుగా ఉన్నారని వెల్లడించారు.
ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 51 మంది కరడుగట్టిన నేరస్థులను విదేశాల నుంచి భారత్‌కు రప్పించినట్లు ఆయన తెలిపారు. ప్రధాని మోదీ నేతృత్వంలో సురక్షిత, భద్రమైన భారత్ లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. పంజాబ్‌లోని లూథియానాలో జరిగిన గ్రనేడ్ దాడి కుట్రలోనూ వీరి ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేలింది.

# త్వరలోనే తెలంగాణ ప్రభుత్వ సొంత 'రైడ్-హెయిలింగ్' యాప్!

మొదటిపేజీ తరువాయి
దీనిద్వారా ప్రైవేట్ యాప్‌ల కమిషన్ల భారం తగ్గి డ్రైవర్ల నికర ఆదాయం పెరిగే అవకాశముందని చెప్పారు.

### ♦ 2012 తర్వాత తొలిసారిగా ఛార్జీల పెంపు

రవాణా రంగ కార్మికుల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ 2012 తర్వాత మొదటిసారిగా ఆటో ఛార్జీల సవరణకు ప్రభుత్వం నిర్ణయాత్మకంగా ఆమోదం తెలిపింది. కొత్త ఛార్జీలకు సంబంధించి త్వరలోనే అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి.

### ♦ ఈవీ కన్వర్షన్‌కు రూ.1.50 లక్షల సాయం

హైదరాబాద్‌లో కాలుష్య నియంత్రణతో పాటు ఇంధన భారాన్ని తగ్గించేందుకు డీజిల్, పెట్రోల్ ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు (రెట్రోఫిట్టింగ్) ఒక్కో వాహనానికి రూ.1.50 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు స్పష్టం చేశారు.

### ♦ బైక్ ట్యాక్సీలు.. సంక్షేమంపై స్పష్టత

వాణిజ్య అవసరాలకు మాత్రమే ఉపయోగించే 'పసుపు రంగు నంబర్ ప్లేట్' ఉండే ద్విచక్రవాహనాలను మాత్రమే బైక్ ట్యాక్సీలుగా అనుమతించే అంశంపై త్వరలోనే స్పష్టమైన నిర్ణయం తీసుకోనున్నారు. అలాగే, ఎన్నికల హామీ ప్రకారం ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12,000 ఆర్థిక సహాయం అందించే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి వివరించారు. సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కూడా ప్రభుత్వం అంగీకరించింది.

# కొండా సురేఖ సమాధానం చెప్పాలి ఖర్గే

**కుమార్తె వ్యాఖ్యల వివాదంపై అధిష్ఠానానికి వివరణ -- పార్టీ క్రమశిక్షణపై ఖర్గే కీలక సూచనలు**

**ట్రై నెట్ న్యూస్ । 24 ఆగస్టు 2026**

తెలంగాణ కాంగ్రెస్‌లో కొండా కుటుంబానికి సంబంధించిన రాజకీయ వివాదం రోజురోజుకూ మరింత ఉత్కంఠను రేపుతోంది. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలతో ప్రారంభమైన వివాదం ఇప్పుడు కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టికి చేరింది. ఈ నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ ఆదివారం బెంగళూరులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని, ఆ వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని సురేఖ ఇప్పటికే టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి ఇచ్చిన సమాధానంలో పేర్కొన్నారు. కుటుంబ బంధం కారణంగా ఒకరి రాజకీయ అభిప్రాయాలకు మరొకరు బాధ్యత వహించాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై, పార్టీ క్రమశిక్షణపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని కూడా ఆమె పేర్కొన్నారు.

**ఖర్గేతో ప్రత్యేక భేటీ**

తనపై పార్టీ నుంచి షోకాజ్ నోటీసు రావడం, కొందరు కాంగ్రెస్ నేతలు తనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం వంటి పరిణామాల మధ్య కొండా సురేఖ ఖర్గేను కలిశారు. తనపై, తన కుటుంబంపై రాజకీయంగా కుట్ర జరుగుతోందని ఆమె ఖర్గే దృష్టికి తీసుకెళ్లినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. అలాగే కాంగ్రెస్ పార్టీని కానీ, గాంధీ కుటుంబాన్ని కానీ తాను విమర్శించలేదని ఆమె వివరించినట్లు సమాచారం.

ఈ సమావేశం సుమారు గంటకు పైగా కొనసాగినట్లు నివేదికలు వెల్లడించాయి. ప్రస్తుత రాజకీయ పరిణామాలు, కుమార్తె వ్యాఖ్యలు, పార్టీ నుంచి వచ్చిన నోటీసు, తనపై వస్తున్న విమర్శలు తదితర అంశాలను సురేఖ ఖర్గేతో చర్చించినట్లు సమాచారం.

**పార్టీ క్రమశిక్షణ ముఖ్యమన్న ఖర్గే**

కొండా సురేఖ వివరణ విన్న అనంతరం ఖర్గే కీలక సూచనలు చేసినట్లు సమాచారం. పార్టీ అంతర్గత విషయాలను బహిరంగంగా విమర్శించడం సరికాదని, కాంగ్రెస్ పార్టీ



క్రమశిక్షణను ప్రతి నాయకుడు తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించినట్లు వార్తా కథనాలు పేర్కొంటున్నాయి. ఈ అంశంపై రాష్ట్ర కాంగ్రెస్ కమిటీకి పూర్తిస్థాయిలో వివరణ ఇవ్వాలని కూడా ఖర్గే స్పష్టం చేసినట్లు సమాచారం.

దీంతో ఈ వ్యవహారం ఇక రాష్ట్రస్థాయి వివాదంగా మాత్రమే కాకుండా కాంగ్రెస్ అధిష్ఠానం పరిశీలనలో ఉన్న అంశంగా మారింది. కొండా సురేఖ ఇచ్చిన వివరణపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ మరోసారి చర్చించాల్సి ఉంది.

**సుస్మిత వ్యాఖ్యలతో మొదలైన వివాదం**

ఆగస్టు 19న కొండా సురేఖ జన్మదిన వేడుకల సందర్భంగా గీసుకొండలో జరిగిన కార్యక్రమంలో ఆమె కుమార్తె సుస్మిత పాల్గొన్నారు. ఆ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై, కాంగ్రెస్ పార్టీలోని పరిణామాలపై ఆమె చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలను పార్టీ నాయకత్వం తీవ్రంగా పరిగణించింది. సుస్మితకు కాంగ్రెస్ సభ్యత్వం లేకపోవడంతో ఆమెపై నేరుగా పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం లేకపోవడంతో, ఆమె తల్లి కొండా సురేఖకు షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు వార్తలు వెలువడ్డాయి.

దీనిపై స్పందించిన సురేఖ, తన కుమార్తె వ్యాఖ్యలకు తనకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఒక కుటుంబంలో సభ్యులుగా ఉన్నంత మాత్రాన రాజకీయ అభిప్రాయాలు ఒకేలా ఉండాల్సిన అవసరం లేదని ఆమె వాదించారు. తనపై నోటీసు జారీ చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొంటూ నోటీసును ఉపసంహరించుకోవాలని కోరారు.

**ఎమ్మెల్యేల విమర్శలు**

ఇదిలా ఉండగా కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కొండా సురేఖ వ్యవహారంపై తీవ్రంగా స్పందించారు. పార్టీ క్రమశిక్షణకు భంగం కలిగించే వ్యాఖ్యలు, పరిణామాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేసినట్లు జాతీయ మీడియా నివేదికలు పేర్కొన్నాయి. కొందరు ఆమెను మంత్రివర్గం నుంచి తొలగించాలని కూడా కోరినట్లు సమాచారం.

అయితే ఈ వివాదం కేవలం ఒక కుటుంబానికి సంబంధించిన అంశం కాదని, అధికార కాంగ్రెస్‌లో నాయకత్వం, పార్టీ క్రమశిక్షణ, వ్యక్తిగత రాజకీయ భేదాల మధ్య ఏర్పడిన అంతర్గత సమస్యగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**సురేఖ మరోసారి ఘాటు స్పందన**

తనపై విమర్శలు చేస్తున్న కొందరు ఎమ్మెల్యేల వెనుక ఎవరో ఉన్నారని కొండా సురేఖ ఆరోపించినట్లు కూడా వార్తలు వచ్చాయి. తన వివరణ ఇచ్చినప్పటికీ తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలను మరింత బహిర్గతం చేశాయి.

మరోవైపు ఈ వివాదం నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం పరిస్థితిని జాగ్రత్తగా గమనిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. కొండా సురేఖపై తుది నిర్ణయం తీసుకునే ముందు ఆమె వివరణ, క్రమశిక్షణ కమిటీ అభిప్రాయం, రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం నుంచి వచ్చే నివేదికలను పరిశీలించే అవకాశం ఉంది.

**తుది నిర్ణయం ఎటువైపు?**

ప్రస్తుతం అందరి దృష్టి టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ తదుపరి సమావేశంపైనే ఉంది. సురేఖ ఇచ్చిన సమాధానాన్ని కమిటీ ఇప్పటికే పరిశీలించినప్పటికీ, తుది నిర్ణయాన్ని వాయిదా వేసి మరోసారి సమావేశం కావాలని నిర్ణయించినట్లు సమాచారం.

ఖర్గేతో భేటీ అనంతరం కొండా సురేఖకు పార్టీ అధిష్ఠానం నుంచి వచ్చిన సూచనలు ఈ వివాదానికి కీలక మలుపుగా మారే అవకాశం ఉంది. ఒకవైపు తనపై వచ్చిన ఆరోపణలకు సురేఖ వివరణ ఇస్తుండగా, మరోవైపు పార్టీ క్రమశిక్షణ విషయంలో అధిష్ఠానం స్పష్టమైన సందేశం ఇచ్చినట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్‌లో వ్యక్తిగత నాయకత్వం కంటే పార్టీ క్రమశిక్షణకు ప్రాధాన్యత ఉంటుందని ఖర్గే చేసిన సూచనలు ఈ వ్యవహారంలో కీలకంగా మారాయి. ఇక సురేఖ విషయంలో పార్టీ రాష్ట్ర నాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? క్రమశిక్షణ కమిటీ నోటీసు ఉపసంహరిస్తుందా? లేక మరింత చర్యకు సిఫారసు చేస్తుందా? అన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారింది.

# మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబంపై కోడలు మేఘన ఫిర్యాదు

**వరకట్న వేధింపులు, గృహహింస, హత్యాయత్నం ఆరోపణలు -- 11 మందిపై కేసు**

**ట్రై నెట్ న్యూస్ । 24 ఆగస్టు 2026**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జోగి రమేష్ కుటుంబానికి సంబంధించిన వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది. జోగి రమేష్ కుమారుడు రాజీవ్ భార్య మేఘన తన అత్తింటి కుటుంబ సభ్యులపై పోలీసులకు చేసిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. జోగి రమేష్‌తో పాటు కుటుంబానికి చెందిన మొత్తం 11 మందిపై వరకట్న వేధింపులు, గృహహింస, మోసం, హత్యాయత్నం తదితర ఆరోపణలపై కేసు నమోదైనట్లు వార్తా నివేదికలు వెల్లడించాయి.

మేఘన ఫిర్యాదులో తన భర్త రాజీవ్‌తో వివాహం జరిగిన తరువాత నుంచే మానసికంగా, శారీరకంగా వేధింపులు ఎదుర్కొన్నానని ఆరోపించినట్లు సమాచారం. అదనపు కట్నం కోసం ఒత్తిడి చేశారని, వివిధ సందర్భాల్లో తనను ఇబ్బందులకు గురిచేశారని ఆమె పోలీసులకు వివరించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే వివాహ సమయంలో తమ కుటుంబం భారీగా ఖర్చు చేసిందని, బంగారం, వెండి తదితర విలువైన వస్తువులు ఇచ్చినప్పటికీ అదనపు డిమాండ్లు కొనసాగాయని ఆమె ఆరోపించినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి.

మేఘన ఆరోపణల ప్రకారం అదనంగా రూ.5 కోట్లు, ఖరీదైన కారు, వజ్రాభరణాలు వంటి వాటి కోసం ఒత్తిడి చేసినట్లు పేర్కొన్నారు. అయితే ఇవన్నీ ప్రస్తుతం ఫిర్యాదులో చేసిన ఆరోపణలు మాత్రమేనని, వాటి నిజానిజాలను పోలీసులు దర్యాప్తు ద్వారా నిర్ధారించాల్సి ఉంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న కుటుంబ సభ్యులకు కూడా తమ వాదనను వెల్లడించే పూర్తి అవకాశం చట్టపరంగా ఉంటుంది.

పెళ్లి అనంతరం వేధింపుల ఆరోపణలు

జోగి రమేష్ కుమారుడు రాజీవ్, మేఘనలకు 2025 మే 28న సూర్యాపేటలో వివాహం జరిగినట్లు వార్తా నివేదికలు తెలిపాయి. వివాహం అనంతరం కొంతకాలానికే తనపై వేధింపులు ప్రారంభమయ్యాయని మేఘన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. పెద్దల సమక్షంలో కుటుంబ వివాదాన్ని పరిష్కరించేందుకు పలుమార్లు ప్రయత్నాలు జరిగినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని ఆమె ఆరోపించినట్లు తెలుస్తోంది.

తనను శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేశారని,



ఇంట్లో తనకు స్వేచ్ఛ లేకుండా చేశారని కూడా మేఘన ఆరోపించినట్లు కొన్ని నివేదికలు పేర్కొన్నాయి. కుటుంబ సభ్యుల మధ్య ఏర్పడిన ఈ వివాదం చివరకు పోలీస్ స్టేషన్ వరకు వెళ్లడం రాజకీయ వర్గాల్లోనూ చర్చకు దారితీసింది.

హత్యాయత్నాల ఆరోపణలు

మేఘన తన ఫిర్యాదులో తనపై పలుమార్లు హత్యాయత్నం జరిగినట్లు కూడా ఆరోపించినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. గోవా పర్యటన సమయంలో ఒక ఘటన, ఘట్‌కేసర్‌లోని ఫామ్‌హౌస్‌లో మరో ఘటన, 2026 ఏప్రిల్ 13న మరో ఘటన జరిగినట్లు ఆమె పేర్కొన్నట్లు సమాచారం. కొన్ని సందర్భాల్లో తనను కిందకు తోసేందుకు ప్రయత్నించారని, మరికొన్ని సందర్భాల్లో ఊపిరాడకుండా చేసేందుకు ప్రయత్నించారని ఆమె ఆరోపించినట్లు నివేదికలు పేర్కొన్నాయి.

ఈ ఆరోపణలు అత్యంత తీవ్రమైనవిగా భావిస్తున్న పోలీసులు ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు, అందుబాటులో ఉన్న ఆధారాలు, సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలను పరిశీలించే ప్రక్రియలో ఉన్నట్లు వార్తా కథనాలు తెలిపాయి. ఆరోపణలు రుజువయ్యే వరకు ఎవరినీ దోషులుగా పరిగణించరాదన్నది న్యాయవ్యవస్థలోని ప్రాథమిక సూత్రం.

**11 మందిపై కేసు నమోదు**

ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో జోగి రమేష్, ఆయన భార్య శకుంతల, కుమారుడు రాజీవ్, కుటుంబానికి చెందిన ఇతర సభ్యుల పేర్లు ఉన్నట్లు సమాచారం. మొత్తం 11 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్లతో పాటు వరకట్న నిషేధ చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం.

కేసు నమోదు అనంతరం పోలీసులు దర్యాప్తును కొనసాగిస్తున్నారు. మేఘన చేసిన ఆరోపణలు, ఆమె సమర్పించిన ఆధారాలు, వైద్యపరమైన వివరాలు, కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు, ఇతర సంబంధిత అంశాలను పరిశీలించడం ద్వారా వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సి ఉంటుంది.

**ముందస్తు బెయిల్‌కు కుటుంబ సభ్యుల ప్రయత్నం**

కేసు నమోదైన తరువాత జోగి రమేష్ కుటుంబ సభ్యులు విజయవాడ మహిళా కోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేసినట్లు డెక్కన్ క్రానికల్ నివేదించింది. కోర్టు పిటిషన్‌ను విచారణకు స్వీకరించి, ఇబ్రహీంపట్నం పోలీసులను కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించినట్లు సమాచారం.

దీంతో ఈ కుటుంబ వివాదం ఇప్పుడు న్యాయపరమైన దశకు చేరింది. ఒకవైపు మేఘన తనపై తీవ్రమైన వేధింపులు, హత్యాయత్నాలు జరిగాయని ఆరోపిస్తుండగా, మరోవైపు కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కుటుంబ సభ్యులు న్యాయపరమైన మార్గాలను ఆశ్రయిస్తున్నారు.

రాజకీయ వర్గాల్లో చర్చ

జోగి రమేష్ గతంలో ఆంధ్రప్రదేశ్ మంత్రిగా పనిచేయడంతో పాటు వైఎస్సార్‌సీపీ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించిన నాయకుడిగా గుర్తింపు పొందారు. అలాంటి రాజకీయ నాయకుడి కుటుంబంలో చోటుచేసుకున్న ఈ వివాదం సహజంగానే రాజకీయ వర్గాల్లోనూ చర్చకు కారణమైంది. సామాజిక మాధ్యమాల్లో ఈ వ్యవహారంపై వివిధ రకాల వ్యాఖ్యలు, వీడియోలు, చర్చలు కొనసాగుతున్నట్లు తాజా నివేదికలు సూచిస్తున్నాయి.

అయితే కుటుంబ వివాదాన్ని రాజకీయ కోణంలో మాత్రమే చూడకుండా, ఫిర్యాదులోని ఆరోపణలపై నిష్పక్షపాత దర్యాప్తు జరగడం అత్యంత అవసరం. నిజంగా వేధింపులు జరిగి ఉంటే బాధితురాలికి న్యాయం జరగాలి. అదే సమయంలో నిర్దోషులైన కుటుంబ సభ్యులపై తప్పుడు ఆరోపణలు ఉంటే వారికి కూడా చట్టపరమైన రక్షణ లభించాలి.

మహిళలపై గృహహింస, వరకట్న వేధింపులు సమాజానికి తీవ్రమైన సమస్యలు. కుటుంబంలో సమస్యలు ఏర్పడినప్పుడు వాటిని దాచిపెట్టడం కంటే చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కరించుకోవడం మంచిది. ప్రస్తుతం జోగి రమేష్ కుటుంబానికి సంబంధించిన ఈ కేసులో పోలీసుల దర్యాప్తు, కోర్టు విచారణ ద్వారా వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది. అప్పటి వరకు ఫిర్యాదులోని ఆరోపణలను ఆరోపణలుగానే పరిగణిస్తూ, చట్టపరమైన ప్రక్రియను గౌరవించడం అవసరం.

బోల్డు భావోద్వేగాలతో
నిలువెత్తు మనిషి ఎదురై
తిట్లో శుభాలో అక్షింతలు
వేస్తుంటే..విస్మయం గా చూస్తా..!
దైవమే నడిచి వచ్చి స్పందిస్తుందని
చేతులెత్తి మొక్కుతా!
కీర్తి కిరీటాలు..గాధల్ని కుప్పపోసి
దైవాన్ని ఆవాహనం చేయడం
వెర్రేకదా!
క్షల్లోలం ముగిసాక మనసులో
శాంతి ఊట చేరుతుంది!!
రామాయణ కాలం నుండి
లోకం దేహాన్ని చూసే
రాళ్ళేస్తోంది ..మనసు
చూసికాదు!!
కొన్ని దుఃఖాల్ని కొన్ని నవ్వుల్ని
భుజాన వేసుకుని
మైలు రాళ్లు దాటుతూ
సాగిపోతాను!!
----

తంగెళ్లపల్లి కనకా చారి
హైదరాబాద్
8790874028

కాటికి కాళ్ళు చాపిన ముసలోడికి
రేపటి తరపు చిగురాకులపై
ఈర్ష్య!
యుద్ధం పేరు చెప్పి చిన్నారుల
పాఠశాలపై బాంబుల వర్షం
కురిపించాడు!
పిల్లల సమాధుల పై నుంచి తన
దేశాన్నినిర్మిస్తాడా? !
దేశాల్ని చిదిమేసి పెత్తనమేమి
చేస్తాడు?!
విశ్వ శాం తిని కోరాల్సిన
పెద్దరికం...
వినాశనాన్ని కోరుతుందేమిటి?
రక్తాక్షరాలతో చరిత్రను రాస్తున్న
విధ్వంస యుద్ధం నేర్పుతున్న
పాఠాలేమిటి?!
మన కాలపు ఈ దుఃఖాన్ని
ఏమని నిర్వచిద్దాం?!
ఏదో ఒక మూసలో పోసేసి
ప్రశాంతంగా ఉందామా..!
ఈ నరమేధం
కొనసాగాల్సిందేనా?!
యుద్ధానికి నిరసన గా
శాంతి జెండా ఎగరేద్దాము
రండి..స్వేచ్ఛా పావురాలను
పంపుదాం రండి!!
----

తంగెళ్లపల్లి కనకా చారి
హైదరాబాద్

# సంపాదకీయం

## కృతజ్ఞత -- మనిషిని ఉన్నతుడిగా నిలబెట్టే మహోన్నత గుణం

**పేరి.నాగేశ్వరరావు**

మనిషి జీవితంలో ఎన్నో గొప్ప గుణాలు ఉన్నాయి. ప్రేమ, దయ, కరుణ, నిజాయితీ, సేవాభావం, సహనం వంటి గుణాలు మనిషి వ్యక్తిత్వాన్ని గొప్పగా నిలబెడతాయి. అయితే వీటన్నింటిలో కృతజ్ఞతాభావం ఒక ప్రత్యేకమైన, మహోన్నతమైన గుణం. మనకు మంచి చేసిన వారిని గుర్తుంచుకోవడం, వారి సహాయాన్ని మరువకుండా గౌరవించడం, మన హృదయపూర్వకంగా వారికి ధన్యవాదాలు చెప్పడం కృతజ్ఞతకు అసలైన అర్థం.

మనిషి ఈ ప్రపంచంలో జన్మించడం మొదలుకొని తన జీవితాంతం ఎన్నో వ్యక్తుల సహాయం, ప్రేమ, మార్గదర్శకత్వం పొందుతూనే ఉంటాడు. అందువల్ల ప్రతి మనిషి తన జీవితంలో తనకు మేలు చేసిన వారిపట్ల కృతజ్ఞత కలిగి ఉండాలి. కృతజ్ఞత లేని జీవితం ఎంత సంపద ఉన్నా అసంపూర్ణమే. ఎదుటివారి సహాయాన్ని స్వీకరించి, తర్వాత దానిని మరచిపోవడం మానవత్వానికి తగిన లక్షణం కాదు.

మొదటగా మన జన్మకు కారణమైన తల్లిదండ్రుల పట్ల మనం జీవితాంతం కృతజ్ఞులుగా ఉండాలి. తల్లి తన గర్భంలో తొమ్మిది నెలలు మోసి, ఎన్నో బాధలను భరించి మనకు జన్మనిస్తుంది. చిన్నప్పటి నుంచి మన ఆకలి తీర్చడం, ఆరోగ్యం కాపాడడం, మనకు మంచి అలవాట్లు నేర్పడం, మన భవిష్యత్తు కోసం ఎన్నో త్యాగాలు చేయడం తల్లిదండ్రుల గొప్పతనం. తండ్రి తన కుటుంబం కోసం కష్టపడి, తన సంతోషాలను పక్కన పెట్టి పిల్లల ఉన్నతికి పాటుపడతాడు. మనం ఎంత పెద్ద స్థాయికి ఎదిగినా, ఎంత ధనం సంపాదించినా, మన తల్లిదండ్రుల ఋణాన్ని పూర్తిగా తీర్చలేము. వారిని గౌరవించడం, ప్రేమించడం, వారి వృద్ధాప్యంలో ఆదుకోవడం ద్వారా మన కృతజ్ఞతను తెలియజేయాలి.

అలాగే ప్రకృతిపట్ల, దేవుడిపట్ల కూడా మనం కృతజ్ఞతాభావంతో ఉండాలి. మనకు స్వచ్ఛమైన గాలిని అందించే ప్రకృతి, దాహాన్ని తీర్చే నీరు, ఆకలిని తీర్చే ఆహారం, మన శరీరాన్ని కాపాడే వస్త్రాలు -- ఇవన్నీ మన జీవితానికి ఎంతో అవసరం. ఈ సృష్టిలో మనకు జీవించే అవకాశం లభించడం కూడా ఒక గొప్ప వరమే. ప్రతిరోజూ ఉదయం కళ్లను తెరిచి కొత్త రోజును చూడగలగడం, ఆరోగ్యంగా జీవించగలగడం, కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉండగలగడం -- ఇవన్నీ మనం కృతజ్ఞతతో గుర్తించాల్సిన వరాలు.

మన జీవితాన్ని తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర అత్యంత గొప్పది. అక్షర జ్ఞానం నేర్పిన ఉపాధ్యాయుడి నుంచి జీవితంలో సరైన మార్గాన్ని చూపిన గురువు వరకు ప్రతి ఒక్కరిపట్ల మనం కృతజ్ఞత కలిగి ఉండాలి. ఒక మంచి ఉపాధ్యాయుడు విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి, అతని భవిష్యత్తుకు బాటలు వేస్తాడు. మనం ఉన్నత స్థానాలకు చేరుకున్న తర్వాత మనకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను మరచిపోవడం సరికాదు. మన విజయానికి పునాది వేసిన గురువులను గౌరవించడం మన బాధ్యత.

జీవితంలో తల్లిదండ్రులు, గురువులు మాత్రమే కాదు, మనకు అనేక సందర్భాల్లో సహాయం చేసిన స్నేహితులు, బంధువులు, సహచరులు, పొరుగువారు, సహోద్యోగులు కూడా ఉంటారు. మనం కష్టాల్లో ఉన్నప్పుడు ధైర్యం చెప్పినవారు, అవసర సమయంలో ఆర్థికంగా ఆదుకున్నవారు, ఒక మంచి సలహా ఇచ్చినవారు, మనలో ఆత్మవిశ్వాసం నింపినవారు -- వీరందరూ మన జీవిత ప్రయాణంలో భాగస్వాములే. కొన్నిసార్లు ఒక మంచి మాట కూడా మనిషి జీవితాన్ని మార్చగలదు. కాబట్టి మనకు మంచి చేసిన ప్రతి ఒక్కరిని గుర్తుంచుకోవాలి.

కృతజ్ఞత అనేది కేవలం "ధన్యవాదాలు" అనే ఒక మాటతో మాత్రమే పరిమితం కాదు. మనకు మేలు చేసిన వారిని గౌరవించడం, వారి కష్ట సమయంలో వారికి తోడుగా నిలబడడం, వారి మంచిని ఇతరులకు చెప్పడం కూడా కృతజ్ఞతే. మనం పొందిన మేలును గుర్తుంచుకొని, అవకాశం వచ్చినప్పుడు ఇతరులకు కూడా అదే విధంగా సహాయం చేయడం కృతజ్ఞతకు గొప్ప రూపం.

నేటి సమాజంలో చాలా మంది తమ విజయానికి తామే కారణమని భావిస్తున్నారు. తమ ఎదుగుదలకు వెనుక నిలిచిన తల్లిదండ్రులు, గురువులు, స్నేహితులు, సహచరులను మరచిపోతున్నారు. ఈ స్వార్థపూరిత ఆలోచన పెరుగుతున్న కాలంలో కృతజ్ఞత విలువను పిల్లలకు చిన్నప్పటి నుంచే నేర్పించాలి. పిల్లలకు తమకు భోజనం పెట్టేవారికి, చదువు చెప్పేవారికి, సేవ చేసేవారికి ధన్యవాదాలు చెప్పే అలవాటు నేర్పాలి.

కృతజ్ఞత ఉన్న మనిషి వినయంతో ఉంటాడు. వినయం ఉన్న చోట మానవత్వం ఉంటుంది. మానవత్వం ఉన్న చోట ప్రేమ, శాంతి, ఆనందం ఉంటాయి. మనకు సహాయం చేసిన వారిని గుర్తుంచుకోవడం ద్వారా మన వ్యక్తిత్వం మరింత గొప్పదవుతుంది. కృతజ్ఞత అనేది మన హృదయంలో ఉండే వెలుగు. ఆ వెలుగును జీవితాంతం ఆరిపోనివ్వకూడదు.

మొత్తంగా చెప్పాలంటే, మన జన్మకు కారణమైన తల్లిదండ్రులకు, మనకు జీవనావకాశాన్ని ప్రసాదించిన దైవానికి, మంచి గాలి, నీరు, ఆహారం అందించే ప్రకృతికి, విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు, కష్టసుఖాల్లో తోడుగా నిలిచిన స్నేహితులు, బంధువులు, సహచరులకు మనం ఎప్పుడూ కృతజ్ఞులుగా ఉండాలి. మన జీవితంలో మంచి చేసిన వారి మంచి మాటలను, చేతలను, సహాయాలను ఎన్నటికీ మరచిపోకూడదు. కృతజ్ఞత ఉన్న చోటే నిజమైన మానవత్వం ఉంటుంది. కృతజ్ఞతను మన జీవితంలో ఒక భాగంగా చేసుకుందాం. మనకు మేలు చేసిన వారిని గౌరవిద్దాం. మనం పొందిన మంచిని సమాజానికి తిరిగి అందిద్దాం. అదే మనిషి జీవితానికి అసలైన అర్థం, అదే నిజమైన సంస్కారం.

## మల్లెల పరిమళం ( కవిత)- రచన తంగెళ్లపల్లి కనకాచారి



8790874028 హైదరాబాద్

వీధి అంతా మల్లెల పరిమళమే.. అవును మల్లెలమ్ముతూ పూల వాడు అటు వెళ్ళాడు!
నిజం మంచి మనసు ముందు మన బతుకు పరిమళమే!
తేటతెల్లమైన మన అస్తిత్వాలు నిసిగ్గుగా అహంతో రంకెలు వేస్తాయి వేల నాటకాలలో తమని తాము దాచుకుంటాయి
కొండల్లో నుండి పారుతూ స్వచ్ఛమైన జలంలా ఓ నవ్వు మనల్ని తాకినప్పుడు
మన వేషాలు నగ్నత బట్టబయలౌతుంది
ఎవ్వరూ మొరపెట్టుకోకండి .. మనుషులు మారుతారని భ్రమించకండి...
మీ తోవన పోతూ
అందరికీ అభివాదం చేస్తూ నమస్కరిస్తూ పొండి!
నిజం చెప్తున్నాను ఘర్షణలు కేవలం అపోహలే!
ఎవరికి మీ నిజాయితీని
స్నేహాన్ని వివరించకండి!
మల్లెల పరిమళమై సాగిపోండి!!

# బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు పిలుపు -- ఐదు రోజుల పనివారమే ప్రధాన డిమాండ్!

**త్రినెట్ న్యూస్ -- 24 ఆగస్టు 2026**

దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు, అధికారుల సంఘాలు తమ ప్రధాన డిమాండ్ల సాధన కోసం సమ్మెకు పిలుపునిచ్చాయి. ముఖ్యంగా వారానికి ఐదు రోజుల పనివారాన్ని అమలు చేయాలని కోరుతూ బ్యాంకు ఉద్యోగ సంఘాలు ఉద్యమబాట పట్టాయి. బ్యాంకింగ్ రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది ఉద్యోగులు, అధికారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ డిమాండ్ చేసింది.

సెప్టెంబర్ 11న దేశవ్యాప్త సమ్మె నిర్వహించనున్నట్లు బ్యాంకు సంఘాలు ప్రకటించాయి. తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే తదుపరి దశలో మరింత ఉధృతమైన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించాయి. సెప్టెంబర్ 28 నుంచి మూడు రోజుల సమ్మెకు, అవసరమైతే అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు కూడా సిద్ధమవుతున్నట్లు సంఘాలు ప్రకటించాయి.

**ఐదు రోజుల పనివారమే ప్రధాన డిమాండ్**

ప్రస్తుతం చాలా బ్యాంకుల్లో నెలలో రెండో, నాలుగో శనివారాలు సెలవులుగా ఉన్నాయి. మిగిలిన శనివారాల్లో బ్యాంకులు పనిచేస్తున్నాయి. అయితే ఇప్పుడు వారానికి ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేసి శనివారం, ఆదివారం రెండు రోజులు సెలవులు ఇవ్వాలని బ్యాంకు ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని అనేక సంస్థలు ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేస్తున్నాయి. అదే విధానాన్ని బ్యాంకింగ్ రంగంలో కూడా అమలు చేయాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. ఐదు రోజుల పనివారాన్ని అమలు చేయడానికి సంబంధించి గతంలో జరిగిన చర్చల్లో సానుకూల అవగాహన ఏర్పడినప్పటికీ, ప్రభుత్వం నుంచి తుది నిర్ణయం వెలువడకపోవడం పట్ల ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.




బ్యాంకు ఉద్యోగులు ప్రజల ఆర్థిక అవసరాలకు అనుగుణంగా నిరంతరం సేవలు అందిస్తున్నారని సంఘాలు పేర్కొంటున్నాయి. పెరుగుతున్న పని భారం, సిబ్బంది కొరత, సాంకేతిక పరిజ్ఞానంతో మారుతున్న బ్యాంకింగ్ విధానాల కారణంగా ఉద్యోగులపై ఒత్తిడి అధికమవుతోందని వారు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో వారానికి రెండు రోజుల విశ్రాంతి ఇవ్వడం అవసరమని అభిప్రాయపడుతున్నారు.

**పనితీరు ఆధారిత ప్రోత్సాహకాలపై అభ్యంతరం**

బ్యాంకు ఉద్యోగుల మరో ప్రధాన డిమాండ్ పనితీరు ఆధారిత ప్రోత్సాహక విధానానికి సంబంధించినది. ప్రభుత్వం ప్రతిపాదించిన ఈ విధానంపై ఉద్యోగ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఉద్యోగుల మధ్య అసమానతలకు అవకాశం కల్పించే విధంగా ప్రోత్సాహక పథకాలు ఉండకూడదని వారు స్పష్టం చేస్తున్నారు.
అందరికీ సమానమైన, న్యాయమైన విధానంలో ప్రోత్సాహకాలు అందించాలని బ్యాంకు సంఘాలు కోరుతున్నాయి. ముఖ్యంగా ఉన్నత స్థాయి అధికారులకు ఒక విధంగా, ఇతర ఉద్యోగులకు మరో విధంగా ప్రోత్సాహకాలు ఇవ్వడం సరైన పద్ధతి కాదని పేర్కొంటున్నాయి. ఈ అంశంపై ఉద్యోగ సంఘాలతో సంప్రదింపులు జరిపిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

**పెన్షన్ సమస్యల పరిష్కారం కోసం డిమాండ్**

బ్యాంకు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన పెన్షన్ సమస్యలు కూడా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని సంఘాలు పేర్కొంటున్నాయి. పెన్షన్‌ను ఎప్పటికప్పుడు సవరించడం, పెన్షనర్లకు సమానమైన ప్రయోజనాలు కల్పించడం వంటి అంశాలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతున్నాయి.
ప్రస్తుతం జాతీయ పెన్షన్ విధానంలో ఉన్న ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని ఎంచుకునే అవకాశం ఇవ్వాలనే డిమాండ్ కూడా ఉద్యోగ సంఘాల ప్రధాన డిమాండ్లలో ఒకటి. ఉద్యోగులు పదవీ విరమణ చేసిన తర్వాత ఆర్థిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని సంఘాలు పేర్కొంటున్నాయి.

సెప్టెంబర్ 11న దేశవ్యాప్త సమ్మె

సెప్టెంబర్ 11న జరగనున్న దేశవ్యాప్త సమ్మెతో బ్యాంకింగ్ సేవలకు కొంత అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల కార్యకలాపాలపై ప్రభావం పడవచ్చు. నగదు లావాదేవీలు, చెక్కుల క్లియరెన్స్, కొన్ని కార్యాలయ సేవల్లో జాప్యం సంభవించే అవకాశం ఉంది.
సమ్మె తేదీకి ముందు, తరువాత సెలవులు రావడంతో కొన్ని ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు వరుసగా పలురోజులు ప్రభావితమయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రజలు తమ అత్యవసర బ్యాంకింగ్ పనులను ముందుగానే పూర్తి చేసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.
అయితే ఏటీఎంలు, మొబైల్ బ్యాంకింగ్, అంతర్జాల బ్యాంకింగ్ వంటి డిజిటల్ సేవలు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. అయినప్పటికీ నగదు అవసరాలను దృష్టిలో ఉంచుకుని వినియోగదారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం.

**దశలవారీగా ఆందోళన**

తమ డిమాండ్లను పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని బ్యాంకు సంఘాలు హెచ్చరించాయి. మొదట సెప్టెంబర్ 11న ఒక రోజు సమ్మె, అనంతరం సెప్టెంబర్ 28 నుంచి మూడు రోజుల సమ్మె చేపట్టాలని నిర్ణయించారు.
అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని సంఘాలు ప్రకటించాయి. ఈ పరిణామం బ్యాంకింగ్ రంగంలో తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా నెలవారీ, అర్ధవార్షిక ఆర్థిక కార్యకలాపాలపై సమ్మె ప్రభావం పడవచ్చని భావిస్తున్నారు.

ప్రభుత్వం స్పందించాలి

బ్యాంకు ఉద్యోగుల సమ్మె ప్రకటన నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చలు ప్రారంభించాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. సమ్మె అనేది చివరి మార్గమని, చర్చల ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని వారు పేర్కొంటున్నారు.
ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, ఐదు రోజుల పనివారంపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పెన్షన్ సమస్యలు, ప్రోత్సాహక పథకాలు, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన ఇతర అంశాలపై కూడా స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరుతున్నారు.
మొత్తం మీద, ఐదు రోజుల పనివారం అమలు, పెన్షన్ సమస్యల పరిష్కారం, ఉద్యోగులకు న్యాయమైన ప్రోత్సాహక విధానం వంటి ప్రధాన డిమాండ్లతో దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు మరోసారి పోరాటానికి సిద్ధమయ్యారు. సెప్టెంబర్ 11న జరిగే సమ్మెకు ముందు ప్రభుత్వం చర్చల ద్వారా సమస్యలను పరిష్కరిస్తుందా? లేక బ్యాంకింగ్ రంగం వరుస సమ్మెల వైపు సాగుతుందా? అనేది ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది.

# పంటల నుంచి ప్రాజెక్టుల దాకా..పల్లె పల్లెన పొన్నం అన్న పల్లెల్లో ప్రజాపాలన..

- అడుగడుగునా ప్రజల ఆశీర్వాదం..
- విజయవంతంగా కొనసాగుతున్న కార్యక్రమం.
- చిగురుమామిడి మండలంలో ఐదు గ్రామాల్లో మంత్రి పర్యటన..
- ప్రజల సమస్యలపై అక్కడికక్కడే స్పందన..
- అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

**నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన మంత్రి పొన్నం ప్రభాకర్..**

చిగురుమామిడి: రైతు పొలంలో పంట నుంచి భారీ సాగునీటి ప్రాజెక్టు వరకు.. గ్రామంలోని విద్యుత్ సమస్య నుంచి ఇంటింటి సంక్షేమ పథకాల వరకు.. ప్రజల అవసరాలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకునే లక్ష్యంతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేపట్టిన 'పల్లె పల్లెకు పొన్నం అన్న--పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమం చిగురుమామిడి మండలంలో ప్రత్యేకతను చాటుకుంది. సోమవారం కొండాపూర్, నవాబుపేట, ఇందుర్తి, ఓగులాపూర్, గునుకులపల్లి గ్రామాల్లో మంత్రి విస్తృతంగా పర్యటించారు. ప్రతి గ్రామంలో ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకోవడంతో పాటు.. అధికారులతో సమీక్ష నిర్వహించి పరిష్కారానికి ఆదేశాలు, అభివృద్ధి పనులకు హామీలు ఇచ్చారు.

**గౌరవెల్లి పూర్తితో హుస్నాబాద్‌కు జలభరోసా**

కొండాపూర్‌లో మంత్రి మాట్లాడుతూ ప్రతిష్టాత్మక గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని తెలిపారు. భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.250 కోట్ల నిధులు మంజూరు చేసిందని, మూడు జిల్లాల కలెక్టర్లు ఈ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించి ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు.గౌరవెల్లి కాల్వల నిర్మాణానికి రైతులు సహకరించాలని మంత్రి కోరారు. భూసేకరణ ప్రక్రియ సాఫీగా పూర్తయితే భూములు సేకరించిన వెంటనే అర్హులైన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి విషయంలో ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు.ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత.. ప్రతి పొలానికీ ఫామ్‌పాండ్‌నీటి సంరక్షణకు ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి అని మంత్రి స్పష్టం చేశారు. వర్షపు నీటిని వృథాగా పోనివ్వకుండా ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించుకోవాలని సూచించారు. నవాబుపేట గ్రామం ఇంకుడు గుంతల నిర్మాణంలో రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా నిలవాలని పిలుపునిచ్చారు.గునుకులపల్లిలో రైతులు తమ పొలాల్లో ఫామ్‌పాండ్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేయడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చని, తద్వారా బావులు, బోర్లలో నీటి లభ్యత మెరుగుపడుతుందని వివరించారు.

**ఆయిల్‌ఫామ్ వైపు రైతుల ఆసక్తి**

వ్యవసాయంలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించారు. ఒకే సంప్రదాయ పంటపై ఆధారపడకుండా ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కోరారు. ఆయిల్‌ఫామ్, నువ్వులు, ఆముదాలు, మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు.
ముఖ్యంగా ఇందుర్తి గ్రామంలో మంత్రి పిలుపుకు రైతుల నుంచి సానుకూల స్పందన లభించింది. దాదాపు 100 ఎకరాల్లో ఆయిల్‌ఫామ్ సాగు చేపట్టేందుకు రైతులు ముందుకు రావడం విశేషంగా నిలిచింది. ఆయిల్‌ఫామ్ సాగుతో ఎకరాకు సుమారు రూ.1.50 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. రైతుల ఆసక్తిని అభినందిస్తూ సాగు విస్తరణకు అవసరమైన ప్రోత్సాహం అందేలా చూడాలని అధికారులను సూచించారు.

**విద్యుత్ సమస్యపై తక్షణ స్పందన**

నవాబుపేటలో గ్రామస్తులు విద్యుత్ సమస్యను మంత్రి దృష్టికి తీసుకురాగా.. ఆయన వెంటనే స్పందించారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి గ్రామంలో సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగేలా అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.
కొండాపూర్‌లోనూ విద్యుత్ సమస్యపై ప్రజలు ఫిర్యాదు చేయగా.. అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను కేవలం వినడమే కాకుండా వాటి పరిష్కారానికి యంత్రాంగాన్ని కదిలించడమే కార్యక్రమం ఉద్దేశమని మంత్రి పేర్కొన్నారు.

**గ్రామానికో అభివృద్ధి హామీ**

ఐదు గ్రామాల పర్యటనలో ఆయా ప్రాంతాల అవసరాలను బట్టి మంత్రి ప్రత్యేక హామీలు ఇచ్చారు.గునుకులపల్లి గ్రామంలో సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని, అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయిస్తానని తెలిపారు. వివో బిల్డింగ్ నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటామన్నారు. ఓగులాపూర్లో చెక్‌డ్యామ్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో తోటపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం సేకరించిన భూముల అంశాన్ని రైతులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ముంపునకు గురైన భూముల్లో పండించిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.కొండాపూర్లో గ్రామాభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని తెలిపారు. విద్య, వైద్యం, అంగన్‌వాడీ సేవలను ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.నవాబుపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చెప్పారు.ఇందుర్తిలో గ్రామ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని, రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని సూచించారు.

**ఇందిరమ్మ ఇళ్లకు ప్రాధాన్యం**

ఇల్లు లేని పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల ద్వారా చేయూత అందిస్తున్నామని మంత్రి తెలిపారు. గుడిసెల్లో నివసిస్తున్న వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కొండాపూర్‌లో ఇప్పటికే 16 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా.. గుడిసెల్లో నివసిస్తున్న ఐదుగురికి మంత్రి మంజూరు పత్రాలు అందించారు. గూడాల భాగ్య నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న మహిళా సంఘాల భవనానికి శంకుస్థాపన చేశారు.

# గొప్ప విషయం

మనం ఎంత ఎత్తుకు ఎదిగినా
మనుషుల్ని చిన్నచూపు చూడకూడదు
ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండాలి
ఎదుటివారిని గౌరవించడం నేర్చుకోవాలి
డబ్బు వచ్చిందని పొంగిపోకూడదు
అధికారం వచ్చిందని విర్రవీగకూడదు
పదవి వచ్చిందని గర్వపడకూడదు
మనిషితనం మాత్రం ఎప్పుడూ విడిచిపెట్టకూడదు
ఎందుకంటే ఎత్తు పెరిగే కొద్దీ
మన నీడ కూడా పెద్దదవుతుంది
ఆ నీడలో నలుగురికి చోటివ్వాలి
అదే నిజమైన గొప్పతనం
ఎదగడం గొప్ప విషయమే
కానీ ఎదిగిన తర్వాత
ఒదిగి ఉండడం ఇంకా గొప్ప విషయం
మనకంటే తక్కువలో ఉన్నవారిని
చిన్నచూపు చూడకపోవడమే సంస్కారం
మనకన్నా వెనుక ఉన్నవారిని
చేయి అందించి ముందుకు నడిపించడమే
మానవత్వం
నిన్న మనతో నడిచిన మనుషులను
నేడు మనం మరిచిపోకూడదు
మన ఎదుగుదలకు కారణమైన వారిని
ఎప్పటికీ గుండెల్లో దాచుకోవాలి
ఎంత సంపద ఉన్నా
మంచి మనసు లేకపోతే అది వ్యర్థమే
ఎంత పేరు ఉన్నా
గౌరవించడం తెలియకపోతే అది శూన్యమే
మనిషి ఎదుగుదల కొలిచేది
అతని ఎత్తు కాదు... అతని వ్యక్తిత్వమే
ఎదిగిన తర్వాత కూడా మనిషిగానే ఉంటే
అదే జీవితంలో నిజమైన గొప్ప విషయం!



రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.
చరవాణి : 9866179385

# "హంసధ్వని" సంగీత పరిశోధనా అంశాల శిక్షణా శిబిరం ఆగస్టు 29 నాడు.

సుప్రసిద్ధ సాంస్కృతిక సంస్థ నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో "హంసధ్వని" సంగీత పరిశోధన అంశాల రూపకల్పన లో శిక్షణా శిబిరం ఈనెల 29వ తేదీనాడు నిర్వహింపబడుతుందని సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, సమన్వయకర్తలు నిష్టల సుధామాల, డాక్టర్ ఇందిరా హేమలు తెలియజేసారు.
ఈ కార్యక్రమానికి చెందిన పోస్టర్ ను
సోమవారం నాడు సమితి కార్యాలయంలో ప్రముఖ సంగీత విద్వాంసురాలు, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం సంగీత విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్
డా. పావని దుడ్డు, సమితి సభ్యులతో కలిసి ఆవిష్కరించారు.
ఈ శిబిరంలో సంగీత పరిశోధనా రంగంలో కొత్తగా అడుగుపెట్టిన విద్యార్థులు, అధ్యాపకులు, మరియు ఆసక్తిగల పరిశోధకులకు విశ్లేషణాత్మక ఆలోచన, సరైన శోధనా అంశాల ఎంపిక, పరిశోధనా విధానాలు, మరియు సమాచార సేకరణ విధానాలు వంటి అంశాలపై ప్రాముఖ్యతనిచ్చి వివరంగా అవగాహన కల్పించబడుతుందని
నిష్టల సుధామాల తెలిపారు.
ఈ వర్క్‌షాప్‌ను డా. పావని దుడ్డు గారు ఇంటరాక్టివ్ సెషన్‌గా నిర్వహిస్తారు. ఈ సెషన్‌లో పాల్గొనేవారు పరిశోధనా విషయ అభివృద్ధి ప్రక్రియను సవివరంగా అర్థం చేసుకోవడమే కాకుండా, ఆలోచనలు, సూత్రీకరణ, పరిశోధనా ప్రశ్నలు, లక్ష్యాలు, మరియు సాహితీ సమీక్షపై అవగాహన పొందడం, మరియు పరిశోధనా విషయం తుది



రూపుదిద్దుకునే విధానాలను నేర్చుకోవచ్చు. శాస్త్రీయ పరిశోధనలో ప్రామాణికత, ప్రాముఖ్యత, మరియు వినూత్న ఆలోచనలను ప్రోత్సహించడానికి ఇది మంచి అవకాశం.
ఈ ఇంటరాక్టివ్ వర్క్‌షాప్ పరిశోధనా విషయాలను అభివృద్ధి చేయడానికి అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు రూపొందించబడిందని విజయ కుమార్ వివరించారు.
వేమరాజు రమాదేవి, శృతి వారణాసి, యశస్విని పొన్నలు పాల్గొన్నారు.

# దంచికొట్టిన వాన..

## 250కి పైగా విమాన సర్వీసులపై ప్రభావం

దేశ రాజధాని దిల్లీలో (ణవశ్రీష్ట్రఱ చీజ=) సోమవారం భారీ వర్షం కురిసింది. బలమైన ఈదురుగాలులతో కూడిన వానకు దిల్లీతో పాటు నోయిడా, గాజియాబాద్, గురుగ్రామ్, ఫరీదాబాద్ ప్రాంతాలు తడిసి ముద్దయ్యాయి. పలుచోట్ల రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. గురుగ్రామ్, ఫరీదాబాద్ జిల్లాలకు వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. సోహ్నా రోడ్‌లోని ఇస్లాంపూర్ వద్ద నీరు నిలవడంతో 4 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. లోతట్టు ప్రాంతాలు నీట మునగడంతోపాటు పలుచోట్ల వృక్షాలు నేలకొరిగాయి.

**విమానాల దారి మళ్లింపు**

వర్ష ప్రభావం విమాన సర్వీసులపైనా పడింది. దిల్లీ విమానాశ్రయంలో 15 విమానాలను దారి మళ్లించారు. వీటిలో మూడు అంతర్జాతీయ సర్వీసులు ఉన్నాయి. 12 విమానాలను జైపుర్‌కు, రెండింటిని చండీగఢ్‌కు, మరో విమానాన్ని లఖ్‌నవూకు మళ్లించారు. 250కి పైగా విమాన సర్వీసులు ఆలస్యంగా నడిచాయని అధికారులు వెల్లడించారు. దిల్లీ-ఎన్‌సీఆర్‌లో కొద్ది రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది.



ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • నాణ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
మంగళవారం ఆగస్ట్ 25, 2026
www.trinetnews.com

# హైదరాబాద్‌లో భారీ వర్షాలు -- అప్రమత్తమైన నగరం

**ట్రైనెట్ న్యూస్ -- 24 ఆగస్టు 2026**

హైదరాబాద్ నగరాన్ని మరోసారి వర్షాలు ముంచెత్తుతున్నాయి. నైరుతి రుతుపవనాల ప్రభావంతో పాటు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రాంతం కారణంగా తెలంగాణలో వర్షాలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌లో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉండటంతో పాటు పలుచోట్ల వర్షాలు, ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

గత కొన్ని రోజులుగా పొడి వాతావరణంతో ఇబ్బందిపడిన తెలంగాణలో మళ్లీ వర్షాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఒక్కసారిగా భారీ వర్షం పడటంతో రహదారులపై నీరు నిలిచింది. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**నగరానికి వర్ష హెచ్చరిక**

ఆగస్టు 24న తెలంగాణకు వాతావరణ శాఖ భారీ వర్షం, ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుల హెచ్చరికలు జారీ చేసింది. హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

హైదరాబాద్‌లో సోమవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. మంగళవారం కూడా నగరంలో వర్షాలు కొనసాగే అవకాశం ఉందని తెలిపింది.

**గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు**

వర్షాలతో పాటు నగరంలోని కొన్ని ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. దీంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు, నిర్మాణ ప్రాంతాల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

వర్షం సమయంలో రహదారులు తడిసి జారుడుగా మారే అవకాశం ఉంది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే ప్రమాదం కూడా ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అవసరం



లేకుండా ప్రజలు వర్షంలో ప్రయాణాలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

**ట్రాఫిక్‌పై ప్రభావం**

హైదరాబాద్‌లో వర్షం ప్రారంభమైన వెంటనే ట్రాఫిక్ సమస్యలు తలెత్తడం సాధారణంగా మారింది. ముఖ్యంగా ప్రధాన రహదారులు, వంతెనలు, లోతట్టు ప్రాంతాలు, రద్దీ కూడళ్లలో వాహనాల రాకపోకలు నెమ్మదించే అవకాశం ఉంది.

వర్షం సమయంలో రహదారులపై నీరు నిలవడంతో ద్విచక్ర వాహనదారులు మరింత జాగ్రత్తగా ప్రయాణించాల్సి ఉంటుంది. వాహనదారులు వేగాన్ని తగ్గించి, ముందున్న వాహనాలకు తగిన దూరం పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

**లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి**

ప్రతి భారీ వర్షం సమయంలో హైదరాబాద్‌లోని కొన్ని లోతట్టు ప్రాంతాలు నీట మునిగే పరిస్థితి ఏర్పడుతోంది. నాలాలు, చెరువులు, కాలువల పరిసరాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

నగరంలో భారీ వర్షం కురిసినప్పుడు వరద నీరు వేగంగా ప్రవహించే ప్రాంతాల్లోకి వెళ్లకూడదని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు వర్షపు నీటి ప్రవాహానికి దగ్గరగా వెళ్లకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలి.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం సమయంలో చెట్ల కింద నిలబడకూడదు. విద్యుత్ స్తంభాలు, బహిరంగ ప్రదేశాల్లోని లోహ నిర్మాణాలకు దూరంగా ఉండటం మంచిది. వర్షం సమయంలో విద్యుత్ తీగలు తెగిపడినట్లు కనిపిస్తే వాటికి దూరంగా ఉండి సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలి.

ఇళ్ల చుట్టుపక్కల నీరు నిలవకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వర్షాకాలంలో నీరు నిలిచే ప్రాంతాల్లో దోమల వ్యాప్తి పెరిగి డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధుల ప్రమాదం పెరగవచ్చని వైద్య ఆరోగ్య శాఖ కూడా హెచ్చరిస్తోంది.

**మరో రెండు రోజులు వర్షాల ప్రభావం**

ప్రస్తుతం ఏర్పడిన వాతావరణ పరిస్థితుల ప్రభావంతో తెలంగాణలో మరికొన్ని ప్రాంతాల్లో వర్షాలు కొనసాగే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో సోమవారం, మంగళవారం వర్షాలు ఉండవచ్చని వాతావరణ శాఖ తెలిపింది.

వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ, విద్యుత్, పోలీసు, విపత్తు నిర్వహణ విభాగాలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలించి, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలి.

**అప్రమత్తతే రక్షణ**

హైదరాబాద్‌కు వర్షాలు ఎంత అవసరమో, అదే సమయంలో భారీ వర్షాలు నగర ప్రజలకు ఇబ్బందులు కూడా కలిగిస్తున్నాయి. వర్షపు నీరు సక్రమంగా వెళ్లేందుకు నాలాలు, కాలువలు, నీటి మార్గాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచడం అత్యంత అవసరం.

ప్రజలు కూడా అధికారుల సూచనలు పాటిస్తూ అత్యవసర పరిస్థితుల్లో సహాయక బృందాలకు సహకరించాలి. భారీ వర్షాల సమయంలో అనవసర ప్రయాణాలను తగ్గించి, పిల్లలు మరియు వృద్ధుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.

మొత్తం మీద హైదరాబాద్‌లో వర్షాల ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. వాతావరణ శాఖ హెచ్చరికలను నిర్లక్ష్యం చేయకుండా, పరిస్థితులకు అనుగుణంగా ప్రయాణాలు, రోజువారీ కార్యకలాపాలను నిర్వహించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# పాతబస్తీ నుంచి విమానాశ్రయానికి మెట్రో రైలు

**ట్రై నెట్ న్యూస్ -- 24 ఆగస్టు 2026**

ప్రత్యేక కథనం

హైదరాబాద్ నగర ప్రజల చిరకాల స్వప్నంగా ఉన్న పాతబస్తీ మెట్రో రైలు పనులకు వేగం పెరుగుతోంది. పాతబస్తీ ప్రాంతాన్ని నగరంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానించడంతో పాటు భవిష్యత్తులో విమానాశ్రయానికి మెట్రో మార్గం ద్వారా చేరుకునే అవకాశాలు హైదరాబాద్ రవాణా వ్యవస్థలో కీలకమైన మార్పులకు దారితీయనున్నాయి.

హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశలో పాతబస్తీ మార్గానికి ప్రత్యేక ప్రాధాన్యం లభించింది. మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు సుమారు 7.5 కిలోమీటర్ల మార్గాన్ని పాతబస్తీ మెట్రో మార్గంగా ప్రతిపాదించారు. ఈ మార్గం దారుల్‌షిఫా, శాలిబండ, ఫలక్‌నుమా మీదుగా చాంద్రాయణగుట్ట వైపు సాగుతుంది.

పాతబస్తీ మెట్రో మార్గం పూర్తయితే నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాలకు వేగవంతమైన ప్రజా రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. ప్రస్తుతం పాతబస్తీలో రహదారులపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెట్రో అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా రహదారులపై వాహనాల ఒత్తిడి కూడా తగ్గే అవకాశం ఉంది.

మరోవైపు విమానాశ్రయ మెట్రో అనుసంధానానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ప్రస్తుత ప్రతిపాదనల్లో నాగోలు నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు సుమారు 36.8 కిలోమీటర్ల మార్గాన్ని ప్రతిపాదించారు. ఈ మార్గం ఎల్‌బీనగర్, కర్మన్‌ఘాట్, ఉస్మానియా ఆసుపత్రి ప్రాంతం, చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి, ఆరాంఘర్ మీదుగా విమానాశ్రయానికి చేరుకునే విధంగా



రూపొందించబడింది.

అంటే పాతబస్తీ మెట్రో, విమానాశ్రయ మెట్రో మార్గాలు పరస్పరం అనుసంధానమయ్యే విధంగా హైదరాబాద్ నగరానికి విస్తృతమైన రవాణా వలయం ఏర్పడే అవకాశం ఉంది. దీనివల్ల పాతబస్తీ నుంచి విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు భవిష్యత్తులో మెట్రో ఆధారిత సౌకర్యవంతమైన ప్రయాణం సాధ్యమవుతుంది.

ఇటీవల ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పాతబస్తీ మెట్రో పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎంజీబీఎస్--చాంద్రాయణగుట్ట 7.5 కిలోమీటర్ల మార్గంలో రహదారి విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలని, మెట్రో పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు. అవసరమైన సాంకేతిక అంశాలపై ఢిల్లీ మెట్రో అధికారుల సహకారం తీసుకోవాలని కూడా ఆదేశించారు.

భూసేకరణకు సంబంధించిన సమస్యలపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. తెలంగాణ హైకోర్టు ఇటీవల రెండో దశ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను కొనసాగించేందుకు అనుమతించింది. దీంతో పాతబస్తీ మార్గంలో మౌలిక పనులను ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులకు అవకాశం ఏర్పడింది.

పాతబస్తీ మెట్రో నిర్మాణంలో చారిత్రక కట్టడాలు, మతపరమైన నిర్మాణాలు, స్థానిక ప్రజల ప్రయోజనాలను కాపాడుతూ పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే ఈ అంశంపై పలు అభ్యంతరాలు, న్యాయపరమైన అంశాలు తెరపైకి వచ్చాయి. అందువల్ల అభివృద్ధితో పాటు వారసత్వ సంపద పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది.

విమానాశ్రయానికి మెట్రో అనుసంధానం పూర్తయితే హైదరాబాద్‌కు వచ్చే దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. విమానాశ్రయం నుంచి నగరంలోని ప్రధాన ప్రాంతాలకు రోడ్డు మార్గంపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. పాతబస్తీ ప్రాంతంలో నివసించే ప్రజలకు కూడా నగరంలోని ఇతర ప్రాంతాలకు, భవిష్యత్తులో విమానాశ్రయానికి సులభంగా చేరుకునే అవకాశం ఏర్పడుతుంది.

హైదరాబాద్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో మెట్రో రైలు విస్తరణ నగర భవిష్యత్తుకు అత్యవసరంగా మారింది. రహదారి రవాణాపై పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించడం, కాలుష్యాన్ని నియంత్రించడం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా అందించడం వంటి అనేక ప్రయోజనాలు మెట్రో విస్తరణతో సాధ్యమవుతాయి.

పాతబస్తీ నుంచి విమానాశ్రయం వరకు మెట్రో అనుసంధానం పూర్తిస్థాయిలో అమలైతే హైదరాబాద్ నగర రవాణా చరిత్రలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది. పాతబస్తీ అభివృద్ధికి కొత్త ఊపునివ్వడంతో పాటు హైదరాబాద్‌ను మరింత ఆధునిక, సౌకర్యవంతమైన మహానగరంగా తీర్చిదిద్దడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుంది.

# ఎల్ నినో పేరుతో రైతుల నోట్లో మట్టి

**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

ఎల్ నినో పేరుతో రైతుల నోట్లో మట్టికొడుతుందనీ ఆగ్రహం వ్యక్తం చేశారు పాలమూరు పంపులు, కేఎల్ఐ, జూరాల పంపులు నిరంతరాయంగా నడపాలనీ
కాంగ్రెస్ ప్రభుత్వం నోరు తెరవాలి .. లేకుంటే సర్కారు దుర్మార్గాన్ని ఎండగడతాంవరదలేకున్నా రోజుకు 5 వేల క్యూసెక్కుల నీళ్లు ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుండి రీజనరేటెడ్ వాటర్ జూరాలకు వస్తాయినీళ్లు లేవని రైతులను పంటలు వేయకుండా ప్రభుత్వం భయపెట్టింది .. సర్కారు భయానికి సగం మంది రైతులు పంటలు సాగు కూడా చేయలేదనీ వెల్లడించారు పంటలు వేయొద్దు. పంటలు కొనొద్దు. బోనస్ ఇవ్వొద్దు అన్నట్లు ఎల్ నినో పేరుతో దుర్మార్గంగా వ్యవహరిస్తున్నదనీ క్రిష్ణా నది మీద ఉన్న తొలి ప్రాజెక్టు జూరాల. దాని సామర్థ్యం కేవలం 6 టీఎంసీలు శ్రీశైలం రిజర్వాయర్ లో 854 అడుగులకు చేరిన వెంటనే ఏపీ పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలిస్తుందన్నారు హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టు పేరుతో శ్రీశైలం నిర్మించి, మద్రాసుకు తాగునీరు పేరుతో వెళ్లే దారిలో రైతులకు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అని పోతిరెడ్డిపాడును మొదలుపెట్టారువైఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత 11 వేల క్యూసెక్కులు తరలించే పోతిరెడ్డిపాడును అదనంగా మరో 44 వేల క్యూసెక్కులు తరలించేలా ఉమ్మడి రాష్ట్రంలో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. అదే సమయంలో 235 టీఎంసీల సామర్థ్యంగల రిజర్వాయర్లను నిర్మించారన్నారు ఈ రిజర్వాయర్లకు ఎలాంటి అనుమతులు, నీటి కేటాయింపులు లేకున్నా నిర్మించారు. అదే సమయంలో తెలంగాణలో కూడా ప్రాజెక్టులు చేపట్టాం అని చూయించేందుకు జూరాల మీద మొక్కుబడిగా పనులు చేపట్టారుశ్రీశైలం రిజర్వాయర్ మీద




ఆధారపడ్డ ఎస్–ఎల్ బీసీ ప్రాజెక్టును మూడు దశాబ్దాలుగా పెండింగ్ పెట్టారు. కేఎల్ఐ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత రూ.2800 కోట్లు ఖర్చు పెట్టి పూర్తి చేయడం జరిగింది. దీనిని 200 పైచిలుకు రోజులు నడుపుకున్న 40 టీఎంసీలు కూడా వాడుకునే పరిస్థితి లేదనీ మండిపడ్డారు ఈ నేపథ్యంలోనే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి శ్రీశైలం రిజర్వాయర్ నుండి సాగునీరు ఎత్తిపోసుకునేలా కేసీఆర్ పూర్తిగా రాష్ట్ర నిధులతో నిర్మించారు. దీనిని అడ్డుకునేందుకు ఏపీ ప్రభుత్వం, తెలంగాణ ఇంటిదొంగలు శతవిధాల కేసులు వేసి ప్రయత్నించారు. అన్ని అడ్డంకులు దాటుకుని కేసీఆర్ అన్ని అనుమతులు సాధించి నిర్మించారనీ గుర్తు చేశారు రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రూ.600 లేదా రూ.700 కోట్లు ఖర్చు పెడితే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పరిధిలోని రిజర్వాయర్లు నింపుకునే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఎల్నినో వచ్చినా పాలమూరు రైతాంగానికి సాగునీరు అందేది. భూగర్భజలం పెరిగేది.అందాల పోటీలు, మెస్సీతో ఫుట్ బాల్ కోసం పెట్టిన ఖర్చు దీనికి పెడితే రైతాంగానికి సాగునీరు అందేది. శ్రీశైలంలో 100 టీఎంసీల నీళ్లు ఉన్నప్పుడు కూడా పాలమూరు రైతాంగానికి రెండు పంటలకు సాగునీరు అందించాం అని ప్రస్తుతం కూడా శ్రీశైలం రిజర్వాయర్లో 170 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. కేఎల్ఐ కాలువ చివరి వరకు సాగునీరు వెళ్లకపోవడం జిల్లా మంత్రుల అసమర్ధతకు నిదర్శనం అని పేర్కొన్నారు రోజుకు సగటున ఏపీ ప్రభుత్వం 12 టీఎంసీల నీళ్లను ఏపీకి తరలిస్తున్నదనీ తెలంగాణ నీళ్లు ఎలా ఇవ్వొద్దు అని ఏపీ చీఫ్ సెక్రటరీ, ఇరిగేషన్ సెక్రటరీ ఆదిత్యానాథ్ దాస్ ను తీసుకువచ్చి తెలంగాణ ప్రభుత్వం సిగ్గులేకుండా ఉద్దేశపూర్వకంగా సలహాదారుగా పెట్టుకుందిఎన్నిసార్లు ఎత్తిచూపినా ఈ ప్రభుత్వానికి సోయి రావడం లేదు. ఆంధ్రా ప్రయోజనాల కోసమే రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు జలయజ్ఞంలో భాగంగా వైఎస్ 840 అడుగుల వద్ద వెలుగోడు ప్రాజెక్టుకు టన్నెల్స్ నిర్మించారు. దీనికింద 53 టీఎంసీల సామర్థ్యం ఉన్న నల్లమల సాగర్ రిజర్వాయర్ ను నిర్మించారు. త్వరలో ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. శ్రీశైలంలో 854 అడుగుల దిగువకు నీళ్లు వెళ్తే 840 అడుగుల వద్ద షటర్ ఎత్తి సాగునీళ్లు ఎత్తుకెళ్తారువెలుగోడు ద్వారా నీటిని తరలించేందుకు ఏపీ ప్రభుత్వ 9.2 డయామీటర్, 7.2 డయామీటర్ల వెడల్పుతో సొరంగాలని నిర్మించడం పూర్తి చేసిందనీ ధ్వజమెత్తారు అటవీ అనుమతులు, కేంద్ర జలవనరుల శాఖ అనుమతులు ఏవీ లేకుండా, అన్నీ పక్కన పెట్టి అక్కడ పనులు పూర్తి చేస్తున్నారనీ ఈ నీటి దోపిడీని అడ్డుకోకుండా జిల్లా మంత్రి సిగ్గూ ఎగ్గూ లేకుండా శ్రీశైలం డ్యామ్ వద్ద ధర్నా చేస్తానని చెబుతున్నాడు. చేతనైతే ఆంధ్రా నీటి దోపిడీ మీద కేఆర్ఎంబీ ముందుకు వెళ్లి కొట్లాడాలన్నారు ఏం ఆశించి తెలంగాణ రిజర్వాయర్లు, ఎత్తిపోతల పనులను పూర్తి చేయకుండా ఈ ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదికాంగ్రెస్ పార్టీలో ఎవరు ఉంటారో ? ఎవరు పోతారో ? వారి ఇష్టం. వాటితో ప్రజలకు, రైతులకు సంబంధం లేదనీ అన్నారు ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో మంత్రులు లేరు.

## పవర్ ఎగ్జిబిషన్--2026ను సందర్శించిన కొత్తకోట శ్రీనివాసరెడ్డి, ఐపీఎస్




హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పవర్ ఎగ్జిబిషన్--2026ను మాజీ హైదరాబాద్ పోలీస్ కమిషనర్, రిటైర్డ్ డీజీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి, ఐపీఎస్ సందర్శించారు. ఈ సందర్భంగా టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు వి. శివాజీ, కృష్ణారెడ్డి, డాక్టర్ ఎన్. నరసింహులు తదితర అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించిన ఆయన, విద్యుత్ రంగ చరిత్ర, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, భద్రతా ప్రమాణాలను ప్రజలకు చేరవేసే ఈ ఎగ్జిబిషన్ ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు, యువతలో విద్యుత్ రంగంపై అవగాహన పెంపొందించడంలో ఈ ప్రదర్శన కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ గారిని, సంస్థ అధికారులను, సిబ్బందిని అభినందించారు.

## పవర్ ఎగ్జిబిషన్--2026ను సందర్శించిన సిద్ధార్థ, ఎంజీఐటీ విద్యార్థులు



హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పవర్ ఎగ్జిబిషన్--2026ను ఇబ్రహీంపట్నం సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల, మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) విద్యార్థులు సందర్శించారు.
విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ వ్యవస్థలు, స్మార్ట్ మీటరింగ్, విద్యుత్ భద్రత, ఆధునిక సాంకేతికతలపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను విద్యార్థులు ఆసక్తిగా పరిశీలించారు. అధికారులు విద్యుత్ రంగానికి సంబంధించిన పలు అంశాలను వివరించగా, విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. పవర్ ఎగ్జిబిషన్ ద్వారా విద్యుత్ రంగ చరిత్ర, అభివృద్ధి, సాంకేతిక పురోగతిపై విలువైన అవగాహన లభించిందని విద్యార్థులు తెలిపారు.

## అందుబాటులో ఉన్న ప్రజా ప్రతినిధులతో ముగిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం.

హాజరైన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, విప్ లు ఆది శ్రీనివాస్,రామచంద్ర నాయక్, బీర్ల ఐలయ్య,వేముల వీరేశం , ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం,వీర్ల పల్లి శంకర్ ,ప్రేమ్ సాగర్ రావు, నవీన్ యాదవ్,మట్టా రాగ మాయి,మందుల సామేల్,వేద్మ బొజ్జు,కోరం కనకయ్య, లక్ష్మి కాంత రావు,రామ్ దాస్ నాయక్,కడియం శ్రీహరి,డాక్టర్ సంజయ్,బత్తుల లక్ష్మారెడ్డి,మనోహర్ రెడ్డి,తెల్లం వెంకట్ రావు , నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, మురళి నాయక్, యశస్విని రెడ్డి, ఎంపీ లు కడియం కావ్య, రఘు వీర్ రెడ్డి,అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య.

## పారదర్శకంగా అంగన్వాడీ టీచర్ల ఎంపిక ప్రక్రియ

**60 పోస్టులకు 2,167 దరఖాస్తులు**

**పైరవీలకు ఆస్కారం లేదు**

**మెరిట్, మౌఖిక పరీక్ష ఆధారంగానే ఎంపిక**

**జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి**

అంగన్వాడి టీచర్ల ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామని, ఎలాంటి పైరవీలకు ఆస్కారం ఉండబోదని జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ జిల్లాలోని గంగాధర ఐసిడిఎస్ ప్రాజెక్టులో 20 అంగన్వాడి టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయగా 535 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. హుజురాబాద్ ప్రాజెక్టులో 16 పోస్టులకు 449, కరీంనగర్ రూరల్ ప్రాజెక్టులో 16 పోస్టులకు 574, కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టులో 8 పోస్టులకు 609 మంది దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. మొత్తంగా జిల్లాలో 60 పోస్టులకు గాను 2,167 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఆగస్టు ఒకటో తేదీ నుండి 15 వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసిందని, సంబంధిత ఐసిడిఎస్ కార్యాలయాల సిడిపిఓలు దరఖాస్తులన్నింటిని డౌన్లోడ్ చేసుకోవడం పూర్తయిందని తెలిపారు. త్వరలో అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను ప్రారంభిస్తామని, వెరిఫికేషన్ తేదీని అభ్యర్థులకు తెలియజేస్తామని పేర్కొన్నారు.

**పైరవీలకు ఆస్కారం లేదు**

అంగన్వాడి టీచర్ల ఎంపిక ప్రక్రియలో ఎలాంటి పైరవీలకు ఆస్కారం లేదని జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు. ఇంటర్ మార్కుల మెరిట్, ప్రత్యేక కేటగిరీల వారీ మార్కులు ( వితంతువులు, అనాథలు, దివ్యాంగులు), జిల్లా ఎంపిక కమిటీ నిర్వహించే ఇంటర్వ్యూ ఆధారంగా మాత్రమే అభ్యర్థి ఎంపిక చేయబడతారని వివరించారు. ఎవరైనా ఉద్యోగం ఇప్పిస్తామని చెబితే వారి మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకమని తెలిపారు.

## నిజం గెలుస్తుందని నమ్మకంతో ముందుకు సాగాను : మాజీ ఎమ్మెల్యే రేగా.



కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా పెట్టిన అక్రమ కేసులపై న్యాయ పోరాటంలో విజయం సాధించి పెట్టిన కేసులన్నీ రాజకీయ కుట్రతో పెట్టినవని హైకోర్టు కేసు కొట్టేయడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు , పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు నియోజకవర్గానికి విచ్చేసిన సందర్భంగా నియోజకవర్గ ప్రజానీకం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రేగా కాంతారావు మాట్లాడుతూ...ఒక మహిళను అడ్డుపెట్టుకొని ఇలాంటి రాజకీయాలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సరైనది కాదు అని హెచ్చరించారు..లైంగిక వేధింపుల కేసు వల్ల తన కుటుంబం ఎంతగానో మనస్తాపం అనుభవించిందని, కానీ నిజం గెలుస్తుందనే నమ్మకంతో ముందుకు సాగామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు చూపిన మద్దతుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు..నాపై నమోదుచేసిన కేసు పూర్తిగా రాజకీయ కక్షసాధింపు చర్యలో భాగమేనని, న్యాయం మీద ఉన్న విశ్వాసంతోనే న్యాయపోరాటం చేశాను, చివరకు సత్యమే గెలిచింది. ప్రజల ఆశీర్వాదం,పార్టీ నాయకులు, కార్యకర్తలు అందించిన అండతో ఈ పోరాటంలో నిలబడగలిగాను. రాజకీయాల్లో విభేదాలు ఉండొచ్చు,కానీ తప్పుడు ఆరోపణలు చేసి వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడం ప్రజాస్వామ్యానికి మంచి కాదు. ఇకపై ప్రజాసేవకే మరింత అంకితభావంతో పనిచేస్తాను" అని అన్నారు. ఇలాంటి అక్రమ కేసులకు భయపడే పరిస్థితి లేదని అన్నారు. ఇప్పటినుంచి ప్రభుత్వానికి ప్రతి క్షణం వారు ఇచ్చిన హామీలపై గుర్తు చేస్తూ ధర్నాలు పోరాటాలు సాగిస్తూ ప్రజల పక్షాన నిలబడతామని సూచించారు.

### కల్యాణలక్ష్మి నిధులను వెంటనే విడుదల చేయాలి :

హైకోర్టులో కల్యాణ లక్ష్మి పథకం పై కేసు పెండింగ్‌లో ఉన్నా ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడం సరికాదని,

పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే కల్యాణలక్ష్మి పథకాన్ని వెంటనే అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలిచేందుకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలులో జాప్యం జరుగుతోందని ఆరోపించారు. లబ్ధిదారులకు సకాలంలో నిధులు అందక పేద కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు.

### హైకోర్టు అంశంపై కాంగ్రెస్



### ప్రభుత్వం స్పందించాలి :

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించి హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని, ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడం వల్ల సమస్య మరింత జాప్యమవుతోందని రేగా కాంతారావు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే న్యాయపరమైన ప్రక్రియను పూర్తి చేసి, అర్హులైన పేదలకు పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాల విషయంలో రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం వ్యవహరించాలని, పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మి దరఖాస్తులను పరిశీలించి అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సాయం అందించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కల్యాణలక్ష్మి నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ప్రజల తరపున బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పాత రెడ్డిపాలెం ప్రజల రేషన్ కష్టాలు తీర్చాలి : సర్పంచ్ నాగ కుమారి.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలంలోని పాత రెడ్డిపాలెం గ్రామానికి ప్రత్యేకంగా రేషన్ షాప్ కేటాయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ సమస్యపై సర్పంచ్ సాగబోయిన నాగకుమారి, ఉప సర్పంచ్ సానుకొమ్మ శ్రీనివాసరెడ్డి పినపాక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందించిన తర్వాత ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పాత రెడ్డిపాలెంకు రేషన్ షాప్ మంజూరు చేయాలని కోరారు. గ్రామంలో రేషన్ షాప్ లేకపోవడంతో ప్రభుత్వం అందించే బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు పొందేందుకు సమీపంలోని ఇతర గ్రామాలకు వెళ్లాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో వృద్ధులు, మహిళలు, కూలీలు అధికంగా ఉండటంతో రేషన్ సరుకుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లడం ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, పాత రెడ్డిపాలెం గ్రామానికి ప్రత్యేక రేషన్ షాప్ మంజూరు చేయాలని సర్పంచ్, ఉప సర్పంచ్ వినతి పత్రం ద్వారా సంబంధిత అధికారులను కోరుతున్నారు. ఈ సమస్యను అధికారులు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

## వన మహోత్సవం లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి,





**•తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ,**


రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం -2026 కార్యక్రమంలో భాగంగా కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం రాష్ట్ర మంత్రి ఛాంబర్ నుండి, హైదరాబాద్ నుండి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వినయ్ కుమార్ తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అటవీ అధికారులతో వనమహోత్సవం- 2026 లక్ష్యసాధనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మాట్లాడుతూ భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 56 శాతం లక్ష్యాలను పూర్తి చేయడం జరిగిందని, కేటాయించిన లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో కృషి చేసి మొక్కలు నాటి సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. లోటు వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా నిర్దేశిత లక్ష్యాలను చేరుకోలేకపోయామని, ఇక నుండి కురిసే వర్షాల నీటిని ఒడిసిపట్టి, నిల్వచేసి సెప్టెంబర్ చివరి వారం లోగా 100 శాతం లక్ష్యాలను సాధించాలని తెలిపారు. అటవీ శాఖ నర్సరీలలో తగినన్ని మొక్కలు అందుబాటులో ఉన్నాయని, గుర్తించబడిన ప్రాంతాలలో ఎంపిక చేసిన మొక్కలు నాటాలని తెలిపారు. మొక్కలను నాటడమే కాకుండా సంరక్షణ కూడా చేపట్టాలని, నాటిన ప్రతి మొక్క బ్రతికేలా చూడాలని, పశువులు, జంతువుల నుండి కాపాడేందుకు నాటిన మొక్కలకు ట్రీగార్డ్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అర్బన్ ఫారెస్ట్ లలో విరివిగా మొక్కలు నాటాలని, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేయాలని, దేవాలయాల ప్రాంగణాలలో ప్రత్యేకమైన ఎంపిక చేసిన మొక్కలను నాటేందుకు అటవీశాఖ అధికారులు కృషి చేయాలని తెలిపారు. వన మహోత్సవం లక్ష్యాలను పూర్తి చేయడంలో భాగంగా ప్రజలందరికీ తెలిసే విధంగా మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు.

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో వనమహోత్సవం- 2026 లో భాగంగా 41 లక్షల మొక్కలను లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటి వరకు 27 లక్షల మొక్కలను నాటడం జరిగిందని, నిర్ణీత గడువులోగా 100 శాతం లక్ష్యాలను సాధించే దిశగా అధికారుల సమన్వయంతో కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి,

**•మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**





ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి. రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జైపూర్ మండలం కుందారం గ్రామానికి చెందిన ఝాన్సీ స్వయం సహాయక సంఘం సభ్యులు తమ సంఘంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేసి సమస్యను పరిష్కరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన మహమ్మద్ మక్బూల్ పెద్ద మనుషుల సమక్షంలో జరిగిన ఒప్పందం ప్రకారం తనకు రావలసిన వాటాను ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రగతినగర్ వాసులు తమ కాలనీలో రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన కొండగొర్ల చంద్రశేఖర్ తమకు కన్నేపల్లి మండలం పోలంపల్లి శివారులో గల భూమి ఆన్ లైన్ లో ఇతరుల పేరిట నమోదు అయిందని, ఈ పొరపాటున సవరించి తమ పేరిట మార్పు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం ఊత్కూర్ కు చెందిన తనుగుల సందీప్ కుమార్ తాను, తన భార్య దివ్యాంగులమని, నిరుపేదలమని, తమకు జీవనోపాధి కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలోని భగత్ సింగ్ నగర్ టు చెందిన ఎం.ప్రభావతి తనకు కొంత స్థలం ఉందని ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. వేమనపల్లి మండలం ముల్కలపేట గ్రామానికి చెందిన తగరం పరంజ్యోతి తమ భూమి నిషేధిత జాబితాలో చూపుతోందని, సవరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దండేపల్లి మండలం నంబాల గ్రామానికి చెందిన శనిగారపు బాపు తమ ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయిందని, భూమి కాగితాలు, ఖరీదైన వస్తువులు, మంచాలు, బట్టలు పూర్తిగా కాలిపోయాయని, తమ కుటుంబానికి నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండల స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ నుంచి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడిగా... ఏశమేని గణేష్‌కు ఘన సన్మానం



ఏఐటీయూసీ జగిత్యాల జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన ఏశమేని గణేష్‌ను మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు డా. బూరం సంజీవ్, కార్యదర్శి మహమ్మద్ అజీమ్ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

తోటి జర్నలిస్ట్‌గా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకువచ్చిన ఏశమేని గణేష్ ఇప్పుడు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందని డా. బూరం సంజీవ్, మహమ్మద్ అజీమ్ అన్నారు. జర్నలిజం రంగంలో పనిచేస్తూనే కార్మికుల సమస్యలపై అవగాహన కలిగి ఉండటం, వారి హక్కుల కోసం పోరాడే బాధ్యతను స్వీకరించడం అభినందనీయమన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా కార్మికుల సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఆయనకు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత అవకాశాలు లభించాలని, తన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు, జర్నలిస్టులు ఏశమేని గణేష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జంగం విజయ్, అఫ్రోజ్ , జిల్లా కార్యవర్గ సభ్యులు సాజిద్ పాషా, బాసెట్టి హరీష్, గౌరవ సలహాదారులు దాసం కిషన్ ,క్యాషియర్ మక్సూద్, జాయింట్ సెక్రెటరీ పుంద్ర శశికాంత్ రెడ్డి, పింజర్ శివ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎండి సమీయుద్దీన్, కార్యవర్గ సభ్యులు పొనగాని మహేందర్, కుర్ర రాజేందర్ ,యానం రాకేష్ ,రఫీ ఉల్లా, సోహెల్ , హైమద్, ముత్యాల రమేష్ , ఓంకారి శ్రీనివాస్,బొల్లం రాజు,మాజీ అధ్యక్షుడు ఆగ సురేష్ సభ్యులు ఆదిల్ పాషా, రమణ, శశి కుమారు, అమ్ముల ప్రవీణ్ , అప్పం చిన్నారెడ్డి, తేలుకంటి గంగాధర్, అజ్మీరి గంగాధర్ నాయక్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## జంగారెడ్డిపల్లి మాజీ వార్డు సభ్యులు జంతుక అల్లాజికి ఎమ్మెల్యే కసిరెడ్డి. పరామర్శ



ఆమనగల్లు మున్సిపాలిటి పరిధిలోని జంగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు జంతుక అల్లాజీ గారి మాతృమూర్తి మైసమ్మ గుండెపోటుతో ఈనెల 23న మృతిచెందింది. ఆమె మృతి పట్ల మన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గారు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ కసిరెడ్డి సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షులు మెకానిక్ బాబా, పీసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ్మ, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులతో కలిసి సోమవారం ఉదయం జంగారెడ్డి పల్లి కి చేరుకొని మాజీ వార్డు సభ్యులు జంతుక అల్లాజి . పరామర్శించి వారి మాతృమూర్తి దివంగత జంతుక మైసమ్మ. సమాధి వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం అల్లాజీ, వారి కుటుంబీకులను ఎమ్మెల్యే గారు ఓదార్చి మనోధైర్యం కల్పించారు. ఎమ్మెల్యే. వెంట కాంగ్రెస్ నాయకులు ఖాదర్ , కృష్ణానాయక్, ఫరీద్, ప్రసాద్ , కాంగ్రెస్ , యూత్ కాంగ్రెస్ ముఖ్యనాయకులు తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలి,

**•మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**





ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న అల్పాహారం పోషక విలువలతో సకాలంలో అందించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల కేంద్రీకృత వంటశాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ఈ క్రమంలో హరే కృష్ణ ఫౌండేషన్ వారు కార్యక్రమం నిర్వహణకు ముందుకు రావడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు ఉదయం వేళలో పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, ఏకాగ్రత, విద్యాభ్యాసానికి తోడ్పడుతుందని తెలిపారు. అనంతరం ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు 23.75 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేస్తున్న క్రిటికల్ కేర్ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజల సంక్షేమంలో భాగంగా చేపట్టిన పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కారులో మృతదేహం కేసును ఛేదించిన ఎల్కతుర్తి పోలీసులు

### మానస హత్య కేసులో నిందితుడు అరెస్ట్




హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్ట్ సమీపంలోని కారులో మహిళ మృతదేహం లభించిన కేసులో నిందితుడు ఏడెల్లి వినోద్‌కుమార్ (34)ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 21న కారులో నుంచి దుర్వాసన రావడంతో స్థానికుల సమాచారంతో పోలీసులు పరిశీలించగా డిక్కీలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభించింది. వరంగల్ సీపీ, సెంట్రల్ జోన్ డీసీపీ ఆదేశాలతో కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మూడు బృందాలు దర్యాప్తు చేపట్టాయి. ఆదివారం నాగార్జున సీడ్స్ ప్రాసెస్ ప్లాంట్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మృతురాలు మానస తనను వివాహం చేసుకోవాలని కోరడంతో జరిగిన గొడవ నేపథ్యంలో ఆమెను గొంతు నులిమి హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకున్న సీఐ పులి రమేష్, ఎస్ఐ నరసింహారావు, పోలీసు సిబ్బందిని ఏసీపీ ప్రశాంత్ రెడ్డి అభినందించారు.

# నేడు గ్రామ పంచాయితీల్లో మెగా ప్లాంటేషన్

**---ప్రతి పంచాయితీలో వెయ్యి మొక్కల లక్ష్యం**

**---జిల్లా కలెక్టర్ హైమావతి**

మంగళవారం నాడు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలలో మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశించారు.





ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో 1000 ముక్కలను నాటాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారుల ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నిన్నటి నుండి వర్షం కురుస్తుందని మరో రెండు, మూడు రోజులు కంటిన్యూగా వర్షం పడే అవకాశం ఉన్నందున మొక్కలు నాటడానికి ఇది సరైన సమయమని అన్నారు. జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమం ద్వారా 17 లక్షల 68 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని అన్నారు. ఇప్పటికే మొక్కలు నాటడానికి 2 లక్షల పైగా గుంతలు త్రవ్వి సిద్ధంగా ఉంచడం జరిగిందని, మిగతా గుంతలు తవ్వి మొక్కలు నాటి జియో ట్యాగింగ్ చేయాలని అన్నారు. గ్రామపంచాయతీలతోపాటు అని మున్సిపాలిటీలలో నిర్దేశిత మీద మొక్కలు నాటాలని, అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ఇరిగేషన్ శాఖ ఖాళీ భూములలో మొక్కలు నాటాలని అన్నారు. ఈ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని అధికారులను, ప్రజలను ఇన్వాల్వ్ చేస్తూ శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యం మేరకు నాటాలని, మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. అదేవిధంగా వర్షాలు కురుస్తున్నందున దోమలు పెరిగే అవకాశం ఉన్నందనీ అన్ని రెసిడెన్షియల్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో రేపు శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో గల 780 మంది టీబీ పేషెంట్స్ మెడిసిన్స్ వాడడంపై వైద్య శాఖ అధికారులతో రివ్యూ చేయాలని అన్నారు. సెన్సెస్ 2027 కు సంబంధించి వివిధ శాఖలకు ప్రొఫార్మా అందించడం జరిగిందని ఆ ప్రొఫార్మర్ ప్రకారం వివరాలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, డిఆర్ఓ నాగరాజమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మెగా ప్లాంటేషన్ కార్యక్రమం పై జిల్లా కలెక్టర్ తగు ఆదేశాలు జారీ చేశారు.

# ఖాళీ స్థలాలను తేల్చేదెపుడు?

**- చొప్పకట్లపాలెం ఉపసర్పంచ్ పల్లా కొండలరావు, సిపిఎం నాయకులు**

**- బోనకల్ ప్రజావాణి లో ఫిర్యాదు**



మండల పరిధిలోని చొప్పకట్లపాలెం గ్రామకంఠం పరిధిలోని ఖాళీ స్థలాలను సర్వే చేసి గ్రామ పంచాయతీకి అప్పగించాలని ఉప సర్పంచ్ పల్లా కొండలరావు, సిపిఎం నాయకులు బండి శ్రీనివాసరావు, బోయినపల్లి పున్నయ్య, మాజీ సర్పంచ్ బూసి వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు కొండేటి అప్పారావు కోరారు. బోనకల్ లో సోమవారం జరిగిన ప్రజావాణి లో వారు ఫిర్యాదు చేస్తూ గత ఐదు నెలలుగా చెబుతున్నా, గ్రామ సభ తీర్మానం చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోవడంతో పాటు సమస్యలు వస్తున్నాయని తెలిపారు. గ్రామంలో వి.ఓ బిల్డింగ్ మంజూరు కాగా 46/1 సర్వే నెంబర్ లో కట్టాలని గ్రామ పంచాయతీ తీర్మానం చేసి శంఖుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఆ స్థలం వద్దని పది రోజుల్లో తాము అనువైన స్థలం చూపుతామని మాజీ సర్పంచ్ యర్రంశెట్టి సుబ్బారావు ఎపిఎం వెంకటేశ్వర్లు సమక్షంలో తెలుపగా అంగీకారం తెలిపారన్నారు. 15 రోజుల తర్వాత బిల్డింగ్ పనులు ప్రారంభం చేయగా రెవెన్యూ అధికారులు నిర్మాణం ఆపమని తెలిపారు. ఆ తర్వాత పరిణామాల్లో ఆగష్టు ఆరవ తేదీన బోనకల్ లో ఎంపిడిఓ, తహశీల్దార్,ఎపిఎం ఇతర అధికారుల సమక్షంలో జరిగిన అఖిలపక్షం, గ్రామ పంచాయతీ పాలకవర్గం సమావేశంలో వారం రోజుల్లో గ్రామానికి వచ్చి సర్వే చేసి గ్రామ పంచాయతీకి ఖాళీ స్థలాలను అప్పగిస్తామని చెప్పారు. 18 రోజులు గడిచినా ఎటువంటి కార్యాచరణ లేదు. గ్రామానికి మరో వి.ఓ బిల్డింగ్ కూడా మంజూరైన నేపథ్యంలో తక్షణమే రెవెన్యూ అధికారులు సర్వే చేసి గ్రామ పంచాయతీకి ఖాళీ స్థలాలను హద్దులతో సహా అప్పగించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా గొడవలు జరుగుతున్నాయన్నారు. గ్రామ పంచాయతీ తీర్మానంకు విలువ లేకుండా అధికారులు ప్రవర్తించడం ప్రజాస్వామ్య విరుద్ధమని తెలిపారు. గ్రామంలో ఏ అభివృద్ధి కార్యక్రమం ఆగకుండా ప్రజాస్వామ్య యుతంగా ఎవరి ఒత్తిడులకు తలొగ్గకుండా పని చేయాలని కోరారు. ఈ ఫిర్యాదు పై వార్డు సభ్యులు బోయినపల్లి లక్ష్మి,మార్కపుడి రజిని లు సంతకం చేశారు.

## చొప్పకట్ల పాలెం గ్రామంలో అక్రమ మట్టితోలకాలు, పంచాయతీ నిధుల దుర్వినియోగం, ప్రభుత్వ స్థలాల కబ్జాపై జెసి కి ఫిర్యాదు

**•స్పందించిన జే సి వెంటనే తాసిల్దార్ పోన్**

**•పంచాయతీ నిధులు దుర్వినియోగం, ప్రభుత్వ ప్రభుత్వ స్థలాల కబ్జాపై డిఎల్ పీవో ను విచారణ కి ఆదేశం**

మండల పరిధిలోని చొప్పకట్లపాలెం గ్రామ సర్పంచ్ భర్త ప్రభుత్వ భూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా జెసిబి లతో ట్రాక్టర్లతో అక్రమ మట్టి తోలకాలు జరుపట గురించి మరియు సుమారు 15 లక్షల పంచాయతీ నిధులను నాలుగు నెలల కాలంలో ఎటువంటి ఎంబీ రికార్డులు లేకుండా డ్రా చేయడం గురించి ప్రభుత్వ స్థలాన్ని అమ్మడం గురించి కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో సోమవారం గ్రామ ప్రజలు మరియు కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేయడం జరిగింది. మా గ్రామంలో సుమారు 10 నుండి 15 ఎకరాల ప్రభుత్వ భూమి కలదు. అట్టి భూమి నందు గ్రామపంచాయతీ తీర్మానం లేకుండా పంచాయతీ పాలకవర్గం తెలవకుండా ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా సర్పంచ్ భర్త ఆదివారం చూసుకుని జెసిబిలు ఏర్పాటు చేసి ట్రాక్టర్ల ద్వారా



వందలాది ట్రిప్పుల మట్టితోలకాన్ని జరిపాడు. అదేమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తే రోడ్డుకు తోలుతున్న పంచాయతీ తీర్మానం ఉంది అని చెప్పాడు. గ్రామపంచాయతీ నిధులతో అంతర్గత రోడ్లకు తోలాల్సిన మట్టిని అక్రమంగా ఊరి బయట గల ఒకరిద్దరు రైతుల స్వార్థ ప్రయోజనాల కోసం ప్రభుత్వ ఆస్తిని అక్రమంగా తరలించాడు. సర్పంచ్ భర్త గ్రామంలో అలజల్లు సృష్టిస్తూ గ్రామ పంచాయతీ విషయాల్లో జోక్యం చేసుకుంటూ ప్రజలను భయభ్రాంతులను గురి చేస్తున్నాడు. ఇదంతా పంచాయతీ కార్యదర్శి కనుసనల్లోనే జరగటం విశేషం. అక్రమ మట్టి తోలకాలను నిలిపివేసి అక్రమం మట్టి తోలిన జెసిబిని ట్రాక్టర్ల పై చర్యలు తీసుకోవాలనిమా గ్రామంలో గత 40 సంవత్సరాల క్రితం ప్రభుత్వ ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. అందులో కొన్ని ప్లాట్లు ప్రభుత్వ భవిష్యత్తు అవసరాల రీత్యా ఖాళీగా ఉంచబడ్డాయి. గత పాలకవర్గం అట్టి ఖాళీ ప్లాటుకు ప్రభుత్వ నిధులతో మట్టితోలించి బీసీ కమ్యూనిటీ హాల్ లేదా వివో బిల్డింగు ఆ స్థలాన్ని వినియోగించాలని ఉంచింది. నూతన పాలకవర్గం ఏర్పడిన నెల రోజులకే సర్పంచ్, సర్పంచి భర్త, ఉప సర్పంచ్ కుమ్మక్కై అట్టి స్థలాన్ని వారి పార్టీకి అనుకూలమైన వ్యక్తికి రెండు లక్షలకు అమ్ముకున్నారు. ఈ విషయం పంచాయతీ కార్యదర్శి కి తెలిసి కూడా నోరుమెదపడం లేదు. ప్రభుత్వ భూమిని అమ్ముకున్న వారిపై చర్యలు తీసుకోవాలని అదేవిధంగా పంచాయతీ నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని జెసి గారిని కోరడం జరిగింది. స్పందించిన ఆయన వెంటనే విచారణకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్రం శెట్టి సుబ్బారావు, వార్డు మెంబర్లు దారెల్లి వెంకటేశ్వర్లు, బోయినపల్లి స్వర్ణ, తుపాకుల కవిత, దారెల్లి రమణమ్మ, మరియు గ్రామస్తులు బోయినపల్లి నరేష్, తుపాకుల నరేష్, మస్తాన్, తాళ్లూరి రామారావు, కోమ్మినేని వెంకటేశ్వర్లు, తెలపైన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 27 నుండి సమగ్ర ఓటర్ల జాబితా పై గ్రామసభలు

**•రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**



ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 27 వ తేదీన గ్రామ/వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు,ఈ.ఆర్.ఓ లు, ఎ.ఈ.ఆర్.ఓ. లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా గ్రామ/వార్డు సభల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ లో భాగంగా ఈ నెల 27వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో గ్రామ/వార్డు సభలు నిర్వహించి ముసాయిదా ఓటర్ల జాబితా, ఎ.ఎస్.డి.(ఆబ్సెంట్, షిఫ్ట్, డెత్) జాబితా బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్ల సమక్షంలో చదివి వినిపించాలని తెలిపారు. గ్రామ/వార్డు సభల నిర్వహణ సమయంలో బూత్ స్థాయి అధికారులు ఫారం-6, 7, 8 అందుబాటులో ఉంచుకోవాలని, ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే నోట్ చేసుకోవాలని తెలిపారు. అనామోలీస్, మ్యాపింగ్ కానీ ఓటర్లకు సంబంధించిన వివరాలు బూత్ స్థాయి అధికారుల ద్వారా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలని, పెండింగ్ లో ఉన్న నోటీసుల జనరేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి నోటీసులు అందించాలని తెలిపారు. అవసరం ఉన్నచోట అదనపు ఎ.ఈ.ఆర్.ఓ.ల సంబంధిత ప్రతిపాదనలు మంగళవారం లోగా పంపించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కే.హైమావతి మాట్లాడుతూ, జిల్లాలో అనామోలీస్, మ్యాపింగ్ కానీ ఓటర్లకు సంబంధించిన నోటీసుల జనరేషన్ దాదాపు పూర్తి కావచ్చిందని, కార్యాచరణ ప్రకారం గ్రామ/వార్డు సభలు నిర్వహించడం జరుగుతుందని, అదనపు ఎ.ఈ.ఆర్.ఓ ల సంబంధిత ప్రతిపాదనలు పంపించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

**•కలెక్టర్లను ఆదేశించిన మంత్రి కొండా సురేఖ**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం-2026 కార్యక్రమంలో జిల్లాలకు కేటాయించిన మొక్కలు నాటే లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా నూరు శాతం పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు.సోమవారం డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుంచి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వినయ్ కుమార్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అటవీ అధికారులతో వనమహోత్సవం-2026 లక్ష్యసాధనపై మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భావితరాలకు సమతుల్యమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవంలో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 56 శాతం లక్ష్యాలను



సాధించినట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాలను సెప్టెంబర్ చివరి వారం నాటికి నూరు శాతం పూర్తి చేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో లక్ష్యాలను సాధించలేకపోయామని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకుని మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని అన్నారు. అటవీ శాఖ నర్సరీల్లో తగినన్ని మొక్కలు అందుబాటులో ఉన్నందున, గుర్తించిన ప్రాంతాలకు అనుగుణంగా సరైన జాతుల మొక్కలను ఎంపిక చేసి నాటాలని సూచించారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. నాటిన ప్రతి మొక్క జీవించేలా చర్యలు తీసుకోవాలని, పశువులు, జంతువుల నుంచి మొక్కలను రక్షించేందుకు అవసరమైన చోట్ల ట్రీగార్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అర్బన్ ఫారెస్ట్ ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేయాలని సూచించారు. దేవాలయాల ప్రాంగణాల్లో ప్రత్యేకంగా ఎంపిక చేసిన మొక్కలను నాటేలా అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. వనమహోత్సవం లక్ష్యాల సాధనపై ప్రజలకు అవగాహన కల్పించేలా మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కే.హైమావతి, డిఆర్డీఓ రమేష్, డీపీఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# బోనకల్‌లో నాలుగో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలి

**•ప్రజావాణిలో అఖిలపక్ష నాయకుల వినతి**

గ్రామంలో ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా అదనపు పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని కోరుతూ బోనకల్ గ్రామ అఖిలపక్ష నాయకులు సోమవారం మండల కేంద్రంలోని ఎండీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...బోనకల్ గ్రామంలో సుమారు 3,400 మంది ఓటర్లు ఉన్నప్పటికీ ప్రస్తుతం మూడు పోలింగ్ బూత్‌లు మాత్రమే ఉన్నాయని నాయకులు తెలిపారు. దీంతో ఎన్నికల సమయంలో ఓటర్లు గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా నాలుగో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

అలాగే ఇటీవల బీఎల్ఓలు ఓటర్ల నుంచి




ఎన్యుమరేషన్ ఫారంతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను సేకరించినప్పటికీ, డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో పాత ఫొటోలే కనిపిస్తున్నాయని తెలిపారు. ఓటర్లు అందించిన నూతన ఫొటోలతో డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను సవరించాలని అధికారులను కోరారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తెల్లాకుల శ్రీనివాసరావు, ఉప్పర శ్రీను, బిల్లా విశ్వనాథం, బీజేపీ నాయకులు గుగులోతు నాగేశ్వరరావు, గంగుల నాగయ్య, బీఆర్ఎస్ నాయకులు చిట్టోజు శ్రీనివాస్ అలియాస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో గ్రామ/వార్డు సభలు నిర్వహించాలి,





**•రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి,**

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 27 వ తేదీన గ్రామ/వార్డు సభలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు,ఈ.ఆర్.ఓ లు, ఎ.ఈ.ఆర్.ఓ. లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా గ్రామ/వార్డు సభల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, మాట్లాడుతూ ఎస్ఐఆర్ లో భాగంగా ఈ నెల 27వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో గ్రామ/వార్డు సభలు నిర్వహించి ముసాయిదా ఓటర్ల జాబితా, ఎ.ఎస్.డి.(ఆబ్సెంట్, షిఫ్ట్, డెత్) జాబితా బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్ల సమక్షంలో చదివి వినిపించాలని తెలిపారు. గ్రామ/వార్డు సభల నిర్వహణ సమయంలో బూత్ స్థాయి అధికారులు ఫారం-6, 7, 8 అందుబాటులో ఉంచుకోవాలని, ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే నోట్ చేసుకోవాలని తెలిపారు. అనామోలీస్, మ్యాపింగ్ కానీ ఓటర్లకు సంబంధించిన వివరాలు బూత్ స్థాయి అధికారుల ద్వారా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలని, పెండింగ్ లో ఉన్న నోటీసుల జనరేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి నోటీసులు అందించాలని తెలిపారు. అవసరం ఉన్నచోట అదనపు ఎ.ఈ.ఆర్.ఓ.ల సంబంధిత ప్రతిపాదనలు రేపటి లోగా పంపించాలని తెలిపారు.

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో అనామోలీస్, మ్యాపింగ్ కానీ ఓటర్లకు సంబంధించిన నోటీసుల జనరేషన్ దాదాపు పూర్తి కావచ్చిందని, నోటీసులను సంబంధిత ఓటర్లకు 3 రోజులలోగా అందిస్తామని తెలిపారు. కార్యాచరణ ప్రకారం గ్రామ/వార్డు సభలు నిర్వహించడం జరుగుతుందని, అదనపు ఎ.ఈ.ఆర్.ఓ ల సంబంధిత ప్రతిపాదనలు పంపించడం జరిగిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, మంచిర్యాల రాజస్వ మండలాధికారి శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, అన్ని మండలాల తహసిల్దార్లు, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లోకి మరో దేశీ కంపెనీ

## మివి స్మార్ట్‌ఫోన్ రంగంలోకి ఎంట్రీ

- తొలి ఫోన్ సెప్టెంబర్‌లో విడుదలయ్యే అవకాశం
- ఫ్లిప్‌కార్ట్‌లో పోస్టర్ ప్రత్యక్షం
- కంపెనీ కూడా అధికారికంగా ధ్రువీకరణ
- తక్కువ ధరలో ఫోన్లపై దృష్టి
- హిమాంశు టాండన్ కొత్త చీఫ్ బిజినెస్ ఆఫీసర్
- ఫైర్‌బోల్ట్ నుంచి బోల్ట్ ఏస్, ఎవో
- ఆగస్టు 25న ఫైర్‌బోల్ట్ ఫోన్ల లాంచ్
- దేశీ బ్రాండ్లకు మళ్లీ ఊతం




స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో కొత్త ట్రెండ్ మొదలైంది. నిన్న మొన్నటి వరకు వేరబుల్స్ తయారీలో ఉన్న కంపెనీలు.. మొబైల్ తయారీలోకి అడుగుపెడుతున్నాయి. దేశీయ కంపెనీ అయిన ఫైర్‌బోల్ట్ సంస్థ.. బోల్ట్ పేరుతో స్మార్ట్‌ఫోన్‌ల విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో మరో వేరెబుల్ బ్రాండ్ మివి కూడా ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ తయారీలోకి అడుగుపెట్టనుంది. దీనికి సంబంధించి ఫ్లిప్‌కార్ట్‌లో ఓ పోస్టర్ దర్శనమిచ్చింది. కంపెనీ కూడా దీన్ని ధ్రువీకరిస్తూ 'ఎక్స్' హ్యాండిల్‌లో పోస్ట్ పెట్టింది.

టెక్ వర్గాల సమాచారం ప్రకారం.. సెప్టెంబర్‌లో మివి తన తొలి స్మార్ట్‌ఫోన్‌ను ఆవిష్కరించనున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఇప్పటికే కంపెనీ సన్నాహాలు ప్రారంభించింది. పోకో, నథింగ్ వంటి కంపెనీల్లో గతంలో పనిచేసిన హిమాంశు టాండన్‌ను కంపెనీ తన చీఫ్ బిజినెస్ ఆఫీసర్‌గా నియమించుకుంది. స్మార్ట్‌ఫోన్ ధరలు ఆకాశాన్ని తాకుతున్న వేళ తక్కువ ధరలో మొబైల్స్ లాంచ్ చేసి తద్వారా వినియోగదారులకు చేరువ అయ్యేందుకు ఈ కంపెనీలు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది.

ఒకప్పుడు మైక్రోమ్యాక్స్, కార్బన్, సెల్‌కాన్ వంటి కంపెనీలు దేశీయంగా సత్తా చాటాయి. చైనా కంపెనీల నుంచి వచ్చిన పోటీని తట్టుకోలేక కనుమరుగైపోయాయి. ప్రస్తుతం లావా మాత్రమే దేశీయంగా అడపాదడపా స్మార్ట్‌ఫోన్లను విడుదల చేస్తోంది. మరో దేశీయ కంపెనీ ఏఐం కూడా స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ క్రమంలోనే ఫైర్‌బోల్ట్ సంస్థ బోల్ట్.. ఏస్, ఎవో పేరిట ఆగస్టు 25న స్మార్ట్‌ఫోన్లను లాంచ్ చేయనుంది. ఆకట్టుకునే ఫీచర్లతో బడ్జెట్ ధరలో వీటిని లాంచ్ చేయనున్నట్లు తెలుస్తోంది.

# నష్టాలతో ముగిసిన సూచీలు..

## సెన్సెక్స్ 172 పాయింట్లు డౌన్

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు సూచీలను పడేశాయి. జూన్‌లో కుదిరిన ఒప్పందం గడువు ముగియడం, ఇరాన్‌పై అమెరికా కఠిన ఆర్థిక ఆంక్షలను తీవ్రతరం చేసింది. ప్రతిగా ఇరాన్ కూడా హెచ్చరికలకు దిగడంతో యుద్ధ వాతావరణం నెలకొంది. పశ్చిమాసియాలో నెలకొన్న ఈ పరిణామాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీంతో ఉదయం స్వల్ప లాభాల్లో కదలాడిన సూచీలు నష్టాల్లో ముగిశాయి. పీఎస్‌యూ బ్యాంక్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి.

సెన్సెక్స్ ఉదయం 77,629.56 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,540.83) లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల బాట పట్టింది. ఇంట్రాడేలో 77,201.66 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 171.72 పాయింట్ల నష్టంతో 77,369.11 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 32.95 పాయింట్ల నష్టంతో 24,219.05 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.74గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, బీఈఎల్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ట్రెంట్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టాటా స్టీల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, హిందుస్థాన్ యూనిలీవర్, సన్‌ఫార్మా షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 92.73 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4646 డాలర్ల వద్ద ట్రేడుతోంది.



# మోనోషాక్ సస్పెన్షన్‌తో

# పల్సర్ 125, పల్సర్ 150..

## ధర, ఫీచర్లు ఇవే



ముంబయి: ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ బజాజ్ ఆటో కొత్త పల్సర్ మోటార్ సైకిళ్లను దేశీయంగా లాంచ్ చేసింది. 125, 150 సీసీ సెగ్మెంట్లలో వీటిని ఆవిష్కరించింది. మోనోషాక్ సస్పెన్షన్, రైడ్‌మోడ్, ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్ వంటి ఫీచర్లను కొత్తగా జోడించింది. క్లాసిక్ మోడళ్లలో వెనుక భాగంలో ఉండే డ్యూయల్‌షాక్ సస్పెన్షన్ స్థానంలో మోనోషాక్ తీసుకురావడం ఇదే తొలిసారి. దీంతోపాటు క్రాల్‌టెక్ అనే కొత్త ఫీచర్‌ను జోడించారు. ట్రాఫిక్‌లో పదే పదే థ్రాటిల్ ఇవ్వాల్సిన అవసరం లేకుండా బైక్ నెమ్మదిగా కదిలేందుకు ఈ ఫీచర్ సహాయపడుతుంది. ఇంజిన్ ఆగిపోకుండా చూస్తుంది.

### పల్సర్ 150 ఫీచర్లు

కొత్త పల్సర్ 150.. 13.6 బీహెచ్‌పీ పవర్‌ను ఉత్పత్తి చేస్తుంది. సింగిల్ డిస్క్, ట్విన్ డిస్క్ వేరియంట్లలో లభిస్తుంది. సింగిల్ డిస్క్ వేరియంట్‌లో రోడ్, రెయిన్, స్పోర్ట్– 3 రైడింగ్ మోడ్‌లు ఉంటాయి. కలర్ ఎల్‌సీడీ డిస్‌ప్లే ఇచ్చారు. ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్, యూఎస్‌బీ టైప్–సీ ఛార్జింగ్ పోర్ట్ సదుపాయం ఉంది. ట్విన్ డిస్క్ వేరియంట్‌లో గూగుల్ మ్యాప్స్ నావిగేషన్‌తో కూడిన 5 అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లే ఇచ్చారు. ఎల్ఈడీ ఇండికేటర్లు, హజార్డ్ ల్యాంప్స్, ఇంటిగ్రేటెడ్ స్టార్టర్ జనరేటర్ సదుపాయాలు ఉన్నాయి. సింగిల్ సీట్, స్పోర్టీ స్ప్లిట్ సీట్ ఆప్షన్లతో లభిస్తుంది.

### పల్సర్ 125 ఫీచర్లు

ఇక పల్సర్ 125 ఫీచర్ల విషయానికొస్తే.. ఇందులోని ఇంజిన్ 11.7 బీహెచ్‌పీ పవర్‌ను ఉత్పత్తి చేస్తుంది. బేస్ వేరియంట్ కలర్ ఎల్‌సీడీ డిస్‌ప్లే, ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్ సదుపాయంతో వస్తోంది. మిడ్, టాప్ వేరియంట్లలో రోడ్, రెయిన్, స్పోర్ట్ రైడింగ్ మోడ్‌లు ఉన్నాయి. 5 అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లే ఉంటుంది. ఎల్ఈడీ ఇండికేటర్లు, హజార్డ్ లైట్లు, ఇంటిగ్రేటెడ్ స్టార్టర్ జనరేటర్ సదుపాయాలు ఉన్నాయి. ఈ వేరియంట్లలో స్టాండర్డ్‌గా టైప్–సి ఛార్జింగ్ పోర్ట్ సదుపాయం ఉంటుంది. సింగిల్ సీట్ లేదా స్ప్లిట్ సీట్ ఆప్షన్లతో లభిస్తుంది.

### పల్సర్ 150 ధర

కొత్త పల్సర్ 150 ధర రూ.1.15 లక్షల (ఎక్స్‌షోరూమ్) నుంచి ప్రారంభమవుతుంది. సింగిల్ డిస్క్ వేరియంట్ ధర రూ.1,15,233గా నిర్ణయించారు. ఇక ట్విన్ డిస్క్ సింగిల్ సీట్ ధర రూ.1,22,184, ట్విన్ డిస్క్ స్ప్లిట్ సీట్ వేరియంట్ ధర రూ.1,23,187గా కంపెనీ నిర్ణయించింది.

### పల్సర్ 125 ధర

పల్సర్ 125 మొత్తం నాలుగు వేరియంట్లలో లభిస్తుంది. బేస్ వేరియంట్ ధరను రూ.92,990గా నిర్ణయించారు. ఎస్‌టీడీ సింగిల్ సీట్ రూ.99,291, ఎస్‌టీడీ స్ప్లిట్ సీట్ రూ.1,00,288, ప్రీమియం స్ప్లిట్ సీట్ ధర రూ.1,04,318గా కంపెనీ పేర్కొంది.

### లలితా జువెలరీ ఐపీఓ.. మదుపర్లకు డబ్బులొచ్చాయ్!




ప్రముఖ ఆభరణాల సంస్థ లలితా జువెలరీ మార్ట్ లిస్టింగ్‌లో (ఘుశ్రీఊష్ట్రుఘు జీవఫవశ్రీశ్రీవతీఎ ఖూూ) అదరగొట్టింది. ఇష్యూ ధరతో పోలిస్తే 32 శాతం ప్రీమియంతో షేర్లు లిస్టయ్యాయి. ఇష్యూ ధర రూ.201 కాగా.. బీఎస్ఈలో 31.99 శాతం ప్రీమియంతో రూ.265.30 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. అటు ఎన్ఎస్ఈలోనూ 31.84 శాతం ప్రీమియంతో రూ.265 వద్ద షేర్లు లిస్టయ్యాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.14,462.90 కోట్లకు చేరింది.

లలితా జువెలరీ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ఆగస్టు 17న ప్రారంభమై.. 19న ముగిసింది. ధరల శ్రేణిని రూ.190–201గా నిర్ణయించారు. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.1200 కోట్లు , ఆఫర్ ఫర్ సేల్ కింద రూ.500 కోట్లు.. వెరసి రూ.1700 కోట్లు కంపెనీ మార్కెట్ నుంచి సమీకరించింది. ఈ ఐపీఓకు 62.97 రెట్లు సబ్‌స్క్రిప్షన్ అందింది. యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి మరో రూ.508 కోట్లు సమీకరించింది. 1985లో చెన్నైలోని టీనగర్‌లో లలితా జువెలరీ ప్రస్థానం ప్రారంభమైంది. 'డబ్బులు ఎవరికీ ఊరికే రావు' అనే స్లోగన్‌తో ఈ సంస్థ అధినేత కిరణ్ కుమార్ బాగా పాపులర్ అయ్యారు.

# ఈ టాటా ఈవీల డెలివరీకి

# అధిక వెయిటింగ్ టైమ్

- ఈవీలకు 24 వారాల వరకు వెయిటింగ్
- టియాగో ఈవీ: 18--24 వారాలు
- పంచ్ ఈవీ స్మార్ట్ 30: 18--24 వారాలు
- సియారా ఈవీ ప్యూర్ 65: 12--15 వారాలు
- పంచ్ ఈవీ స్మార్ట్ 40: 10--12 వారాలు
- ఇతర పంచ్ ఈవీలకు: 8--10 వారాలు
- నెక్సాన్ ఈవీ: 3--4 వారాలు
- హ్యారియర్ ఈవీ: 2--3 వారాలు
- ఈవీలకు పెరుగుతున్న డిమాండే ప్రధాన కారణం




టాటా గ్రూప్‌నకు చెందిన కార్ల తయారీ సంస్థ టాటా మోటార్స్ దేశీయంగా పెట్రోల్, డీజిల్‌తో పాటు ఈవీలను విక్రయిస్తోంది. సంప్రదాయ ఇంధనంతో నడిచే కార్లకు తక్కువ వెయిటింగ్ టైమ్ కొనసాగుతుండగా.. ఈవీల డెలివరీకి మాత్రం అధిక సమయం పడుతోంది. కొన్ని రకాల వేరియంట్లకు గరిష్ఠంగా 24 వారాలు కూడా వెయిటింగ్ టైమ్ ఉంది. దేశీయంగా ఎలక్ట్రిక్ వాహనాలకు ఆదరణ పెరుగుతుండడంతో డెలివరీ ఆలస్యానికి కారణంగా తెలుస్తోంది.

టాటా టియాగో మోడళ్లలో స్మార్ట్ 19, ప్యూర్ం 19 వేరియంట్లకు 18 నుంచి 24 వారాల వెయిటింగ్ పీరియడ్ కొనసాగుతోంది. ఇతర వేరియంట్లకు 4 నుంచి 6 వారాలు ఉంది. టాటా పంచ్ ఈవీ స్మార్ట్ 30 వేరియంట్‌కు 18 నుంచి 24 వారాలు; స్మార్ట్ 40కి 10 నుంచి 12 వారాలు; ఇతర వేరియంట్లకు 8 నుంచి 10 వారాల వెయిటింగ్ పీరియడ్ కొనసాగుతోంది. ఇటీవల విడుదలైన సియారా ఈవీలో ప్యూర్ 65 వేరియంట్‌కు 12 నుంచి 15 వారాలు, మిగతా వేరియంట్లకు 4 నుంచి 6 వారాల వెయిటింగ్ టైమ్ ఉంది. (గమనిక: వెయిటింగ్ టైమ్‌లు ఆగస్టు నెలకు సంబంధించినవి)

స్టూడెంట్స్ కోసం 'ఐకూ జెడ్ 11'.. 32ఎంపీ సెల్ఫీ కెమెరా, ఏఐ ఫీచర్లు..

టియాగో, పంచ్ పెట్రోల్/సీఎన్‌జీ స్మార్ట్ వేరియంట్లకు 10 నుంచి 12 వారాలు; ఇతర వేరియంట్లకు 4 నుంచి 7 వారాలు పడుతోంది. హ్యారియర్, సఫారీ పెట్రోల్ మోడళ్లకు 10 నుంచి 12 వారాలు; నెక్సాన్ డీజిల్, నెక్సాన్ ఈవీకి 3 నుంచి 4 వారాలు వెయిటింగ్ కొనసాగుతోంది. సియారా సంప్రదాయ ఇంధన మోడల్‌కు 6 నుంచి 8 వారాలు పడుతుండగా.. టిగోర్, ఆల్ట్రోజ్, కర్వ్ ఈవీ/ పెట్రోల్ నెక్సాన్ పెట్రోల్/సీఎన్‌జీ కార్లు మాత్రం 1 నుంచి 2 వారాల వెయిటింగ్ పీరియడ్‌తో కొనుగోలుదారులకు లభిస్తున్నాయి. కర్వ్ డీజిల్, హ్యారియర్, సఫారీ, హ్యారియర్ ఈవీ మోడళ్లకు 2 నుంచి 3

# 54 ఏళ్ల క్రితం మధురంగా మోగిన ప్రేమగీతం ---

# "నువ్వూ నేనూ ఏకమైనాము"

**ట్రై నెట్ న్యూస్ । 24 ఆగస్టు 2026**

తెలుగు సినిమా సంగీత చరిత్రలో కొన్ని పాటలకు కాలంతో సంబంధం ఉండదు. దశాబ్దాలు గడిచినా వాటి మాధుర్యం తగ్గదు. అలాంటి చిరస్మరణీయ గీతమే "నువ్వూ నేనూ ఏకమైనాము". ఈ పాట 1972లో విడుదలైన "కొడుకు కోడళ్ళు" చిత్రంలోనిది. అక్కినేని నాగేశ్వరరావు, వాణిశ్రీపై చిత్రీకరించిన ఈ యుగళగీతం ఇప్పటికీ పాతతరం ప్రేక్షకులకు మధుర జ్ఞాపకమే.

2026 నాటికి ఈ పాటకు 54 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఇంత సుదీర్ఘ కాలం గడిచినా పాటను వింటే అప్పటి తెలుగు సినిమా ప్రేమ, సంగీతం, సాహిత్యం, నటన అన్నీ మన కళ్ల ముందు కదలాడుతాయి.

చిత్రం, నటీనటులు

"కొడుకు కోడళ్ళు" చిత్రంలో అక్కినేని నాగేశ్వరరావు, వాణిశ్రీ ప్రధాన పాత్రల్లో నటించారు. ఎస్.వి. రంగారావు, లక్ష్మి, గుమ్మడి, శాంతకుమారి తదితరులు కూడా నటించారు. ఈ చిత్రానికి పి. పుల్లయ్య దర్శకత్వం వహించారు. వి. వెంకటేశ్వర్లు నిర్మాతగా వ్యవహరించారు. చిత్రానికి కె.వి. మహదేవన్ సంగీతాన్ని అందించారు.

ఈ పాటకు ఆచార్య ఆత్రేయ సాహిత్యం అందించగా, ఘంటసాల, పి. సుశీల తమ మధురమైన గాత్రంతో పాటకు ప్రాణం పోశారు.

పాటలోని ప్రధాన భావం

ఈ పాట యొక్క కేంద్ర భావం ప్రేమలో ఇద్దరి మనసులు ఒక్కటవడం.

ప్రేమికులు తమను తాము ఇద్దరు వ్యక్తులుగా కాకుండా, ఒకే ప్రపంచంగా భావించుకుంటారు.

ప్రపంచమంతా తమకు వ్యతిరేకంగా ఉన్నా, తమ అనుబంధాన్ని మాత్రం విడిచిపెట్టబోమనే దృఢమైన భావాన్ని పాట వ్యక్తం చేస్తుంది.

ఇది కేవలం ప్రేమను చెప్పే పాట కాదు. జీవితాన్ని కలిసి నిర్మించుకోవాలనే ఒక అందమైన కల కూడా ఇందులో కనిపిస్తుంది.

మొదటి చరణం --- ఒక ఇంటి కల

మొదటి చరణంలో ప్రేమికులు తమ రెండు మనసులను కలిపి ఒక ఇంటిని నిర్మించుకోవాలని కలలు కంటారు.

ఆ ఇల్లు కేవలం ఇటుకలు, గోడలతో నిర్మించిన ఇల్లు కాదు. అందులో ప్రేమ అనే దీపం ఎప్పటికీ వెలుగుతూ ఉండాలని కోరుకుంటారు.

తమ మనసులను బంగారంలా భావించి, తమ యవ్వన కోరికలను మల్లెపూలతో పోల్చడం ఈ చరణంలోని కవితాత్మక అందం. ప్రేమతో నిండిన కుటుంబ జీవితాన్ని ముందుగానే ఊహించుకుంటున్నట్లుగా ఈ భాగం ఉంటుంది.

రెండో చరణం --- ప్రేమ అనే పందిరి

రెండో చరణంలో ప్రేమికులు తమ చెలిమితో ఒక చల్లని పందిరిని నిర్మించుకోవాలని భావిస్తారు.

ఇక్కడ కలల తీగలు అనే అందమైన ఊహను ఉపయోగించారు. ఆ తీగలు ఒకదానితో ఒకటి అల్లుకున్నట్లే తమ జీవితాలు కూడా పరస్పర అనుబంధంతో కలిసిపోవాలని కోరుకుంటారు.



తమ జీవితాలను ఎప్పటికీ వాడిపోని పువ్వులతో పోల్చడం ద్వారా ప్రేమ శాశ్వతంగా ఉండాలనే ఆకాంక్షను ఆత్రేయ ఎంతో అందంగా వ్యక్తం చేశారు.

మూడో చరణం --- వెన్నెల, వెచ్చదనం

మూడో చరణం పాటలో మరింత కవితాత్మకంగా ఉంటుంది.

ఒకరు మరొకరికి వెన్నెల చల్లదనాన్ని, ఎండలోని వెచ్చదనాన్ని అందించాలనే భావనను వ్యక్తం చేస్తారు.

ప్రేమలో ఉన్నప్పుడు జీవితంలోని ప్రతి అనుభూతి ప్రత్యేకంగా అనిపిస్తుంది. చల్లదనంలోనూ ఆనందం, వెచ్చదనంలోనూ ఆప్యాయత కనిపిస్తుంది. ఆ భావాన్ని ప్రకృతితో ముడిపెట్టి ఆత్రేయ ఎంతో అందంగా రాశారు.

ఇక సూర్యచంద్రులు లేని కొత్త ప్రపంచాన్ని సృష్టించుకోవాలనే ఊహ ద్వారా, ఇతరుల ప్రపంచంతో సంబంధం లేకుండా తమ ప్రేమే తమ ప్రపంచంగా జీవించాలనే భావన వ్యక్తమవుతుంది.

అక్కినేని--వాణిశ్రీల అభినయం

ఈ పాటకు మరో ప్రత్యేకత అక్కినేని నాగేశ్వరరావు, వాణిశ్రీల అభినయం.

అక్కినేని నాగేశ్వరరావు గారి ప్రేమగీతాల్లో కనిపించే సున్నితమైన హావభావాలు, చూపులు, చిరునవ్వులు ఈ పాటకు మరింత అందాన్ని ఇచ్చాయి. వాణిశ్రీ కూడా తన సహజమైన అభినయంతో పాటలోని ప్రేమ భావాన్ని తెరపై అద్భుతంగా ఆవిష్కరించారు. అందుకే ఈ పాట కేవలం వినడానికి మాత్రమే కాదు, చూడటానికి కూడా ఒక అందమైన ప్రేమగీతంగా నిలిచిపోయింది.

ఆత్రేయ సాహిత్యం --- సరళతలో కవిత్వం

ఆచార్య ఆత్రేయ గారి సాహిత్యంలో ప్రేమను గొప్ప గొప్ప పదాలతో కాకుండా, మన రోజువారీ జీవితానికి దగ్గరగా ఉండే భావాలతో చెప్పే ప్రత్యేకత కనిపిస్తుంది.

ఇల్లు, దీపం, పందిరి, కలల తీగలు, పువ్వులు, వెన్నెల, వెచ్చదనం వంటి సాధారణమైన ప్రతీకలను తీసుకుని వాటిలో లోతైన ప్రేమ భావాన్ని నింపారు. అందుకే పాట విన్నప్పుడు పదాలు మనకు సులభంగా అర్థమవుతాయి. అదే సమయంలో వాటి వెనుక ఉన్న కవిత్వం మనసును తాకుతుంది.

కె.వి. మహదేవన్ సంగీత మాధుర్యం

మంచి సాహిత్యానికి మంచి సంగీతం తోడైతేనే పాట చిరస్థాయిగా నిలుస్తుంది. ఈ పాటకు కె.వి. మహదేవన్ అందించిన స్వరకల్పన ఆత్రేయ సాహిత్యంలోని భావాలను మరింత మధురంగా వినిపించింది.

ఘంటసాల గారి గంభీరమైన గాత్రం, పి. సుశీల గారి మధురమైన స్వరం కలిసి ఈ పాటను అద్భుతమైన యుగళగీతంగా మార్చాయి. ఈ పాటను ఘంటసాల--సుశీల పాడినట్లు పలు సంగీత ఆధారాలు నమోదు చేస్తున్నాయి.

54 సంవత్సరాల తర్వాత కూడా అదే మాధుర్యం

1972 నుంచి 2026 వరకు 54 సంవత్సరాలు గడిచాయి. ఈ కాలంలో సంగీత ప్రపంచంలో ఎన్నో మార్పులు వచ్చాయి. రికార్డుల నుంచి క్యాసెట్లు, సీడీలు, టెలివిజన్, ఇంటర్నెట్, డిజిటల్ సంగీతం వరకు ప్రపంచం మారిపోయింది.

కానీ "నువ్వూ నేనూ ఏకమైనాము" వంటి పాటలకు మాత్రం వయసు లేదు.


ఒక మంచి పాటకు కాలం అడ్డంకి కాదని ఈ గీతం మరోసారి నిరూపిస్తోంది.

ప్రేమలోని స్వచ్ఛత, కుటుంబ జీవితంపై అందమైన కల, మనసుల అనుబంధం---ఇవన్నీ ఈ పాటను తరతరాలకు చేరువ చేశాయి.

ఐదు దశాబ్దాలు దాటినా మధురంగా వినిపిస్తున్న ఈ గీతం తెలుగు సినీ సంగీతంలోని ఒక అందమైన జ్ఞాపకం.

పాట మారలేదు... మాధుర్యం తగ్గలేదు...కాలం మారింది కానీ ప్రేమ భావం మాత్రం మారలేదు.

# బాక్సాఫీస్ వద్ద 'ఇరుముడి' జోరు.. సూర్య మూవీ రికార్డు వసూళ్లు






చాలా రోజుల తర్వాత టాలీవుడ్ వరుస సినిమాలతో కళకళలాడుతోంది. ఈ ఆగస్టులో విడుదలైన ముఖ్య చిత్రాలన్నీ బాక్సాఫీస్ వద్ద మంచి టాక్‌ను సొంతం చేసుకున్నాయి. ఎన్నాళ్ల నుంచో హిట్ కోసం ఎదురు చూస్తున్న రవితేజ , ఆయన అభిమానుల ఆకలి తీర్చింది 'ఇరుముడి' . శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీ తొలిరోజు నుంచే మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. కేవలం రెండు రోజుల్లోనే రూ.47 కోట్లు వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఆదివారం చాలా థియేటర్‌ల బయట హౌస్‌ఫుల్ బోర్డులు దర్శనమిచ్చాయి. ఈ ఏడాది సంక్రాంతి సినిమాల తర్వాత ఈ స్థాయిలో ప్రేక్షకాదరణ సొంతం చేసుకున్న మూవీ ఇదేనని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటించిన ఈ చిత్రం బేబీ నక్షత్ర కీలక పాత్ర పోషించింది. (ఇరుముడి రివ్యూ కోసం క్లిక్ చేయండి) విశ్వనాథ్ అండ్ సన్స్ రికార్డు వసూళ్లు సూర్య కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన ఫ్యామిలీ డ్రామా 'విశ్వనాథ్ అండ్ సన్స్'. మమితబైజు కథానాయిక. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ రికార్డు వసూళ్లు రాబడుతోంది. ఇప్పటివరకూ ఈ మూవీ రూ.200ం కోట్లు వసూలు చేసినట్లు చిత్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్ తెలిపింది. సూర్య, మమితల నటన, వెంకీ అట్లూరి టేకింగ్ ఫ్యామిలీ ఆడియెన్స్‌కు విపరీతంగా నచ్చింది.

# అల్లరి నరేశ్ 'రంభ ఊర్వశి మేనక' ట్రైలర్.. నవ్వులే నవ్వులు

అల్లరి నరేశ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా ఎంటర్‌టైనర్ 'రంభ ఊర్వశి మేనక' . చంద్రమోహన్ చింతాడ దర్శకుడు. అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ సంస్థలు కలిసి రూపొందిస్తున్నాయి. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ సెప్టెంబరు 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సోమవారం చిత్ర ట్రైలర్ విడుదలైంది. అల్లరి నరేశ్ శైలి హాస్యంతో పాటు, స్వర్గలోకం నేపథ్యం, సంభాషణలు వినోదాన్ని పంచుతున్నాయి. సురభి, రాశీ సింగ్, విష్ణు ప్రియ, ప్రిషా సింగ్, వెన్నెల కిశోర్, నరేశ్ వీకే, శ్రీనివాస్‌రెడ్డి, మురళీధర్ గౌడ్ తదితరులు కీలక పాత్రల్లో






# సెప్టెంబరులో సెట్స్ పైకి?

'ధురంధర్', 'యుఫోరియా' చిత్రాలతో ఉత్తరాది నుంచి దక్షిణాది సినీ ప్రియులకు యువ కథానాయికగా సుపరిచితమైంది బాలీవుడ్ తార సారా అర్జున్. కెరీర్ తొలినాళ్లలోనే ప్రాధాన్యత కలిగిన పాత్రలతో ప్రేక్షకుల్ని మెప్పించిన ఈమె.. ప్రముఖ నటి మధుబాల బయోపిక్‌లో నటించే అవకాశాన్ని దక్కించుకున్నట్లు ఇటీవల ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. ఇంకా పేరు ఖరారు చేయని ఈ బయోపిక్‌ని 'డార్లింగ్స్' ఫేమ్ జస్మీత్ కె.రీన్ తెరకెక్కిస్తున్నారు. దర్శకనిర్మాత సంజయ్‌లీలా భన్సాలీ నిర్మాణంలో రాబోతున్న ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది. తాజాగా ఈ సినిమా సెప్టెంబరు నుంచి చిత్రీకరణ ప్రారంభించుకోనున్నట్లు తెలిసింది. "రణ్‌బీర్ కపూర్, అలియా భట్, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'లవ్ అండ్ వార్' సినిమా చిత్రీకరణను ఈ నెలాఖరులోగా గోరేగావ్‌లోని రాయల్ పామ్స్‌లో పూర్తి చేయనున్నారు భన్సాలీ. ఈ చిత్ర షూటింగ్ ముగిసిన వెంటనే ప్రొడక్షన్ డిజైన్ బృందం మధుబాల బయోపిక్ కోసం ఆ ప్రదేశాన్ని సిద్ధం చేయనుంది. సెప్టెంబరులో ఈ సినిమా షూటింగ్ ప్రారంభయ్యే అవకాశముంది. ఇప్పటికే సారా మధుబాల పాత్ర కోసం సన్నద్ధమవ్వడం ప్రారంభించారు. ఈ చిత్రంతో జస్మీత్ మధుబాల వ్యక్తిత్వాన్ని, హావభావాలు, ఆమె జీవించిన ప్రపంచాన్ని తెరపై ఆవిష్కరించనున్నార"ని బాలీవుడ్ సన్నిహిత వర్గాల సమాచారం.

# ఆత్మకథగా రజనీకాంత్ జీవిత ప్రయాణం.. అధికారికంగా ప్రకటించిన కుమార్తె


అగ్ర కథానాయకుడు రజనీకాంత్ తన జీవిత ప్రయాణాన్ని ఆత్మకథ రూపంలో అభిమానులతో పంచుకోనున్నారు. తాజాగా ఈ విషయాన్ని ఆయన కుమార్తె, దర్శకురాలు సౌందర్య వెల్లడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె.. తాను కూడా ఆ పుస్తకం రాసే పనిలో పాల్గొన్నట్లు తెలిపారు. "నాన్నగారు తన ఆత్మకథ రాస్తున్నారు. ఆ పుస్తకాన్ని ఎలా రూపుదిద్దుతున్నారో నేను దగ్గర ఉండి చూశా. ఇది చాలా ఏళ్ల పాటు పాఠకులు మళ్లీ మళ్లీ చదివే పుస్తకంగా నిలుస్తుందని నమ్ముతున్నా. యోగి పరమహంస యోగానంద గారు రాసిన 'ఒక యోగి ఆత్మకథ' పుస్తకం తరతరాలకు ఎంత స్ఫూర్తినిస్తుందో మా నాన్నగారి కథ కూడా అలాగే ఉంటుంది. భారతీయ చిత్ర పరిశ్రమలో అతిపెద్ద నటులలో ఒకరిగా ఎదిగిన ఆయన ప్రయాణం సామాన్యమైంది కాదు. ఐదు దశాబ్దాలుగా ఆయన వ్యక్తిగత అనుభవాలు, వృత్తిపరమైన విజయాలు, అగ్రస్థానానికి చేరుకునేందుకు ఎదుర్కొన్న సవాళ్లు తదితర వివరాలన్నీ ఇందులో ఉండనున్నాయి" అని ఆమె పేర్కొన్నారు. ఆగస్టు చివరి వారం థియేటర్/ఓటీటీ సినిమాలివే.. దృష్టంతా దానిపైనే..!తన



తండ్రి జీవితాన్ని తెరపైకి తీసుకువస్తే ఎలా ఉంటుందన్న ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. "ఒకవేళ నాన్నగారి జీవితాన్ని సినిమాగా తీస్తే, అది నాకు వ్యక్తిగతంగా, వృత్తిపరంగా అత్యంత ప్రత్యేకమైందిగా ఉంటుంది. ఒక చిత్ర దర్శకుడు తనలోని ప్రతి ఆలోచనను ఒకే కథలో పెట్టలేడు. ఏ కథకు ఏది అవసరమో తెలుసుకోవాలి. మిగిలిన ఆలోచనలను భవిష్యత్తు కథల కోసం దాచుకోవాలి. సృజనకు స్పష్టత, క్రమశిక్షణ అవసరమని నాన్నగారు నాకు నేర్పారు. రజనీకాంత్ కుమార్తెగా పుట్టడం గొప్ప వరం. ఆయన కూతురునైనందుకు పోలికలు, అంచనాలు కూడా ఉంటాయి. నేను ఇష్టంతోనే చిత్రరంగంలోకి వచ్చాను. దాని గురించి నాకు ఎలాంటి పశ్చాత్తాపం లేదు" అని చెప్పారు. రూపొందుతోంది. ఈ రొమాంటిక్ సిరీస్‌కు బాలాజీ మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. అర్జున్ దాస్, ఐశ్వర్య లక్ష్మి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. అక్టోబరులో నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదల కానుంది.

# బడి ఆందోళన

## పిల్లలు చెప్పే విషయాలను శ్రద్ధగా వినాలి



పిల్లలు ఎప్పుడో అప్పుడు బడికి వెళ్లనని మారాం చేయటం సహజమే. పరీక్షల సమయంలోనో, ప్రజెంటేషన్ వంటివి ఇవ్వాల్సి వచ్చినప్పుడో మొండికేయటం చూస్తూనే ఉంటాం. కానీ తరచూ భయానికి గురవుతున్నట్టయితే ఆలోచించాల్సిందే. ఇది కేవలం మారాం చేయటం, బద్ధకం కాకపోవచ్చు. అభద్రత, తీవ్ర ఆందోళనకు సంబంధించింది కావచ్చని అనుమానించాలి.

**కొన్ని లక్షణాలు**

పిల్లల వయసు, వారి ఆందోళనలను బట్టి బడికి వెళ్లకపోవటానికి సంబంధించిన లక్షణాలు కనిపిస్తుంటాయి. తరచూ చూసేవి ఇవీ..

బడికి వెళ్లటానికి ముందు ఏడ్వటం, మారాం చేయటం లేదా వాగ్వాదానికి దిగటం.

తరచూ బడి ఎగ్గొట్టటం. ఎక్కెడెక్కడో తిరిగి ఇంటికి చేరటం.

ఉదయం పూట ఇంట్లోనే ఉంటానని వేడుకోవటం.

ఇంటికి త్వరగా వస్తానని ఫోన్ చేయటం లేదా మెసేజ్ పెట్టటం.

జబ్బులేవీ లేకపోయినా తలనొప్పి, కడుపు నొప్పి వంటి సాకులు చెప్పటం.

**కారణాలేంటి?**

రకరకాల ఆందోళనలు బడికి వెళ్లక పోవటానికి దారితీస్తుంటాయి. అసలు బడిలో గడపటమే కష్టమనిపించేంత తీవ్రంగానూ ఇవి పరిణమిస్తుంటాయి. ముందుగా చూడాల్సింది ఏయే అంశాలు పిల్లలను ఆందోళనకు గురిచేస్తున్నాయో తెలుసుకోవటం. లేకపోతే సమస్యను పరిష్కరించటం సాధ్యం కాదు.

తోటి పిల్లలు ఏడిపించటం, గేలి చేయటం, స్నేహితులతో గొడవలు, వారితో ఇమడలేనని భయపడటం.

పాఠాలు ఒంట పట్టకపోవటం, మార్కులు సరిగా రాకపోవటం, పరీక్షలు అంటే భయపడటం.

ఇంట్లో తల్లిదండ్రుల మధ్య పొర పొచ్చాలు, గొడవలు, కొత్తగా వేరే చోటుకు మారటం, ఆర్థిక అభద్రత.

బడిలో హింస, ప్రమాదాలకు సంబంధించిన భయాలు.

ఆందోళన, కుంగుబాటు వంటి మానసిక సమస్యలు.

ఇలా అండగా..

పిల్లలంతా ప్రత్యేకమే. ఒకరితో మరొకరికి పోలికే లేదు. వీరిలో బడికి వెళ్లకపోవటానికి కారణాలూ భిన్నంగానే ఉంటాయి. కానీ కొన్ని పద్ధతులతో భయం, ఆందోళనలను దూరం చేయొచ్చు.

పిల్లలు తమ బాధను వెలిబుచ్చటానికి అవకాశం కల్పించటం అన్నింటికన్నా ముఖ్యం. వారి మాటలను శ్రద్ధగా ఆలకిస్తే అక్కడే మార్పు మొదలవుతుంది. బడిలో ఈరోజు ఎలా గడిచింది? ఎవరితో కలిసి భోజనం చేస్తున్నావు? ఎక్కడైనా కష్టంగా అనిపించిందా? వంటి ప్రశ్నలు వేస్తుంటే అసలు విషయం బయటపడుతుంది. చదువుకోవటానికి, పరీక్షలకు సిద్ధం కావటానికి పిల్లలు పడుతున్న శ్రమను మెచ్చుకోవటమూ మంచిదే.

పిల్లలు తమ భావోద్వేగాలను నియంత్రించుకోవటానికి, ఒత్తిడి నుంచి బయటపడటానికి కంటి నిండా నిద్ర పోయేలా చూడటం చాలా అవసరం. 6-12 ఏళ్ల పిల్లలకు రాత్రిపూట 9 నుంచి 12 గంటల నిద్ర అవసరం. 13 ఏళ్లు దాటిన పిల్లలకైతే 8 నుంచి 10 గంటల నిద్ర కావాలి. రోజూ ఒకే సమయానికి పడుకునేలా, లేచేలా అలవాటు చేయటం.. పడకగదిలో టీవీలు, ఫోన్ల వంటివి లేకుండా చూడటం.. పడుకోవటానికి కనీసం రెండు గంటల ముందే డిజిటల్ పరికరాలను చూడనివ్వకపోవటం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

బడిలో పిల్లలకు అండగా నిలిచేవారు ఉపాధ్యాయులే. పిల్లల ప్రవర్తనకు సంబంధించి ఇంట్లో గమనించిన విషయాలను తల్లిదండ్రులు వీరి దృష్టికి తీసుకురావాలి. బడిలో ఎలా ఉంటున్నారో తెలుసుకోవాలి. పిల్లలకు అనుకూలంగా ఉండేలా అనుసరించాల్సిన వ్యూహాల గురించి చర్చించాలి.

రెండు వారాలు, అంతకన్నా మించి పిల్లలు తీవ్ర భయాందోళనలకు గురవుతుంటే పిల్లల మానసిక నిపుణులను సంప్రదించటానికి వెనకాడొద్దు. దీని ఉద్దేశం పిల్లలను తిరిగి బడికి పంపించటం ఒక్కటే కాదు.. వారు చదువుకోవటానికి, ఇతరులతో కలిసి మెలగటానికి అడ్డుపడుతున్న వాటి నుంచి బయటపడేలా చేయటం కూడా. పిల్లలతో అనునయంగా మాట్లాడుతూ ప్రవర్తన మార్పించే చికిత్స బాగా ఉపయోగపడుతుంది. అవసరమైతే డాక్టర్లు మందులనూ సూచిస్తారు.

- బడిలో రోజు ఎలా గడిచిందో తెలుసుకోవాలి
- చదువు, పరీక్షలకు చేస్తున్న కృషిని మెచ్చుకోవాలి
- తగినంత నిద్ర ఉండేలా చూడాలి
- 6--12 ఏళ్ల పిల్లలకు 9--12 గంటల నిద్ర
- 13 ఏళ్లు పైబడిన వారికి 8--10 గంటల నిద్ర
- పడకగదిలో టీవీ, ఫోన్ వంటి పరికరాలు లేకుండా చూడాలి
- నిద్రకు కనీసం 2 గంటల ముందు డిజిటల్ పరికరాలు దూరం చేయాలి
- ఉపాధ్యాయులతో కలిసి పిల్లల సమస్యను గుర్తించి పరిష్కరించాలి

# ఆటిజమ్ కావొచ్చేమో..

## పిల్లలు కళ్లలోకి కళ్లు పెట్టి చూడకపోవడం



- పేరు పెట్టి పిలిచినా స్పందించకపోవడం
- తోటివారితో ఆడుకోవడానికి ఆసక్తి చూపకపోవడం
- మాటలు రావడంలో ఆలస్యం
- తమ అవసరాలను మాటలు లేదా హావభావాలతో చెప్పలేకపోవడం
- కావాల్సిన వస్తువు కోసం చేయి పట్టుకుని అక్కడికి తీసుకెళ్లడం
- 9--12 నెలల్లో బొమ్మలు, వస్తువులను ఇతరులతో పంచుకోవడంలో ఆసక్తి లేకపోవడం
- ఆనందం, భావోద్వేగాలను ఇతరులతో పంచుకోవడంలో ఇబ్బంది
- అబ్బిన కొన్ని నైపుణ్యాలు హఠాత్తుగా కోల్పోవడం

పిల్లలు కళ్లలో కళ్లుపెట్టి చూడటం లేదా? పేరు పెట్టి పిలిస్తే స్పందించటం లేదా? తోటివారితో ఆడుకోవటానికి ఇష్టపడటం లేదా? మాటలు రావటం ఆలస్యమవుతోందా? అయితే ఆలోచించాల్సిన విషయమే. ఇవి ఆటిజమ్ తొలి లక్షణాలు కావొచ్చు. పిల్లల ఎదుగుదలను ఆయా వయసులో అబ్బే నైపుణ్యాలను బట్టి విశ్లేషిస్తుంటారు. బోర్లా పడటం, పాకటం, కూర్చోవటం, నడవటం, మాట్లాడటం వంటివి క్రమంగా అలవడుతూ వస్తుంటాయి. కొందరికివి ఆలస్యమవుతుంటాయి. ఒకప్పుడు వీటిని పెద్దగా పట్టించుకునేవారు కాదు. కానీ ఆటిజమ్ పెరిగిపోతున్న నేపథ్యంలో ముందుగానే గుర్తించటం ఆవశ్యకమైంది.

తొలి సంకేతాలు ఇవీ..

శిశువులకు ఆరు నెలల వయసు వచ్చేసరికే ఇతరుల కళ్లలోకి కళ్లు పెట్టి చూడటం, నవ్వటం అలవడతాయి. కానీ ఆటిజమ్ పిల్లల్లో ఇవి కొరవడతాయి.

పేరు పెట్టి పిలిస్తే స్పందించకపోవటం మరో లక్షణం. 'అటు చూడు, అది తే' అని తల్లిదండ్రులు పిలిచి, చెబుతున్నా పట్టనట్టు ఉంటారు.

సాధారణంగా పిల్లలు 9-12 నెలలు వచ్చేసరికి తోటివారికి తాము ఆడుకునే బొమ్మల వంటివి ఇవ్వటానికి ఇష్టపడుతుంటారు. హావభావాలను ప్రదర్శిస్తుంటారు. ఏడాదిన్నర నిండేసరికి ఆనందాలను పంచుకోవటం, తమకు కావాల్సినవి అడగటం అబ్బుతాయి. అయితే ఆటిజమ్ పిల్లలు తమ అవసరాలను నోటితో చెప్పటానికి, హావభావాలను వెల్లిబుచ్చటానికి కష్టపడుతుంటారు. ఏదైనా కావాలంటే చేయి పట్టుకొని అక్కడి వరకూ తీసుకెళ్లి చూపిస్తుంటారు.

కొందరికి మాటలు రావటం ఆలస్యమవుతుంటాయి. కొందరిలో అబ్బిన నైపుణ్యాలు హఠాత్తుగా పోవచ్చు. నిజానికివి కచ్చితంగా ఆటిజమ్ సంకేతాలేనని చెప్పలేం. కానీ ఇలాంటివి గమనిస్తే ఒకసారి నిపుణులను సంప్రదించటం మంచిది. ఇప్పుడు ఏడాదిన్నర, రెండేళ్లలోనే ఆటిజమ్‌ను నిర్ధారించటం సాధ్యమవుతోంది. ఆదిలోనే గుర్తిస్తే త్వరగా జాగ్రత్తలు తీసుకోవటానికి వీలుంటుంది.

# శిశువులకు 'కె' రక్ష



రక్తస్రావం ఆగటానికి విటమిన్ కె తోడ్పడుతుంది. రక్తం గడ్డ కట్టేలా చేయటానికిది అత్యవసరం. అయితే శిశువుల్లో ఇది ఉండదు. ఘనాహారం తినటం ఆరంభించేంతవరకూ దీని ఉత్పత్తి మొదలుకాదు. అందుకే పుట్టిన తర్వాత శిశువులకు విటమిన్ కె ఇంజెక్షన్ ఇవ్వాలని నిపుణులు సూచిస్తుంటారు. దీని ద్వారా తొలి ఆరు నెలల్లో శిశువుల మెదడులో రక్తస్రావమయ్యే ముప్పును తగ్గించుకోవచ్చు. నిజానికి ఈ సమస్య అరుదే అయినా ప్రాణాంతకంగా పరిణమించే అవకాశం ఎక్కువ. స్వల్ప రక్తస్రావమూ తీవ్ర సమస్యగా మారొచ్చు. కానీ మనదగ్గర చాలామంది శిశువులకు విటమిన్ కె ఇంజెక్షన్ ఇవ్వటానికి సుముఖంగా ఉండటం లేదు. ఇది సురక్షితమైందని, సమర్థమైందని డాక్టర్లు చాలాకాలంగా చెబుతున్నా అపోహలు, అప నమ్మకాలతో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇది పిల్లలకు పెద్ద ప్రమాదాన్నే తెచ్చిపెడుతోంది. శిశువులకు విటమిన్ కె ఇంజెక్షన్ ఇవ్వటం అవసరమని ఆసుపత్రిలో డాక్టర్లు చెప్పినప్పుడు కాదనటం సరికాదు. ఏవైనా భయాలు, సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలి.




పర్యావరణ మార్పుతో వాతావరణ ఉష్ణోగ్రత అంతకంతకూ పెరుగుతోంది. ఇది పిల్లల ఆరోగ్యం మీద చూపే ప్రభావం ఆందోళన కలగజేస్తోంది. తల్లి కడుపులో ఉన్నప్పుడు, పుట్టిన తర్వాత తొలినాళ్లలో అధిక ఉష్ణోగ్రతలకు గురైతే పిల్లల మెదడులో థలమస్ ఎదుగుదల నెమ్మదిస్తున్నట్టు స్పెయిన్‌లోని బార్సిలోనా ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ పరిశోధకులు గుర్తించారు. జ్ఞానేంద్రియాలు, కాళ్లు, చేతుల వంటి వాటి నుంచి వచ్చే సమాచారాన్ని విడమరచుకొని, దాన్ని కార్టెక్స్‌కు చేరవేయటంలో థలమస్ కీలకంగా పనిచేస్తుంది. ఇది గర్భం ధరించిన తొలినాళ్లలోనే వృద్ధి చెందుతుంది. పుట్టిన తర్వాత శైశవ దశలో పరిపక్వమవుతూ వస్తుంటుంది. దీనిపై అధిక ఉష్ణోగ్రతల ప్రభావాన్ని గుర్తించటానికి పరిశోధకులు 3,251 మంది పిల్లలను ఎంచుకున్నారు.

తల్లి కడుపులో ఉన్నప్పటి నుంచి మొదలుకొని, 8.5 ఏళ్ల వయసు వచ్చేవరకూ వాతావరణ ఉష్ణోగ్రతల తీరును, స్కాన్ పరీక్షలతో పిల్లల మెదడు ఎదుగుదలను నిశితంగా పరిశీలించారు. ముఖ్యంగా అధిక ఉష్ణోగ్రతల ప్రభావం థలమస్ మీద విపరీతంగా పడుతున్నట్టు గమనించారు. పిండం ఎదుగుతున్న దశలో దీనికి ఎక్కువ రక్తం అవసరమవుతుంది. అయితే వేడితో ముడిపడిన మార్పులు మాయ, పిండానికి జరిగే రక్త ప్రసరణ మీద ప్రభావం చూపుతుండటం వల్ల థలమస్ వృద్ధికి మరింత ఆటంకం కలుగుతుండొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. ఇది సరిగా వృద్ధి చెందకపోవటం వల్ల కౌమారంలో ఉద్రిక్తత స్వభావం, నియమాలను పాటించకపోవటం వంటి ప్రవర్తన సమస్యలకు దారితీస్తున్నట్టూ గుర్తించారు.

- బిడ్డ మెదడుకు ఉష్ణోగ్రతల సెగ
- అధిక వేడి పిల్లల మెదడుపై ప్రభావం
- థలమస్ ఎదుగుదల నెమ్మదించే అవకాశం
- గర్భస్థ దశలో ప్రభావం ఎక్కువ
- 3,251 మంది పిల్లలపై అధ్యయనం
- 8.5 ఏళ్ల వరకు పరిశీలన
- థలమస్ మెదడులో కీలక భాగం
- వేడితో రక్తప్రసరణలో మార్పులు
- భవిష్యత్తులో ప్రవర్తనా సమస్యలకు అవకాశం



## డా” దేవుల పల్లి రామానుజ రావు 109 జయంతిని తెలంగాణ సారస్వత పరిషత్తు లో ఘనంగా జరిపారు




శ్రీ రింగు రామమూర్తి స్వాగతోపన్యాసం చేస్తూడా దేవుల పల్లి రామానుజ రావు పరిషత్తు పూర్వ అధ్యక్షులు దశాబ్దాలుగా తెలుగు భాష సేవలను గుర్తు చేస్తూ గోల్కొండ లాంటి పలు గొప్ప పత్రికలకు సంపాదకత్వం వహించారు. నాటి ఆంధ్ర సారస్వత పరిషత్తు నేటి తెలంగాణ సారస్వత పరిషత్తు చేసిన సేవలకు కొనియాడారు తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షులు సభాధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ప్రసంగిస్తూ ప్రాచీన కాలంలో తెలంగాణ వైతాళికుడు డా దేవులపల్లి రామానుజారావు అన్నారు వారు రచించిన గ్రంథాలు ప్రవహించే సప్త నదుల సంగ్రాహం లాంటిదన్నారు పరిషత్తు కోశాధికారి శ్రీ మంత్రి రామారావు ప్రసంగిస్తూ రామానుజ రావు అంటేనే పరిషత్తు అంటేనే రామానుజరావు వారి రేడియో ప్రసంగాలు గురించి కొనియాడుతూ అనేకమందినీ అనేక రంగాలలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పించిన గొప్ప మానవతావాది రామానుజారావు అన్నారు ప్రముఖ రచయిత బహుభాషావేత్త డా “ నలిమెల భాస్కర్ సాహితీ పురస్కార గ్రహీత ప్రసంగిస్తూ రామానుజ రావు అంటే తెలుగు సాహిత్య క్షేత్రము మరియు ఆంగ్ల భాషలో అనార్గళంగా ప్రసంగించిన ప్రసంగకుడు . విశ్వ మానవుల భావాలను అనువాదం చేసిన గొప్ప అనువాదకుడు డా దేవులపల్లి రామానుజారావు అన్నారు

## కానిస్టేబుల్ కొలువుకు మీరు సిద్ధమేనా!




తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్పీఆర్బీ) ఇటీవల 7437 కానిస్టేబుల్, సబ్ ఇన్స్పెక్టర్ పోస్టుల భర్తీకి ప్రకటన వెలువరించింది. ఇందులో 7139 ఖాళీలు కానిస్టేబుల్ విభాగంలోనే ఉన్నాయి. వీటికి ఇంటర్మీడియట్ విద్యార్హతతో పోటీ పడవచ్చు. పరీక్ష, ఫిజికల్ టెస్టులతో నియామకాలుంటాయి.

రాష్ట్ర స్థాయిలో క్రేజ్ ఉన్న ఉద్యోగాల్లో ఖాకీ కొలువులు ముందుంటాయి. కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైనవారికి రూ.24,280 మూలవేతనం అందుతుంది. అన్నీ కలిపి మొదటి నెల నుంచే వీరు సుమారు రూ.40 వేల వేతనం పొందవచ్చు. వీటికి దరఖాస్తు చేసుకున్నవారికి ముందుగా ప్రిలిమినరీ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో అర్హులకు ఫిజికల్ మెజర్మెంట్ టెస్టు (పీఎంటీ), ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టు (పీఈటీ) ఉంటాయి. ఇక్కడా విజయవంతమైతే ఫైనల్ పరీక్ష నిర్వహిస్తారు. తుది నియామకాలు ఇందులోని ప్రతిభతో చేపడతారు.

### ప్రిలిమినరీ

మూడు గంటల వ్యవధితో పేపర్పై దీన్ని నిర్వహిస్తారు. ఇందులో 200 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు చొప్పున ప్రశ్నాపత్రం 200 మార్కులకు ఉంటుంది. సమాధానాలు ఓఎంఆర్ పత్రంపై బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్తో గుర్తించాలి. తప్పు జవాబుకు మార్కుల్లో ఐదో వంతు తగ్గిస్తారు. ప్రశ్నాపత్రం తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మాధ్యమాల్లో ఉంటుంది. పరీక్షలో అర్హత కోసం జనరల్, ఈడబ్ల్యూఎస్లు 30 శాతం, బీసీలు 25 శాతం, ఎస్సీ, ఎస్టీ, ఎక్స్-సర్వీస్మెన్, హోంగార్డులైతే 20 శాతం మార్కులు సాధించాలి.

### పీఎంటీ/ పీఈటీ

ప్రిలిమినరీలో అర్హులకు దీన్ని నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పురుషులు 1600 మీటర్ల దూరాన్ని 7 నిమిషాల 15 సెకన్లలో చేరుకోవాలి. అదే మహిళలైతే 800 మీటర్ల దూరాన్ని 5 నిమిషాల 20 సెకన్లలో చేరుకోవాలి. కొన్ని పోస్టులకు నిర్ణీత గడువులోగా దూరాన్ని పూర్తిచేస్తే సరిపోతుంది. మిగిలినవాటికి చేరుకున్న సమయం ప్రకారం మార్కులు కేటాయిస్తారు. దరఖాస్తు చేసుకున్న పోస్టు ప్రకారం పురుషులు 167.6 సెం.మీ., మహిళలు 152.5 సెం.మీ. ఎత్తు ఉండాలి. ఏజెన్సీ ప్రాంతాల వారికి సడలింపులు వర్తిస్తాయి. నిర్దేశిత ఎత్తు ఉన్నవారికి లాంగ్ జంప్, షార్ట్ పుట్ నిర్వహిస్తారు. పురుషులు 4 మీటర్లు, మహిళలైతే 2.50 మీటర్ల దూరానికి లాంగ్జంప్ చేయగలగాలి. షార్ట్పుట్లో భాగంగా పురుషులైతే 7.26 కేజీల దిమ్మెను 6 మీటర్ల దూరానికి, మహిళలు 4 కేజీల దిమ్మెను 4 మీటర్ల దూరానికి విసరాలి. వీటన్నిటిలోనూ విజయవంతమైనవారికి ఫైనల్ రాత పరీక్ష నిర్వహిస్తారు.

### ఫైనల్

ఇది కూడా 3 గంటల వ్యవధితో ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న పోస్టు ప్రకారం 100 లేదా 200 మార్కులకు దీన్ని నిర్వహిస్తారు. ఇందులో అర్హతకు ఓసీ, ఈడబ్ల్యూఎస్లు 40 శాతం, బీసీలు 35 శాతం, ఎస్సీ, ఎస్టీలైతే 30 శాతం మార్కులు పొందాలి. ఈ పరీక్ష కూడా ఆబ్జెక్టివ్ తరహాలోనే ఉంటుంది. సమాధానాలు ఓఎంఆర్ పత్రంపై బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్తో గుర్తించాలి. ప్రశ్నాపత్రం తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మాధ్యమాల్లో ఉంటుంది.

తుది నియామకాలు ఫైనల్ పరీక్ష మార్కుల మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం ఉంటాయి. కొన్ని పోస్టులకు మాత్రం వీటితో పాటు పరుగులో సాధించిన మార్కులు కలిపి ఆ మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం ఎంపిక చేస్తారు.

### ముఖ్య వివరాలు

విభాగాల వారీ ఖాళీలు: 1. తెలంగాణ పోలీస్ డిపార్ట్మెంట్: కానిస్టేబుల్: సివిల్ - 3697, ఏఆర్ - 1052, ఎస్ఏఆర్ సీపీఎల్ (మెన్) - 24. 2. తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డిపార్ట్మెంట్: కానిస్టేబుల్ - 1,380. 3. ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ, అండ్ సివిల్ డిఫెన్స్ విభాగం: ఫైర్ ఫైటర్ - 751. 4. జైళ్లు, కరెక్షనల్ సర్వీస్ విభాగం: వార్డర్ (పురుషులు) - 196, (మహిళలు): 12

విద్యార్హత: ఇంటర్మీడియట్ లేదా సమాన స్థాయి ఉత్తీర్ణత. ఫైర్ ఫైటర్ పోస్టులకు లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి.

వయసు: జులై 1, 2026 నాటికి కనీసం 18 ఏళ్లు నిండాలి. గరిష్ఠ వయసులో పలు మినహాయింపులు వర్తిస్తాయి.

దరఖాస్తు రుసుము: కానిస్టేబుల్ పోస్టులకు ఎస్సీ, ఎస్టీలకు రూ.600. మిగిలిన అందరికీ రూ.1200.

ఆన్లైన్ దరఖాస్తులు: సెప్టెంబరు 09 సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తారు.

వెబ్సైట్: www.tgprb.in

పోలీస్ కానిస్టేబుల్ (మెకానిక్స్) (పురుషులు) - 07

పోలీస్ కానిస్టేబుల్ (డ్రైవర్) (పురుషులు) - 20

మెకానిక్స్ పోస్టులకు పదో తరగతి తర్వాత నిర్దేశిత ట్రేడుల్లో ఐటీఐ పూర్తిచేయాలి. డ్రైవర్ పోస్టులకు ఇంటర్మీడియట్ లేదా నిర్దేశిత ట్రేడుల్లో ఐటీఐతో పాటు హెవీ పాసింజర్ మోటార్ వెహికల్ (హెచ్పీఎంవీ) డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. ఈ రెండు పోస్టులకూ ప్రిలిమినరీ పరీక్ష ఉండదు. పీఈటీ, పీఎస్టీల్లో వీరు అర్హత సాధించాలి. ఎత్తు 162 సెం.మీ. ఉంటే సరిపోతుంది. మెకానిక్ పోస్టులకు ట్రేడు టెస్టు నిర్వహిస్తారు. డ్రైవర్ పోస్టులకు పలు విభాగాల్లో డ్రైవింగ్ నైపుణ్యాన్ని పరీక్షిస్తారు. అనంతరం ఈ రెండు పోస్టులకూ 3 గంటల వ్యవధితో 200 మార్కులకు ట్రేడ్/ డ్రైవింగ్ విభాగాల్లో ఫైనల్ రాత పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో అర్హత మార్కులు పొందినవారిని మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం ఉద్యోగ శిక్షణకు అవకాశమిస్తారు.

### ప్రశ్నాంశాలు

కానిస్టేబుల్ పోస్టులకు ప్రిలిమ్స్, ఫైనల్ రెండిటికీ ఒకటే సిలబస్.

ఇంగ్లిష్, అరిథ్మెటిక్, జనరల్ సైన్స్, భారతదేశ చరిత్ర, సంస్కృతి, జాతీయోద్యమం, జాగ్రఫీ, పాలిటీ, ఎకానమీ, ముఖ్యమైన జాతీయ, అంతర్జాతీయ వర్తమానాంశాలు, రీజనింగ్/మెంటల్ ఎబిలిటీ, తెలంగాణ రాష్ట్ర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

మెయిన్స్లో అదనంగా పర్సనాలిటీ టెస్టు విభాగాన్ని చేర్చారు. ఇందులో ఎథిక్స్, జెండర్, వీకర్ సెక్షన్స్, సోషల్ అవేర్నెస్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ అంశాల్లో ప్రశ్నలు వస్తాయి.

### సన్నద్ధత

ప్రిలిమ్స్, మెయిన్స్ సిలబస్ ఒకటే కాబట్టి అభ్యర్థులకు ఎంతో మేలు. ప్రిలిమ్స్ జరిగే వరకూ ఫైనల్లోని పర్సనాలిటీ టెస్టు విభాగాన్ని మినహాయించి మిగిలిన అంశాలన్నీ చదువుకోవాలి. అలాగే సిలబస్ అదే అయినప్పటికీ ప్రిలిమ్స్లో ప్రశ్నలు కొంచెం తేలికగానూ, ఫైనల్లో ప్రశ్నలు కాస్త కఠినంగానూ ఉంటాయి. అందువల్ల ముందుగా ప్రిలిమ్స్లో అర్హత కోసం ప్రాథమికాంశాలపై బాగా దృష్టి సారించాలి. ఆ స్థాయిలోనే వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి.

అరిథ్మెటిక్, రీజనింగ్ కోసం పాఠశాల స్థాయి గణిత పుస్తకాల్లోని అంశాలను బాగా చదివి ఎక్కువ మాదిరి ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి. అలాగే పోటీ పరీక్షలకు సంబంధించి అరిథ్మెటిక్, రీజనింగుల్లో ఏదైనా పుస్తకాన్ని తీసుకుని సంబంధిత అంశాలను సాధన చేస్తే ఎక్కువ మార్కులు పొందవచ్చు.

జనరల్ సైన్స్లో శాస్త్ర సాంకేతిక అంశాలకు సంబంధించి తాజా అభివృద్ధిపై ప్రశ్నలు వస్తాయి. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి సమస్యలు, అంశాలపైనా ప్రశ్నలు ఉంటాయి. తాజా అంశాలను అనుసరిస్తే ఈ విభాగంలో అన్ని ప్రశ్నలకూ సమాధానం గుర్తించవచ్చు. ఆరు నుంచి ఇంటర్మీడియట్ వరకు సైన్స్ పుస్తకాల్లో ముఖ్యాంశాలు, సమకాలీన శాస్త్రవేత్తల అధ్యయనాలు, అవార్డులు చదవాలి.

వర్తమానాంశాల కోసం జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గత ఏడాది నుంచి జరుగుతోన్న ముఖ్య పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి. దేశంలోనూ, విదేశాల్లో జరిగిన ఎన్నికలు, ముఖ్య నియామకాలు, దేశాల మధ్య యుద్ధాలు, అవార్డులు, క్రీడలు, సదస్సులు సమావేశాలు, పుస్తకాలు రచయితలు, కరెన్సీ, రాజధానులు.. ఇవన్నీ తెలుసుకోవాలి. తాజా సమాచారం కోసం దినపత్రికలు అనుసరించి, ముఖ్యమైనవి నోట్సు రాసుకోవాలి.

భారతదేశ చరిత్ర, భారత జాతీయోద్యమం కోసం దేశ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ అంశాలకు సంబంధించి ముఖ్య పరిణామాలన్నీ అధ్యయనం చేయాలి. ఆరు నుంచి ఇంటర్మీడియట్ వరకు సోషల్ పాఠ్యపుస్తకాల్లోని.. ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక భారతదేశ చరిత్రపై రాజులు, పరిపాలన, కాలాలు లాంటి అంశాలతో పాటు భాష, సంస్కృతి, శిల్ప కట్టడాలపై దృష్టిపెడితే ఎక్కువ మార్కులు పొందవచ్చు.

జాగ్రఫీ కోసం హైస్కూల్ సోషల్ పుస్తకాల్లోని జాగ్రఫీ విభాగంతో పాటు ఇంటర్మీడియట్ జాగ్రఫీ పుస్తకాలు బాగా చదవాలి. ప్రపంచ భౌతిక భూగోళం-శీతోష్ణస్థితి, భూస్వరూపాలు, సముద్రశాస్త్రం, జీవావరణంపై దృష్టి సారించాలి.


పాలిటీ, ఎకానమీల్లో దేశ రాజకీయ వ్యవస్థ, ప్రాంతీయ అభివృద్ధి, ప్రణాళికలు, ఆర్థిక సంస్కరణలు మొదలైన అంశాల నుంచి ప్రశ్నలు రావచ్చు. హైస్కూల్ సోషల్ పుస్తకాల్లోని సంబంధిత అంశాలతో పాటు ఇంటర్మీడియట్ పాలిటీ, ఎకనామిక్స్ పాఠ్యపుస్తకాలు బాగా చదవాలి. తాజా సామాజిక ఆర్థిక సర్వే, ఆర్థిక రంగంలో నేటి పరిణామాలు అనుసరిస్తే ఎక్కువ మార్కులు పొందవచ్చు.

తెలంగాణకు సంబంధించి హైస్కూల్ పాఠ్య పుస్తకాల్లోని అంశాలతో పాటు తెలంగాణ తెలుగు అకాడమీ పుస్తకం ఉపయోగపడుతుంది.

సన్నద్ధత పూర్తయిన తర్వాత పాతప్రశ్నాపత్రాలు బాగా అధ్యయనం చేయాలి. వీటి ప్రకారం అధ్యయనాన్ని మెరుగుపరచుకోవాలి. అనంతరం వీలైనన్ని మాక్ పరీక్షలు రాయాలి. పరీక్షల వారీ ఈ ఫలితాలు సమీక్షించుకోవాలి.

# ఇప్పటికీ అంతే కొత్త పాళీ!

**తాపీ ధర్మారావు తన జీవితంలో ఒక మూడేళ్ళపాటు ఒక్క ముక్క రాయలేదు. ఆ కాలం గురించి ఆయన ఇలా రాసారు: “...పూర్వపు రీతినే వ్రాసివేద్దామంటే, నా హృదయంలో కలిగిన మార్పు దానికి ఒప్పుకునేది కాదు. అందుచేత మౌనం కలిగింది నా కలానికి. దీనివల్ల స్నేహితులయిన పత్రికా సంపాదకులకి నాపై కోపం కూడా కలిగింది ఏమి చేయను? నాపై నాకే కోపం కలిగినపుడు ఇతరులకి కలగదా!...”**




1933 నుంచి 1936 మధ్య ఆ మూడేళ్ళ కాలంలోనూ చేసినదేమిటో కూడా ఆయన రాసుకున్నారు: “మూడు సంవత్సరాలు--వెయ్యిరోజులు--దాటిపోయాయి. ఒక్క ముక్క అయినా వ్రాయలేదు... ప్రచురించడం అంతకన్నా లేదు. నిజమే, కాని, చదివినది మాత్రం చాలా ఉంది. దగ్గరదగ్గర 40, 50 వేల పేజీల సారస్వతం చదవగలిగాను. సారస్వతం అంటే ఎలాంటి సారస్వతం? ...దేశదేశాలలోనూ, ఖండఖండాలలోనూ ప్రఖ్యాతి పొందిన గ్రంథాలు. వందలకొద్ది ఇతర భాషలలోకి తర్జుమా అయిన గ్రంథాలు, అన్ని జాతులవాళ్ళ పొగడ్తల్నీ, లక్షలకొద్దీ బహుమానాన్నీ పొందిన గ్రంథాలు. ప్రపంచంలోని జనులనీ, వాళ్ళ అభిప్రాయాలనీ ఒక్కసారి మార్చివేసిన గ్రంథాలు. రషియా, జర్మనీ, నార్వే, స్వీడను, ఫ్రాన్సు, ఇంగ్లండు, అమెరికా... ఈ దేశాలలో మిక్కిలి ఉత్తమమైన గ్రంథాలు. ఈ గ్రంథాలు కరువుదీర చదివాను. నా స్వభావాన్నిబట్టి చదివిన వాటిని గురించి విమర్శించుకున్నాను. ఆలోచించుకున్నాను. తరువాత ఆయా దేశాల్లో ఆ గ్రంథాలను గురించి విమర్శనలు చూశాను. నోబెల్ మొదలైన గొప్ప గొప్ప బహుమానాలు ఈ గ్రంథాలకెందుకిచ్చారో తెలుసుకున్నాను. దీని అంతటివల్ల నా అభిప్రాయాలు చాలా ఎక్కువగా మారిపోయాయి. మారక తప్పదు ఆ గ్రంథాలని చూచిన తర్వాత.”

ఈ మాటలన్నీ తాపీ ధర్మారావు పుస్తకం ‘కొత్తపాళీ’లోని తొలి పేరాలు. రాయకుండా గడిపిన మూడేళ్ళ తర్వాత గూడవల్లి రామబ్రహ్మం నడిపిన ‘ప్రజామిత్ర’ పత్రికలో 1936 సంక్రాంతి సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురింపబడిన ధర్మారావు వ్యాసాలే ‘కొత్తపాళి’ సంపుటి. అప్పటికి ధర్మారావు వయసు నలభైకు మించలేదు. ఆయన్ను వ్యావహారిక భాషా వైతాళికుడిగా మనం కొనియాడుతాం. ఘనమైన పత్రికా సంపాదకుడిగా గౌరవిస్తాం, తెలుగు సినిమాలకు చక్కని భాషను, స్క్రీన్ ప్లే విధానాన్ని ఇచ్చిన దార్శనికుడిగా కీర్తిస్తాం. అయితే తెలుగు సాహిత్య విమర్శకుడిగానూ ఆయన పేరు గట్టిగా చెప్పాల్సిన అవసరం ఉంది.

ఇటీవల మళ్ళీ వారి రచనలు ‘ఇనుప కచ్చడాలు’, ‘దేవాల యాలపై బూతు బొమ్మలు’, ‘సాహిత్య మొర్మరాలు’, ‘పాత పాళీ’, ‘కొత్తపాళీ’ పుస్తకాలను జాగ్రత్తగా చదివాను. సాహిత్య విమర్శను కూడా బొరుగులు తిన్నంత సులువుగా అందివ్వగలిగిన ప్రతిభాశాలి తాపీ. ‘కొత్తపాళీ’ గురించి చాలామంది రాశారు, శ్లాఘించారు, తాపీవారికి పర్యాయపదంగా వాడారు. అయినా ఇప్పటికీ తెలుగు పాఠకులు ‘కొత్తపాళీ’ని కొత్తగా, సమగ్రంగా, సవ్యంగా చూడాల్సి ఉందనే అనిపిస్తోంది.

నిజానికి తాపీధర్మారావు ‘కొత్తపాళీ’ ద్వారా సాహిత్యరచనకు ఒక సిలబస్ రూపొందించారు. ఏది సాహిత్యం? ఎవరి కోసం ఆ సాహిత్యం? దాని ఉద్దేశ్యం ఏమిటి? ఎలా రాయాలి? అలానే ఎందుకు రాయాలి? -- అనే విషయాలపట్ల సమగ్రమైన అవగాహన కలిగిస్తారు. అలాగే కవి లేదా రచయిత నిల్చున్న కాలానికీ, సమయానికీ -- గతాన్నీ, గత సాహిత్యాన్ని ఎలా చూడాలి? ఏమి స్వీకరించాలి? అలాగే భవిష్యత్తులో బాధ్యత ఏమిటి? అని కూడా చాలా సులువుగా బోధపడేట్టు విశ్లేషిస్తారు.

సాహిత్య విమర్శకుడిగా ధర్మారావులో పాండిత్యం, విశ్లేషణ, ఓపిక విశేషంగా ఉన్నాయి. అంతకుమించి వారి విమర్శలో మనం చూడాల్సినవి మరిన్ని ఉన్నాయి:

అ) సాహిత్య విమర్శను రీడబుల్గా రాయడమూ, ఆ) హాస్యాన్ని, వ్యంగ్యాన్ని, వెటకారాన్ని పుష్కలంగా వాడటమూ, ఇ) ఎటువంటి ద్వేషం లేకుండా సహనం, సమన్వయంతో కూడిన దృష్టితో సాహిత్య పరిశీలన చేయడమూ, ఈ) హేతుబద్ధంగా ఏది ప్రయోజనకరమో, కాదో అని విశ్లేషించి చూపడమూ, ఉ) తెలుగునూ, తెలుగు సాహిత్యాన్ని నెత్తిన పెట్టుకు అవి మరింత ఉజ్జ్వలంగా ఉండాలనడమూ -- వెరసి నవనవోన్మేషంగా తెలుగు సాహిత్య విమర్శకు కొత్తచూపు ఇవ్వడమూ.

ఈ వ్యాసాలను 1955లో పుస్తకంగా వెలువరిస్తూ ఇలా అన్నారు: “...నాకు సంస్కృతం మీద ద్వేషమని కొందరయ్యలంటూంటారు. కాదు: నాకు కావాలి సంస్కృతం, కొద్దో గొప్పో ఇప్పటికీ చదువుకుంటుంటాను. అది గొప్ప రత్నాల గని. నిజమే. ఇష్టమున్నవాళ్ళు సంస్కృతం చదవవలసిందే, దానిలో ఉన్న విజ్ఞానం తెలుసుకోవలసిందే, ఆ విజ్ఞానాన్ని తెలుగులోనికి తీసుకురావలసిందే. అది కూడదనను. అనవసరంగా ఆ భాషను దిగుమతి చేయకండంటాను. తెలుగుతనం నిలుపమంటాను. అంతే...”అలాగే కొత్తపాళీ చివరి వ్యాసం చివరలో ఇలా అంటారు: “...సాహిత్యాన్ని పట్టి ఆ జాతి వారి విజ్ఞానము, జీవన విధానము, ఆచారాలు, సంస్కృతి తెలుసుకోవడానికి వీలుండాలి. సాహిత్యంలో జాతి కనబడాలి. జాతికి సాహిత్యం అద్దంలాగుండాలి.”“తెలుగు కవి, తెలుగు రచయిత, తెలుగు ప్రజల జీవితంలో ఉండి వ్రాయాలి... తెలుగు సంస్కృతీ, తెలుగు గడ్డా, యుగయుగాల నుంచి వచ్చిన తెలుగు విజ్ఞానమూ తనకిచ్చిన శక్తీ, అతను తెలుగు ప్రజకి రుణపడి ఉన్నాడు. ఆ రుణం తీర్చాలి; తన ఇష్టం వచ్చినట్టు వినియోగించుకోకూడదు. మళ్ళీ తెలుగువాళ్ళకు తాను కొంత చెల్లించాలి,” అని కూడా చెప్పారు తాతాజీ.ఈ క్లారిటీ చూడండి: “...అందులో సంస్కృతమే ఉండనీయండి, తెలుగే ఉండనియ్యండి, ఇంగ్లీషు, హిందూస్తానీ మరేదయినా ఉండనీయండి.

ఏమైనాసరే తెలియడం ప్రధానం...” అంటారు. 1936లో రాసిన మాటలు నేటికీ చాలామందికి ఎంతో అవసరమనిపిస్తుంటుంది -- కొన్ని సమయాలలో వినిపించే వాదనల రొద వింటూంటే!

వారి ‘కొత్తపాళీ’ వ్యాసాల నుంచి కొన్ని పదునైన వాక్యాలు, పరిశీలనలు:

1) తెనుగు చేస్తానని చెప్పి, మరింత సంస్కృతం గుప్పి తెలియకుండా చేయడం అక్రమం, తన పాండిత్యం ప్రదర్శించడానికే వ్రాసుకొనడమే అంటుంది మొల్ల-- నన్నయ గురించి.

2) జాను తెలుగు కోసమూ, ద్విపదల కోసమూ, తెలుగు ప్రజల గాథల కోసమూ చూచేవాళ్ళు కొంతమంది ఉండేవాళ్ళు -- నన్నెచోడుడు, పాలకురికి సోమనాథుడు మొదలైన వాళ్ళు. వీళ్ళ పేర్లే మొన్న మొన్నటిదాకా మనకు తెలియకుండా పోయాయి.

3) కవిసమయాలన్నారు, సాహిత్యసూత్రాలన్నారు, కావ్యమర్యాదలన్నారు, నాటకలక్షణాలన్నారు, వెయ్యిపేర్లు చెప్పారు. పదివేల నియమాలు దింపారు... ఇవన్నీ సంస్కృతం రేవులో నుంచే దిగుమతి.

4) పగలు కలువపువ్వులు వికసించి ఉండటం ఎంతమంది చూచారు కాదు? అవి కలువలు కావంటారా?

5) తెలుగులో తెలుగు సాహిత్యాన్ని చూపాలి. సంస్కృతం పరిచయం వల్ల మరింత అభివృద్ధి పొందడానికి బుద్ధిపుట్టాలి. గాని బానిస బుద్ధి పుట్టిపోకూడదు.

6) కృష్ణరాయ చక్రవర్తినీ, ఆతని ఆముక్తమాల్యదా చూడండి. ఆ ఊహాచాతురీ ఆ ప్రపంచ పర్యావలోకనమూ, ఆ కవిత్వదృష్టీ చూచినవాళ్ళకి అతడు గ్రుడ్డి వ్రాతగాడు కాక, ఒక నూరు కళు ్ళన్న వ్రాతగాడిలా కనిపిస్తాడే!

7) పేరుగాంచిన ప్రబంధాలని మనం కొంచెం జాగ్రత్తగా చూడాలి. వాటిని కేవలం పారవేయకూడదు. అలా పారవేసినట్టయితే ఆంధ్రసారస్వత జీవనంలో మూడు, నాలుగు వందల సంవత్సరాలు వ్యర్థమయిపోయినట్టే అవుతుంది. అంత నష్టానికి ఎవరు ఒప్పుకోగలరు?

8) గ్రంథాలలో స్త్రీ పురుష సాంగత్య విషయంలోని సంగతులన్నీ మడికట్టుకుని విడిచిపెడితే బాగుండదు.

9) వేడివేడినెత్తురుతో జీవయాత్ర సాగిస్తూ ఉన్న తెలుగు ప్రజలకి మనసాహిత్యంలో జాగా లేకపోయింది. జావా, సుమత్రా ద్వీపాలకి వెళ్ళి వలసలు ఏర్పాటు చేసే చేవగలిగిన తెలుగు తనానికి జాగా లేకపోయింది. పడవలు కడుతూ, సముద్రాలు దాటిన తెలుగు సాహసానికి జాగా లేకపోయింది. ఇంతెందుకు, బ్రతికి ఉన్న తెలుగుకు జాగా లేకపోయింది.

ఎనభైయ్యేళ్ళ క్రితం రాసిన ‘కొత్తపాళీ’ సాహిత్య విమర్శలో సహనం, సమన్వయం, హేతుబద్ధత, తార్కికత, తెలుగు మీద మనకుండాల్సిన గురి -- మరీ ముఖ్యంగా హాయిగా, అలవోకగా చదివేలా రాయగలగడం -- వంటి కోణాలలో నేటికీ మనకు అవసరం.

త్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక




## అలరించిన ఎస్.పి. కోదండపాణి'
# సినీ సంగీత విభావరి




**చిక్కడపల్లి ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 23:**
వెన్నెల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'బృందావనం' సుబ్రహ్మణ్యం సమర్పణలో "స్వర్ణయుగ సంగీత దర్శకులు ఎస్.పి. కోదండపాణి" శీర్షికతో సినీ సంగీత విభావరి చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభ వద్దగల కళా సుబ్బారావు కళావేదికలో నిర్వహించారు.
వెన్నెల కల్చరల్ అసోసియేషన్ 'బృందావనం' సుబ్రహ్మణ్యం సమర్పణ వై.ఎస్. రామకృష్ణ, డాక్టర్ శంకర్, భాస్కర్, రవి ప్రసాద్‌లతో పాటు ప్రసిద్ధ గాయనీ, గాయకులు జగద్ధాత్రి, జ్యోతిర్మయి, కృష్ణవేణి, ఇందుశ్రీ తదితరులు పాల్గొని ఎస్.పి. కోదండపాణి గారి స్వరపరచిన అమర గీతాలను ఆలపించారు.

## స్వర ఝరీ భువన భాస్కరం ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి




**చిక్కడపల్లి ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 24:**
సినీ ప్రముఖులు చిరంజీవి, నాగార్జున, మహేష్ బాబు, శ్రీదేవి జన్మదిన సందర్భాలను పురస్కరించుకుని స్వర ఝరీ భువన భాస్కరం సంగీత సాహిత్య సేవా సమితి ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రత్యేక సినీ సంగీత విభావరి చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభ, కళా సంగీత నాట్య కళావేదికలో నిర్వహించారు . కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంజనీ కుమారి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గాయనీ గాయకులు ఆలపించిన సినీ గీతాలు అలరించాయి.

## మిమిక్రీ రత్న 'స్వరముఖి' చంద్రముఖి చంద్రశేఖర్‌కు స్వర్ణ కంకణం బహుకరణ



**చిక్కడపల్లి ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 24:**
గోల్డెన్ స్టార్ ది యూత్ కల్చరల్ ఆర్గనైజేషన్, జంట నగరాల సాంస్కృతిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ మిమిక్రీ కళాకారులు 'స్వరముఖి' శ్రీ చంద్రముఖి చంద్రశేఖర్ మిమిక్రీ రంగంలో 35 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 'స్వర్ణ కంకణ బహుకరణ' మహోత్సవ సభ చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గాన సభ (మెయిన్ హాల్ లో నిర్వహించారు . సంస్థ అధ్యక్షుడు బింగి సురేందర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ మధుసూదనా చారి, ప్రముఖ సినీ నటులు బాబు మోహన్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రముఖి చంద్రశేఖర్ కు స్వర్ణ కంకణం బహుకరించారు.

**ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..**
చంద్రముఖి చంద్రశేఖర్ మిమిక్రీ రంగానికి చేసిన సేవలు అపారమైనవని కొనియాడారు. సభకు ముందు గాయనీ, గాయకులు ఆలపించిన సినీ గీతాలు అలరించాయి.

# అలరించిన 'వాగ్దేవి మెలోడీస్' తెలుగు - హిందీ సినీ సంగీత విభావరీ సీజన్-2

**చిక్కడపల్లి ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 24:**
వాగ్దేవి మెలోడీస్ సంస్థ ఆధ్వర్యంలో "సంగీత సాహిత్య సమలంకృతే..." సీజన్ - 2 తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి శ్రీ త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంతరావు వేదికలో నిర్వహించారు. సంస్థ అధ్యక్షురాలు , గాయని వి. శ్రీవాణినిర్వహణలో గాయనీ గాయకులు ఆలపించిన సినీ గీతాలు అలరించాయి.




# శంకర నారాయణ అరణ్య శతకం ఆవిష్కరణ



**హైదరాబాద్, చిక్కడపల్లి, ట్రై నెట్ న్యూస్, ఆగస్టు 24 :** గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి చే శతక నారాయణుడు గా పేర్కొన్న ప్రముఖ జర్నలిస్ట్ హాస్యావధాని శంకర నారాయణ రచించిన మరో శతకం అరణ్య శతకం ఆవిష్కరణ సమావేశం శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో గాన సభ నిర్వహణలో జరిగింది ముఖ్య అతిథిగా గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి పాల్గొని అరణ్య శతకం ఆవిష్కరణ చేసి మాట్లాడారు ఇప్పటి వరకూ ఏభై శతకాలు అధ్యాత్మిక భావనలు అంశాలు గా రాసిన శంకర నారాయణ అరణ్య శతకం పర్యావరణ ను ప్రకృతి నీ కాపాడేందుకు అరణ్యాల అవసరం తెలుపుతూ శతక పద్యాలు రాసారని వివ రించారు అడవి తల్లి నీ అమృత వల్లి గా భావించటం అర్ధవంతం గా ఉందని ఉదాహరించారు వేదిక పై శంకర నారాయణ తన సంపుటిని ప్రముఖ రచయిత్రి అటవీ శాఖ ఉన్నత అధికారి దేవనపల్లి వీణా పాణి కి లాంఛనం గా అంకిత మిచ్చారు వీణా పాణి మాట్లాడుతూ శంకర నారాయణ తనకు చెప్పిన విధం గా పది పదిహేను రోజులలో అడవులు ను అంశం గా గ్రహించి వంద పద్యాలు రాయడం ఆయనకు భాష పై ఉన్న సాధికారత కి నిదర్శనం అన్నారు సులభ శైలి లో వున్న అరణ్య శతకం ప్రతి ఒక్కరూ చదివి అడవులు ప్రాధాన్యత అర్థం చేసుకోవలనీ కోరారు శంకర నారాయణ మాట్లాడుతూ వంద శతకాలు రాయటం తన లక్ష్యం అని చెప్పారు కుక్కను పెంచే వాడు మనిషి మొక్క ను పెంచే వాడు మహర్షి అనే స్ఫూర్తి తో అరణ్య శతకం రాశానని తెలిపారు వేదిక పై బాల సాహితీ రచయిత చొక్కాపు రమణ సిని దర్శకుడు మల్లం రమేష్ పాల్గొన్నారు

## మిమిక్రీ రత్న 'స్వరముఖి' చంద్రముఖి చంద్రశేఖర్‌కు స్వర్ణ కంకణం బహుకరణ

**చిక్కడపల్లి ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 24:**
గోల్డెన్ స్టార్ ది యూత్ కల్చరల్ ఆర్గనైజేషన్, జంట నగరాల సాంస్కృతిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ మిమిక్రీ కళాకారులు 'స్వరముఖి' శ్రీ చంద్రముఖి చంద్రశేఖర్ మిమిక్రీ రంగంలో 35 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 'స్వర్ణ కంకణ బహుకరణ' మహోత్సవ సభ చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గాన సభ (మెయిన్ హాల్ లో నిర్వహించారు . సంస్థ అధ్యక్షుడు బింగి సురేందర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ మధుసూదనా చారి, ప్రముఖ సినీ నటులు బాబు మోహన్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని







ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రముఖి చంద్రశేఖర్ కు స్వర్ణ కంకణం బహుకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చంద్రముఖి చంద్రశేఖర్ మిమిక్రీ రంగానికి చేసిన సేవలు అపారమైనవని కొనియాడారు. సభకు ముందు గాయనీ, గాయకులు ఆలపించిన సినీ గీతాలు అలరించాయి.


edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136